RNI TELTEL/2024/89620

నేటి
# శుభోదయం
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక







ప్రచురణ : తెలంగాణ, సంపుటి 02, సంచిక 339, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -12, శనివారం - 14 - మార్చి - 2026 , వెల రూ.5/-



## హిడ్మాను చిత్రహింసలకు గురి చేసి చంపేశారు

- మాజీ మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ
- హిడ్మా లొంగిపోతానని చెప్పినప్పుడు తాము వారించాం
- పోలీసుల ట్రాప్‌లో పడి ఆయన ప్రాణాలు కోల్పోయారని దేవ్‌జీ అన్నారు
- 'ఆపరేషన్ కగార్' సమయంలో బస్వరాజు చేసిన విజ్ఞప్తిని కేంద్రం పట్టించుకోకపోవడం వల్లే ప్రతిఘటన

2 లో

## అమిత్ షాకు కేటీఆర్ లేఖ



2 లో

- రేవంత్ రెడ్డి బినామీ కంపెనీపై కేసులను ప్రభుత్వం తారుమారు చేసింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు
- అధికారులపై ముఖ్యమంత్రి ఒత్తిడి తెచ్చి సాక్ష్యాలను మాయం చేయించారని మండిపడ్డారు
- రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోయే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ అన్నారు

# గ్యాస్ కొరత లేదు.. వదంతులు నమ్మొద్దు

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- గ్యాస్ కొరతపై నెలకొన్న అపోహల నేపథ్యంలో మంత్రి సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం
- ప్రజల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించేందుకు తక్షణ చర్యలు
- గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు
- నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లకు ఆదేశాలు జారీ
- ఎక్కడా ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం



**హైదరాబాద్ :** తెలంగాణలో గ్యాస్ సిలిండర్ల కొరత ఉందంటూ వస్తున్న వదంతులపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టత ఇచ్చారు. రాష్ట్రంలో గ్యాస్‌కు ఎలాంటి కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. గ్యాస్ కొరతపై నెలకొన్న అపోహల నేపథ్యంలో మంత్రి ఇవాళ సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలో గ్యాస్ నిల్వలు, సరఫరా పరిస్థితిపై మంత్రి కూలంకషంగా - మిగతా 2 లో

# రాష్ట్రంలో భారీగా భూ కేటాయింపులు

- పరిశ్రమలు, విద్యాలయాలకు పెద్దపీట
- ముగిసిన ఏపీ క్యాబినెట్ భేటీ
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది
- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జల జీవన్ మిషన్, పోలవరం ప్రాజెక్టు పనుల వేగవంతం
- కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం మరో ముందడుగు
- గిరిజన రైతులకు సబ్సిడీలు, మహిళల కోసం హాస్టళ్లు వంటి అనేక ముఖ్యమైన ప్రతిపాదనలను ఆమోదం
- మిషన్ శక్తి పథకం కింద రాష్ట్రంలో ఉద్యోగాలు చేసే మహిళల కోసం 'సఖీ నివాస్' పేరుతో 30 వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయం



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జల జీవన్ మిషన్, పోలవరం ప్రాజెక్టు పనుల వేగవంతం, కడప స్టీల్ ప్లాంట్‌కు భూ కేటాయింపులు, గిరిజన రైతులకు సబ్సిడీలు, మహిళల కోసం హాస్టళ్లు వంటి అనేక ముఖ్యమైన ప్రతిపాదనలను ఆమోదించారు. సమావేశం అనంతరం రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ - మిగతా 2 లో

## ఇక 24 గంటలూ షాపులు ఓపెన్..!




2 లో

- ఏపీ వ్యాపారులకు గుడ్ న్యూస్
- ఏపీలోని ప్రధాన ప్రాంతాల్లో 24 గంటలూ షాపుల నిర్వహణకు అనుమతి
- సులభతర వాణిజ్యంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు
- ఉద్యోగులకు వారానికి 48 గంటల పని, ఓవర్ టైం చెల్లింపు తప్పనిసరి
- 20 మందికి పైగా సిబ్బంది ఉన్న సంస్థలకు లైఫ్ టైమ్ రిజిస్ట్రేషన్ అవకాశం



2 లో

## ఏపీ హైకోర్టు జడ్జిగా జస్టిస్ లిసా గిల్

- ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ ప్రమాణస్వీకారం
- లిసా గిల్ తో ప్రమాణస్వీకారం చేయించిన చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్
- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ లిసా
- న్యాయరంగంలో జస్టిస్ లిసాకు అపారమైన అనుభవం

# ఈశాన్యంలో బీజేపీతోనే శాంతి

- కాంగ్రెస్‌వి అన్నీ స్వార్థంతో చేసుకున్న ఒప్పందాలే: మోదీ
- రెండు రోజుల అసోం పర్యటనలో ప్రధాని మోదీ
- రూ.4,570 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం
- మూడు కొత్త రైలు సర్వీసులకు జెండా ఊపిన ప్రధాని
- ఈశాన్య రాష్ట్రాల్లో శాశ్వతంగా శాంతిస్థాపనకు బీజేపీ చర్యలు
- బాంబు పేలుళ్లు, తుపాకీ కాల్పుల మోతలు గతంలో ఈశాన్య రాష్ట్రాల్లో వినిపించేవని, కానీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు వచ్చాక ఇక్కడి పరిస్థితి మారిపోయిందని ఆయన తెలిపారు



**ఢిల్లీ :** ఈశాన్య రాష్ట్రాల్లో శాశ్వతంగా శాంతిస్థాపనకు బీజేపీ చర్యలు చేపట్టిందని, కానీ స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీ వివిధ ఒప్పందాలు చేసుకుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. బాంబు పేలుళ్లు, తుపాకీ కాల్పుల మోతలు గతంలో ఈశాన్య రాష్ట్రాల్లో వినిపించేవని, కానీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు వచ్చాక ఇక్కడి పరిస్థితి మారిపోయిందని ఆయన తెలిపారు. ఇప్పుడు అసోం రాష్ట్రం శాంతి, అభివృద్ధిలలో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తోందన్నారు. అసోంలోని - మిగతా 2 లో



2 లో

## వారిని అంతం చేస్తున్నా

- ఇరాన్‌కు మరోసారి డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక
- ఇరాన్ నౌకాదళం ఇప్పటికే కనుమరుగయ్యిందని, ఇక వైమానిక దళం కూడా ఉండదని హెచ్చరించారు
- అక్కడి పాలకులు 47 ఏళ్ళుగా అమాయకులను పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు

# ఇజ్రాయెల్ వార్నింగ్ ఇచ్చిన కాసేపటికే భారీ పేలుడు

- ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుడు
- పాలస్తీనాకు మద్దతుగా భారీ ఎత్తున నిర్వహిస్తున్న 'కుద్స్ డే' ర్యాలీలో ఊహించని విధంగా తీవ్ర విస్ఫోటనం
- హెచ్చరికలు జారీ చేసిన కొద్దిసేపటికే ఈ ఘటన జరగడం గమనార్హం
- పవిత్ర రంజాన్ మాసం చివరి శుక్రవారం సందర్భంగా పాలస్తీనాతో సంఘీభావం తెలుపుతూ ఇరాన్ ప్రజలు ఈ నిరసనలు



**ఢిల్లీ :** ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుడు చోటుచేసుకుంది. పాలస్తీనాకు మద్దతుగా భారీ ఎత్తున నిర్వహిస్తున్న 'కుద్స్ డే' ర్యాలీలో ఊహించని విధంగా తీవ్ర విస్ఫోటనం సంభవించింది. ఇజ్రాయెల్ సైన్యం బహిరంగంగా హెచ్చరికలు జారీ చేసిన కొద్దిసేపటికే ఈ ఘటన జరగడం గమనార్హం. దాడికి ముందు ఇజ్రాయెల్ సైన్యం తమ అధికారిక పెర్షియన్ (ఫార్సీ) సోషల్ మీడియా ఖాతా ద్వారా మూడు మ్యాప్‌లను పంచుకుంది. టెహ్రాన్‌లోని చహార్రా-ఇ వెలియాస్, మేయ్దాన్-ఇ తౌహిద్, విల్లాస్ ప్రాంతాలను ఎరుపు రంగుతో మార్క్ చేసింది. ఈ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు వెంటనే సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని, త్వరలోనే దాడులు జరుగుతాయని చాలా స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది. ఈ హెచ్చరికలు వెలువడిన కొద్ది సమయానికే, టెహ్రాన్ యూనివర్సిటీ వైపు వెళుతున్న కుద్స్ డే ర్యాలీ సమీపంలో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. పవిత్ర రంజాన్ మాసం చివరి శుక్రవారం సందర్భంగా పాలస్తీనాతో సంఘీభావం తెలుపుతూ ఇరాన్ ప్రజలు ఈ నిరసనలు చేపడుతుంటారు. పేలుడు దెబ్బకు ఆకాశంలోకి దట్టమైన పొగలు ఎగిసిపడటంతో జనం ప్రాణభయంతో పరుగులు తీశారు. ప్రస్తుతం ఈ ఘటనలో - మిగతా 2 లో

# సంపాదకీయం

## నవ నేపాల్

ఇది జెన్‌జీ విజయం అంటున్నారంతా. నేపాలీలు గత పాలకులపట్ల ఎంత ఆగ్రహంగా ఉన్నారో బాలెన్‌షా ఘనవిజయం స్పష్టంగా తెలియచెబుతోంది. ఒక పార్టీ మూడింట రెండువంతుల మెజారిటీతో అధికారంలోకి రావడమన్నది ఆ దేశం ఎన్నడూ చూడనిది. పదిహేడేళ్ళ ప్రజాస్వామ్య చరిత్రలో , చివరకు 2008లో ప్రజాస్వామ్యానికి పునాదులు వేసిన మావోయిస్టులకు కూడా దక్కనంత అపూర్వమైన ప్రజాదరణ రాష్ట్రీయ స్వతంత్రపార్టీకి లభించింది. ఆ పార్టీ అధ్యక్షుడు రబీ లామిచేని, కాబోయే ప్రధాని బాలెన్‌షాలను భారతప్రధాని నరేంద్రమోదీ అభినందించి, పరస్పర సహకారంతో కలసి సాగుదామనడం, వారిద్దరూ చక్కగా, సానుకూలంగా ప్రతిస్పందించడం బాగుంది.సినిమా ఆఖరుఘట్టంలో దుష్టనాయకులను జనం తరిమితరిమికొట్టినట్లుగా నేపాల్ ప్రజలు తమకు నచ్చనివారిని అవమానకరమైన రీతిలో దింపేశారు. ఇది క్షణికావేశమనీ, సోషల్‌మీడియా నిషేధం ద్వారా ఖడ్గప్రసాద్ శర్మ ప్రభుత్వం కొరివితో తలగోక్కుందని అంతా అనుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు చేసిన సోషల్ మీడియా సంస్థలను చూసీచూడనట్టుగా వదిలివేసి ఉంటే నేపాల్‌లో ఏ మార్పూ ఉండేది కాదా? అన్నది అటుంచితే, ప్రజల్లో ఏళ్ళతరబడి గూడుకట్టుకొని ఉన్న నిరాశానిస్పృహలు ఒక్కసారిగా పెల్లుబుకడానికి ఆ నిషేధం దోహదం చేసింది. పాలకులు తక్షణమే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నా, వీధుల్లోకి వచ్చిన జనం నాయకులను దించేసేవరకూ వెనక్కుపోలేదు. దశాబ్దాలుగా అధికారంలో ఉన్నవారిని ఒక మహోద్యమంతో స్వల్పకాలంలోనే గద్దెదించేసిన ప్రజలు తగిన విచక్షణతో సరైనవారిని ఎన్నుకోగలరా? అన్న ప్రశ్నకు సమాధానంగా నేపాలీలు ఇప్పుడు బాలెన్‌షాను ముందుకు తెచ్చారు. పాతతరాన్ని వెనక్కునెట్టి, నవనాయకత్వాన్ని అధికారంలో కూచోబెట్టుకున్నారు.బాలెన్ సారథ్యంలో నేపాల్ ఒక కొత్త ప్రయాణం ఆరంభించింది. గతంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా, పహాడీలు, మధేశీలు అంటూ ఒక విభజన ఉండేది. ఇప్పుడు కొండ, లోయ ప్రాంతాలవారిద్దరూ ఒక్కటిగా బాలెన్‌కు పట్టం కట్టారు. మధేశీ, మైథిలీ మూలాలున్న వ్యక్తి ప్రధాని కావడం కూడా ఇదే మొదటిసారి. జెన్‌జీ ఉద్యమానికి నాయకత్వం వహించి నేపాలీలందరినీ ఏకతాటిపై నిలబెట్టడమేకాక, ఎన్నికలకు రెండునెలల ముందే ఆర్‌ఎస్‌పితో చేయి కలిపి దానికి ఘనవిజయాన్ని చేకూర్చడం విశేషం. కాంగ్రెస్, కమ్యూనిస్టులు, ఇతరత్రా చిన్నా చితకా పార్టీలన్నీ ఒక్కటై బాలెన్‌ను అధికారంలోకి రాకుండా అడ్డుకుంటాయన్న భయం కూడా ప్రజల్లో ఉన్నందునే ఆయనకు ఇంతటి ఘన విజయం చేకూరి ఉంటుంది. జెన్‌జీ ఉద్యమం దెబ్బకు కకావికలైన నాయకులంతా తిరిగి ఎన్నికల బరిలో నిలవడం, పార్టీ అంతర్గత సంస్కరణల పేరిటా, హామీల పేరిటా మళ్ళీ మభ్యపెట్టే ప్రయత్నం చేయడంతో, ఎన్నికల అనంతరం వీరంతా ఒక్కటై తమ నెత్తిన కూచోకుండా ప్రజలు ముందుగానే జాగ్రత్తపడ్డారని అర్థం.అనాదిగా సంకీర్ణ ప్రభుత్వాలనే అనుభవిస్తూ వచ్చిన నేపాలీలు ఇకపై ఆ అవసరమే లేని ప్రభుత్వాన్ని ప్రతిష్ఠించుకున్నారు. ఆయా రాజకీయపార్టీల మధ్య కుట్రలకు, వాటి నాయకుల మధ్య వెన్నుపోట్లకు తావులేకుండా చేశారు. అత్యంత కీలకమైన, విధానపరమైన నిర్ణయాలకు మోకాలడ్డుతూ తమదే పై చేయి కావడంకోసం ప్రజావ్యతిరేకంగా వ్యవహరించే పార్టీలకు స్వస్తిపలికారు. దశాబ్దంన్నరకు పైగా ఏ ఒక్క ప్రభుత్వమూ ఐదేళ్ళకు మించి నిలవని దేశంలో ఒక పార్టీకి కనీవినీ ఎరుగనంత మెజారిటీ కట్టబెట్టి సుస్థిరత సాధించుకున్నారు.ఒక గాయకుడు, ఒక టీవీస్టార్ చేయీచేయీ కలిపి అధికారంలోకి రావడం



బాగున్నది కానీ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలించడమే పెద్ద సవాల్. పాలనానుభవం లేని ఈ యువనాయకుల మీద ప్రజలు నమ్మకం పెట్టుకున్నారు. పదిహేడేళ్ళుగా తమను మోసం చేస్తున్న నాయకుల మాదిరిగా వీరు వ్యవహరించబోరని, తమను అష్టదరిద్రాలనుంచి బయటపడవేస్తారని జనం ఆశిస్తున్నారు. ప్రజలు ఎక్కువ కాలం ఓపికగా నిరీక్షించలేరన్న మాట నిజమే కానీ, వారి ఆశలన్నీ నెరవేర్చలేకపోయినా, అవినీతి, ఆశ్రితపక్షపాతాలకూ ఖర్చుదారీ విధానాలకూ దూరంగా ఉంటూ దేశాన్ని క్రమంగా గాడినపెట్టడానికి వీరిద్దరూ ప్రయత్నిస్తే అంతే చాలు. అధికారంలోకి రావడంకోసం అతివేగంగా ఒక్కటైన ఈ నాయకులు ఇద్దరూ రేపటిరోజుల్లో తమ మధ్య తలెత్తే విభేదాలను త్వరితంగా పరిష్కరించుకుంటూ ఐదేళ్ళూ కొనసాగడం మరింత ముఖ్యం.

## రాష్ట్రంలో భారీగా భూ కేటాయింపులు

**మొదటిపేజీ తరువాయి –**
నిర్ణయాలను వెల్లడించారు.

**భూ కేటాయింపులపై కీలక నిర్ణయాలు**

రాయలసీమ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు పరిధిలోని పలు గ్రామాల్లో 424.45 ఎకరాల ప్రభుత్వ భూమిని జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సంస్థకు కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.21.30 కోట్ల చెల్లింపుపై ఈ భూమిని ఏపీఐఐసీకి బదలాయించనున్నారు. రెండేళ్లలో ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వీటితో పాటు కిమ్స్ ఆసుపత్రికి 2 ఎకరాలు, సంబంధిత ట్రస్టుకు 23 ఎకరాలు, తుళ్లూరు ఎడ్యుకేషన్ సొసైటీకి 3 ఎకరాలు పరిహారంగా కేటాయించారు. బాపట్ల జిల్లాలో లగ్జరీ రిసార్టుల కోసం ఏపీ టూరిజం అథారిటీకి 17 ఎకరాలు, చిత్తూరు జిల్లాలో పర్యాటక అభివృద్ధికి 20 ఎకరాలు, నెల్లూరులో ఈఎస్ఐసీ ఆసుపత్రి నిర్మాణానికి ఎకరం భూమిని కేటాయించారు. ముత్తుకూరులో సింగపూర్ కంపెనీ సీఎస్ఆర్ నిధులు రూ.20 కోట్లతో నిర్మించనున్న ఆసుపత్రి కోసం 86 సెంట్ల భూమిని నామమాత్రపు ధరకు ఇచ్చేందుకు నిర్ణయించారు.

**గిరిజన రైతులకు 100 శాతం సబ్సిడీ**

దాత్రి ఆభా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్‌లో భాగంగా 8 గిరిజన జిల్లాల్లోని అటవీ హక్కు పత్రాలు (ఎఫ్ఆర్ఏ) ఉన్న రైతులకు ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. 'పర్ డ్రాప్ మోర్ క్రాప్' పథకం కింద డ్రిప్ ఇరిగేషన్‌పై 100 శాతం, స్ప్రింక్లర్లపై 90 శాతం సబ్సిడీని శాచురేషన్ పద్ధతిలో అందించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కొండ ప్రాంతాల్లో సాగు చేసే గిరిజనులకు నీటి వనరుల సమస్యను అధిగమించి, అధిక దిగుబడులు సాధించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను 54 శాతానికి పెంచుకోవడం వల్లే ఇది సాధ్యమైందని మంత్రి వివరించారు.

**నీటి కాలుష్య నివారణ చట్టానికి ఆమోదం**

కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'నీటి కాలుష్య నివారణ, నియంత్రణ సవరణ చట్టం–2024'ను రాష్ట్రంలోనూ అమలు



చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ కొత్త చట్టం ప్రకారం, చిన్న చిన్న ఉల్లంఘనలకు విధించే జైలు శిక్షలను తొలగించి, వాటి స్థానంలో జరిమానాలు మాత్రమే విధిస్తారు. ఈ చట్టాన్ని ఆమోదించడం ద్వారా రాష్ట్రంలోని కాలుష్య నగరాలకు 'నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం' కింద కేంద్రం నుంచి నిధులు పొందేందుకు, పరిశ్రమలపై ఫీజుల భారం తగ్గించుకునేందుకు వీలు కలుగుతుంది.

**ఉద్యోగినుల కోసం 'సఖీ నివాస్' హాస్టళ్లు**

మిషన్ శక్తి పథకం కింద రాష్ట్రంలో ఉద్యోగాలు చేసే మహిళల కోసం 'సఖీ నివాస్' పేరుతో 30 వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. సురక్షితమైన వసతితో పాటు, చిన్న పిల్లలున్న తల్లుల సౌకర్యార్థం ఈ హాస్టళ్లలో క్రెష్ (శిశు సంరక్షణ కేంద్రం) సదుపాయాన్ని కూడా కల్పిస్తారు. ఉద్యోగినులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో హాస్టల్ నిర్వహణకు 8 మంది సిబ్బందిని అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమిస్తారు.

**వ్యాపారులకు జీఎస్టీ ట్రైబ్యునల్స్**

జీఎస్టీ సంబంధిత వివాదాల పరిష్కారాన్ని సులభతరం చేసేందుకు, వ్యాపారులకు సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం అన్ని అప్పీళ్లను విజయవాడలోనే విచారిస్తుండటంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీన్ని నివారించేందుకు విశాఖపట్నం, తిరుపతి, విజయవాడలలో మూడు అప్పిలేట్ ట్రైబ్యునల్ కార్యాలయాలను నోటిఫై చేసేందుకు కేబినెట్ ఆమోదించింది. దీనివల్ల కేసులు త్వరగా పరిష్కారమై రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం కూడా సకాలంలో అందుతుంది.

**జల జీవన్ మిషన్‌కు భారీగా నిధులు**

ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన జల జీవన్ మిషన్ (జేజేఎమ్) పథకం గడువు ముగిసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ చొరవతో కేంద్రం దానిని 2028 వరకు పొడిగించింది. ఈ నేపథ్యంలో, వివిధ పథకాల కింద నిధులు సమకూర్చుకుని రూ.9,355 కోట్ల విలువైన ఏడు భారీ ప్రాజెక్టులకు మంత్రివర్గం పరిపాలన ఆమోదం తెలిపింది. అలాగే, తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న 3000 నివాస ప్రాంతాలకు రూ.1,814.71 కోట్లతో తాగునీటి పనులు చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టుల ద్వారా 76 మండలాల్లోని 65 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది.

**కొత్తగా కేంద్రీయ విద్యాలయాలు**

రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ఊతమిస్తూ మూడు కొత్త కేంద్రీయ విద్యాలయాల (కేవీ) ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం రాఘవాపురంలో 5 ఎకరాలు, ఏలూరు జిల్లా నూజివీడులో 7 ఎకరాలు, శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పురుషోత్తపురంలో 5 ఎకరాల చొప్పున భూమిని కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌కు కేటాయించారు. బదిలీలపై వచ్చే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలతో పాటు స్థానిక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం దీని ముఖ్య ఉద్దేశం.

**పోలవరం పనుల వేగవంతానికి ఆమోదం**

రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు పనులను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. కాంట్రాక్ట్ గడువు జూన్ 2027 వరకు ఉన్నప్పటికీ, పనులను త్వరగా పూర్తి చేసే లక్ష్యంతో మూడో గ్యాంట్రీ క్రేన్‌ను ఏర్పాటు చేసేందుకు అంగీకరించింది. ప్రాజెక్టులో లైనింగ్ పనులతో పాటు, సుదీర్ఘకాలం పనులు నిలిచిపోవడం వల్ల దెబ్బతిన్న రాతి పొరల వద్ద భద్రతా చర్యలు చేపట్టనున్నారు. ఈ అదనపు పనుల కోసం ప్యాకేజీ–63ఏ కు రూ.23.47 కోట్లు, ప్యాకేజీ–64ఏ కు రూ.24.51 కోట్ల అదనపు వ్యయానికి కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి పార్థసారథి వివరించారు.

## ఏపీ హైకోర్టు జడ్జిగా జస్టిస్ లిసా గిల్

**మొదటిపేజీ తరువాయి -**
ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టులోని మొదటి కోర్టు హాలులో జరిగిన కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి (జజీ) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆమెతో ప్రమాణం చేయించారు. పంజాబ్–హరియాణా హైకోర్టులో జస్టిస్ లిసా గిల్ సీనియారిటీలో 3వ స్థానంలో కొనసాగుతుండగా, ఆమెను ఏపీ హైకోర్టుకు బదిలీ చేస్తూ రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఇటీవల ఆమోదం ముద్ర వేశారు. హైకోర్టులో జస్టిస్ లిసా గిల్ సీనియారిటీలో 2వ స్థానంలో కొనసాగుతారు. హైకోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి (జజీ) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఏప్రిల్ 24న పదవీ విరమణ చేయనున్నారు. ఆ వెంటనే జస్టిస్ లిసా గిల్ హైకోర్టు సీజేగా ఆ స్థానంలో కొనసాగుతారు. ఏపీ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా ఆమె రికార్డు సృష్టించనున్నారు. హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తుల నియామకానికి ఆమోదం ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 33 ఉంది. తాజాగా జస్టిస్ లిసా గిల్ రాకతో ఆ సంఖ్య 34కు చేరింది.హైకోర్టు న్యాయమూర్తి విశేషాలు ఇవే: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ స్వస్థలం చండీగఢ్. అక్కడి కార్మెల్ కాన్వెంట్ స్కూల్‌లో పాఠశాల విద్య అభ్యసించారు. ప్రభుత్వ మహిళా కాలేజీలో హ్యూమానిటీస్‌లో డిగ్రీ చదివారు. పంజాబ్ యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పూర్తి చేశారు.జస్టిస్ లిసా గిల్ 1990లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకుని, పంజాబ్–హరియాణా హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. సివిల్, క్రిమినల్, రెవిన్యూ, రాజ్యాంగ పరమైన కేసుల ద్వారా అన్ని రంగాల్లో అనుభవం గడించారు. ఆమె సుదీర్ఘ కాలం పాటు చండీగఢ్‌కు పలు కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ బోర్డులకు ప్రాతినిధ్యం వహించారు. అనంతరం 2014 మార్చి 31న పంజాబ్–హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. పంజాబ్–హరియాణా హైకోర్టులో జస్టిస్ లిసా గిల్ సేవలు అందించారు.నియామకం 2 నెలలు ముందుగానే: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (జజీ×) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో ఇటీవల కొలీజియం సమావేశమైన విషయం తెలిసిందే. ప్రస్తుత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (జజీ) సీజే పదవీకాలం ఏప్రిల్ 24తో ముగుస్తుంది.ఈ నేపథ్యంలో జస్టిస్ లిసా గిల్‌ను ఏపీ హైకోర్టుకు న్యాయమూర్తిగా 2 నెలల ముందుగానే బదిలీ చేయాలని నిర్ణయించింది. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి (జజీ)గా ఉన్న జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ బాధ్యతల నుంచి వైదొగిలిన వెంటనే జస్టిస్ లిసా గిల్‌ను ఏపీ సీజేగా ప్రతిపాదిస్తూ కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.నూతన సంప్రదాయానికి శ్రీకారం: రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి సుప్రీంకోర్టు కొలీజియం నూతన సంప్రదాయానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుత సీజేల పదవీ విరమణ కాలం ముగియడానికి 2 నెలల ముందే, ఆ స్థానంలోకి కొత్త న్యాయమూర్తి పేరును ప్రతిపాదించాలని నిర్ణయించింది.న్యాయ పరిపాలన వ్యవస్థను బలోపేతం చేసి దాని సామర్థ్యం, నాణ్యతను పెంచేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని కొలీజియం పేర్కొంది. ఈ విధానం వల్ల హైకోర్టు సీజేగా బాధ్యతలు చేపట్టే లోపు ఆ హైకోర్టు వాతావరణానికి అలవాటు పడటానికి వీలవుతుందని పేర్కొంది. దీనిలో భాగంగా జస్టిస్ లిసా గిల్‌ను ఏపీ హైకోర్టుకు న్యాయమూర్తిగా తొలుత బదిలీ చేశారు. ప్రస్తుత సీజేగా ధీరజ్ సింగ్ ఠాకూర్ పదవీ విరమణ చేసిన వెంటనే ఆమె ఆ స్థానంలో నియమితులుకానున్నారు.

## ఈశాన్యంలో బీజేపీతోనే శాంతి

**మొదటిపేజీ తరువాయి –**
కోక్రఝర్ జిల్లాలో బీజేపీ ఏర్పాటు చేసిన బహిరంగ సభను ఉద్దేశించి గువహటి నుంచి ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. కోక్రఝర్‌లో జరిగే సభకు మోదీ వెళ్లాల్సి ఉండగా, అకస్మాత్తుగా వర్షం కురవడంతో ఆయన ప్రయాణానికి ఆటంకం కలిగింది. స్థానికుల భూములను చొరబాటుదారులకు కట్టబెట్టడం ద్వారా భారత జాతీయ భద్రతను కాంగ్రెస్ పార్టీ ప్రమాదంలోకి నెడుతోందని మోదీ విమర్శించారు. అందుకే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని శిక్షించి, ఈ దేశంలో చొరబాటుదారులకు చోటు లేదనే స్పష్టమైన సందేశాన్ని ఇవ్వాలని అసోం ప్రజలకు పిలుపునిచ్చారు.కాంగ్రెస్ పార్టీ అనేది అబద్ధపు హామీల దుకాణమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం సమాజంలోని వివిధ వర్గాల ప్రజల మధ్య హస్తం పార్టీ చీలికలను సృష్టిస్తోందని ఆయన మండిపడ్డారు. బోడోల్యాండ్‌కు చెందిన చాలా తరాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ తప్పుడు కలల ప్రపంచంలో ఉంచి కాలయాపన చేసిందన్నారు. కేంద్రంలో, అసోంలో బీజేపీ అధికారంలోకి వచ్చాకే బోడో శాంతి ఒప్పందంపై సంతకాలు జరిగాయని ప్రధాని మోదీ గుర్తుచేశారు. దీని ద్వారా అన్ని ప్రధాన సంస్థలు, గ్రూపులను ఏకతాటిపైకి తెచ్చామన్నారు. “కాంగ్రెస్‌కు చెందిన అబద్ధపు హామీల దుకాణంలో ప్రతీ అబద్ధపు హామీతో పాటు నాలుగు సూపర్ అబద్ధాలను బోనస్ గిఫ్టుగా ఇస్తుంటారు. ఎందుకంటే ఆ హామీలను నెరవేర్చాలనే ఉద్దేశమే కాంగ్రెస్ పార్టీకి ఉండదు. బీజేపీ అసోంలో గెలిచాకే, బోడోల్యాండ్‌లో శాంతి, వికాసం మొదలయ్యాయి. బోడో వర్గం ప్రజలు భాషను, సంస్కృతిని కాపాడుకుంటున్న తీరును తలుచుకుంటే నాకు గర్వంగా అనిపిస్తుంది. మీ ప్రేమకు నేను రుణపడిపోయాను. ఇక్కడ అభివృద్ధి పనులు చేసి ఆ రుణాన్ని తీర్చుకుంటాను. కొన్నివారాల క్రితం, బోడో సంస్కృతితో ముడిపడిన కార్యక్రమాలను చూసే అవకాశం నాకు గువాహటిలో లభించింది. 2020 అగ్రిమెంట్‌లో భాగంగా మేం ఇచ్చిన హామీలన్నీ ఒకదాని తర్వాత ఒకటిగా అమలుచేసి తీరుతాం. బోడో భాషకు ఇప్పటికే సహ అధికార భాష హోదాను ఇచ్చాం. బోడోల్యాండ్ వికాసానికి రూ.1,500 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ఇచ్చాం. ప్రస్తుతం కోక్రఝర్‌లో ఒక మెడికల్ కాలేజీ కూడా ఉంది. ఇళ్లకు తిరిగొచ్చిన కుమారుల తల్లులు అందరూ నాకు దీవెనలు ఇస్తున్నారు. ఆ యువకులంతా ఇప్పుడు కుటుంబాలతో సంతోషంగా, శాంతితో జీవిస్తున్నారు“ అని ప్రధాని మోదీ తెలిపారు. అసోంలోని కోక్రఝర్ జిల్లాకు సంబంధించిన రూ.4,570 కోట్లు విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించారు. కోక్రఝర్ జిల్లా బాష్‌బరీలో రైల్వేశాఖకు చెందిన పీరియాడిక్ ఓవర్ హాలింగ్ (పీఓహెచ్) వర్క్‌షాప్ పనులకు ప్రధాని మోదీ శుక్రవారం పునాది రాయి వేశారు. ఈ ప్రాజెక్టు వల్ల స్థానికంగా రైళ్ల నిర్వహణ సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయి.ప్రధాని పచ్చజెండా ఊపి కోక్రఝర్ జిల్లాతో పాటు ఈశాన్య రాష్ట్రాల మధ్య కనెక్టివిటీని పెంచే మూడు కొత్త రైలు సేవలకు శ్రీకారం చుట్టారు. ఈ మూడు రైలు సర్వీసుల్లో కామాఖ్య – చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, గువహటి – న్యూ జల్‌పాయ్‌గురి ఎక్స్‌ప్రెస్, నారంగి – అగర్తలా ఎక్స్‌ప్రెస్ ఉన్నాయి.కామాఖ్య – చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ అనేది ఈశాన్య రాష్ట్రాలతో దక్షిణ భారతదేశాన్ని లింక్ చేస్తుంది.ఈ కొత్త రైలు సర్వీసులు అసోంలో టూరిజం, రవాణా, వ్యవసాయం, గ్రామీణ వికాసాలకు ఊతం ఇస్తాయి.అసోం మాలా 3.0 అనే ప్రధానమైన రోడ్డు మౌలిక సదుపాయాల ప్రాజెక్టు పనులకు ప్రధాని మోదీ శుక్రవారం భూమిపూజను నిర్వహించారు. రూ.3,200 కోట్లు విలువైన ఈ ప్రాజెక్టు ద్వారా అసోంవ్యాప్తంగా 900కుపైగా కి.మీ రోడ్లను నిర్మించనున్నారు. నేషనల్ హైవేలను, గ్రామీణ రోడ్లతో అనుసంధానించనున్నారు.బోడోలాండ్ టెర్రిటోరియల్ కౌన్సిల్ ఏరియాలో 6 రోడ్డు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ప్రధాని మోదీ భూమి పూజను నిర్వహించారు. ఇందులో భాగంగా రూ.1,100 కోట్లతో నాలుగు ఫ్లై ఓవర్లు, రెండు బ్రిడ్జీలను నిర్మించనున్నారు.అసోంలోని సిల్చార్‌లో వివిధ ప్రాజెక్టులకు ప్రధాని మోదీ భూమి పూజ నిర్వహించనున్నారు. పనులు పూర్తయిన పలు ప్రాజెక్టులను దేశానికి అంకితం ఇవ్వనున్నారు. ఈ ప్రాజెక్టుల మొత్తం విలువ దాదాపు రూ.23,550 కోట్లు.వచ్చే (ఏప్రిల్) నెలలోనే అసోంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో రెండు రోజుల పర్యటన కోసం శుక్రవారం రోజే అసోంకు ప్రధాని మోదీ చేరుకున్నారు. ఇప్పటికే వరుసగా రెండు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయ దుందుభి మోగించింది. ఈసారి ఎన్నికల్లోనూ గెలిచి, వరుసగా మూడోసారీ అసోం అధికార పీఠాన్ని కైవసం చేసుకోవాలనే సంకల్పంతో మోదీసేన ఉంది.

## ఇక 24 గంటలూ షాపులు ఓపెన్..!

**మొదటిపేజీ తరువాయి –** ఏపీలోని వ్యాపారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. సులభతర వాణిజ్యంలో భాగంగా రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో దుకాణాలు, వాణిజ్య సంస్థలను 24 గంటలూ నిర్వహించుకునేందుకు అనుమతిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. 4 లక్షలు అంతకంటే ఎక్కువ జనాభా ఉన్న ప్రాంతాల్లో ఈ నిబంధన వర్తిస్తుందని స్పష్టం చేసింది.రాష్ట్ర కార్మిక శాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. షాపులు, వాణిజ్య సంస్థల చట్టం–1988లోని కొన్ని నిబంధనల నుంచి మినహాయింపు ఇస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, ఈ వెసులుబాటు కల్పిస్తూనే ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి ప్రభుత్వం కొన్ని స్పష్టమైన నిబంధనలను విధించింది. ప్రతి ఉద్యోగితో వారానికి గరిష్ఠంగా 48 గంటలు మాత్రమే పని చేయించాలని, ఆ సమయం మించితే తప్పనిసరిగా ఓవర్ టైం జీతం చెల్లించాలని ఆదేశించింది.అలాగే, ఉద్యోగులందరికీ వారానికి ఒక రోజు సెలవు ఇవ్వాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ సెలవు దినాల్లో పని చేయించాల్సి వస్తే, అందుకు బదులుగా మరో రోజు ప్రత్యామ్నాయ సెలవు మంజూరు చేయాలని పేర్కొంది. దీంతో పాటు 20 మంది లేదా అంతకంటే ఎక్కువ సిబ్బంది ఉన్న సంస్థలు లైఫ్‌టైమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందేందుకు కూడా కార్మిక శాఖ అనుమతించింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో వాణిజ్య కార్యకలాపాలు మరింత పెరిగే అవకాశం ఉండగా, అదే సమయంలో ఉద్యోగుల హక్కులకు భద్రత కల్పించడం గమనార్హం.

## వారిని అంతం చేస్తున్నా

**మొదటిపేజీ తరువాయి –** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్‌కు హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా అధ్యక్షుడిగా వారిని అంతం చేస్తున్నానని ట్రంప్ వ్యాఖ్యానించారు. మతిచెడిన నేతలకు ఈరోజు ఏం జరుగుతుందో మీరే చూస్తారని అన్నారు. ఇరాన్ నౌకాదళం ఇప్పటికే కనుమరుగయ్యిందని, ఇక వైమానిక దళం కూడా ఉండదని హెచ్చరించారు. క్షిపణులు, డ్రోన్లు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయని ఆయన అన్నారు. ఇప్పటికే వారి నాయకులు తుడిచిపెట్టుకుపోయారని అన్నారు. అక్కడి పాలకులు 47 ఏళ్ళుగా అమాయకులను పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. అందుకే అగ్రరాజ్యం అధ్యక్షుడిగా వారి అంతు చూస్తున్నానని ట్రంప్ అన్నారు. ఇదిలా ఉండగా, అమెరికాకు చెందిన రీఫ్యూయలింగ్ విమానం కేసీ–135 ట్యాంకర్ ఉత్తర ఇరాక్‌లో కుప్పకూలింది. ఈ ఘటనలో నలుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం సమయంలో విమానంలో ఆరుగురు ఉన్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, ఘటనకు దారి తీసిన చర్యలపై దర్యాప్తు చేస్తున్నామని అమెరికా మిలిటరీ సెంట్రల్ కమాండ్ తెలిపింది.

## ఇజ్రాయెల్ వార్నింగ్ ఇచ్చిన కాసేపటికే

**మొదటిపేజీ తరువాయి –** ఎంతమంది ప్రాణాలు కోల్పోయారు, ఎంతమంది గాయపడ్డారు అనే దానిపై ఇరాన్ ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సంఘటనా స్థలంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న తరుణంలో.. ఇజ్రాయెల్ ముందస్తు హెచ్చరికలు చేసిన వెంటనే ఈ పేలుడు జరగడం పశ్చిమాసియాలో మరింత ఆందోళనను రేకెత్తిస్తోంది.

## గ్యాస్ కొరత లేదు.. వదంతులు నమ్మొద్దు

**మొదటిపేజీ తరువాయి –** సమీక్షించారు. ప్రజల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు తప్పవని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులు, ప్రభుత్వ హాస్టళ్లకు సరిపడా గ్యాస్ సరఫరా అయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. ఎక్కడా ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు.

## హిడ్మాను చిత్రహింసలకు గురి చేసి చంపేశారు



**మొదటిపేజీ తరువాయి –** మాజీ మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ (తిప్పిరి తిరుపతి) లొంగిపోయిన సంగతి తెలిసిందే. ఆయుధాలను వదిలేసి ఆయన జన జీవన స్రవంతిలో కలిసిపోయారు. ఆయన మీడియా ప్రతినిధితో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. హిడ్మా లొంగిపోతానని చెప్పినప్పుడు తాము వారించామని, అయితే పోలీసుల ట్రాప్‌లో పడి ఆయన ప్రాణాలు కోల్పోయారని దేవ్‌జీ అన్నారు. హిడ్మాది వంద శాతం బూటకపు ఎన్‌కౌంటర్ అని, ఆయనను చిత్రహింసలకు గురిచేసి చంపేశారని ఆయన ఆరోపించారు. 'ఆపరేషన్ కగార్' సమయంలో బస్వరాజు చేసిన విజ్ఞప్తిని కేంద్రం పట్టించుకోకపోవడం వల్లే ప్రతిఘటన అనివార్యమైందని, ఆ పోరాటంలోనే బస్వరాజును కోల్పోయామని వెల్లడించారు.మరోవైపు, అగ్రనేత గణపతి గురించి స్పందిస్తూ.. 2023లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో ఆయనను చివరిసారిగా చూశానని, ఆ తర్వాత ఆయనతో సంబంధాలు లేవని దేవ్‌జీ స్పష్టం చేశారు. సమాజంలో దోపిడీ రూపం మార్చుకుందే తప్ప తొలగిపోలేదని... దోపిడీ ఉన్నంత కాలం ఉద్యమం కొనసాగుతుందని ఆయన వ్యాఖ్యానించారు. మావోయిస్టు పార్టీపై నిషేధాన్ని ఎత్తివేసి, జైళ్లలో ఉన్న వారిని రాజకీయ ఖైదీలుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజకీయ పదవుల కోసం తాను ఎన్నికల్లో పోటీ చేయబోనని, చట్టం పరిధిలోనే ఉండి ప్రజా సమస్యలపై పోరాడతానని దేవ్‌జీ ప్రకటించారు.

## అమిత్ షాకు కేటీఆర్ లేఖ



**మొదటిపేజీ తరువాయి –** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బినామీ కంపెనీ కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్‌పై కేసులను ప్రభుత్వం తారుమారు చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి బినామీ వ్యాపారాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు కేటీఆర్ లేఖ రాశారు. ఈ లేఖ ప్రతులను కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, అర్జున్ రామ్ మేఘవాల్‌లకు కూడా పంపించారు.తెలంగాణలో శాంతిభద్రతలు దిగజారాయని ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. కేఎల్ఎస్ఆర్ సంస్థపై కేసులు నమోదు కాగా, విచారణ వేళ ముఖ్యమంత్రి ఆదేశాలతో ప్రభుత్వం సాక్ష్యాధారాలను తారుమారు చేసిందని ఆరోపించారు. సాక్ష్యాలు పోయాయని చెప్పడం దారుణమని అన్నారు. అధికారులపై ముఖ్యమంత్రి ఒత్తిడి తెచ్చి సాక్ష్యాలను మాయం చేయించారని మండిపడ్డారు.రాష్ట్రంలో విచారణ సంస్థలు, పోలీసులను నమ్మే పరిస్థితి లేదని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోయే పరిస్థితి వచ్చిందని అన్నారు. కేఎల్ఎస్ఆర్ కంపెనీ దివాలా తీసినా రేవంత్ రెడ్డి కాంట్రాక్టులు కేటాయించడం సరికాదని అన్నారు. ఈ సంస్థపై విచారణ జరగాలని, అది నిష్పక్షపాతంగా జరగాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేంద్ర ఏజెన్సీలు విచారణ చేయాలని సుప్రీంకోర్టు సూచించినా రాష్ట్రం పట్టించుకోలేదని అన్నారు.

# ఉగాది అమావాస్య సందర్భంగా



భక్తులకు మనవి బుధవారం 18 3 2026 నాడు ఉగాది అమావాస్య సందర్భంగా కాలసర్ప దేవాలయంలో రాహు కేతు సహిత సర్పదోష నివారణ పూజలు జరుపబడుచున్న వి, ఇందులో భాగంగా ఉదయం 9 గంటల నుండి 1, వరకు విశేష పూజా కార్యక్రమంలో భాగంగా నవగ్రహ ఆరాధన సర్ప సూక్త పారాయణము నవగ్రహ హోమము దత్త హోమము సర్పహోమము కుజ గ్రహ కుజదోష నివారణకు హోమము రాహుకేతు హోమము నక్షత్ర హోమము వివిధ దేవత మూలమంత్ర మాల మంత్ర సహిత హోమములు మరియు మానసా దేవి సహిత ప్రత్యంగిరా హోమము జరుపబడుచున్నది ఈ కార్యక్రమంలో అన్నదానం ఏర్పాటు చేయడం జరిగిందిఈ పూజలో పాల్గొను భక్తులు మీ గోత్రము పేరు తెలియజేసి సంప్రదించగలరు 9010892893 టెంపుల్ నెంబర్

# ఐ.ఎన్.టి.ఎస్.ఓ లెవెల్ 2 లో చింతల బ్రాంచ్ విద్యార్థుల విజయకేతనం

### కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద్ అభినందన




హైదరాబాద్, చింతల్ :: శ్రీ చైతన్య స్కూల్ జాతీయ స్థాయిలో నిర్వహించిన ఐ. ఎన్. టి .ఎస్ .ఓ లెవెల్ 2 ఎగ్జామ్ లో శ్రీ చైతన్య స్కూల్ చింతల్ బ్రాంచ్ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గ్రాండ్ ప్రైజ్ సాధించిన విద్యార్థి (అభినయ రెడ్డి లాప్టాప్), మొదటి బహుమతి సాధించిన విద్యార్థి(దిత్యా టాప్) లను అభినందించారు. గ్రాండ్ ప్రైజ్ మరియు మొదటి ప్రైజ్ సాధించిన విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో లాప్టాప్ , టాప్ లను అందించి వారిని అందించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గ్రాండ్ ప్రైస్ -1, మొదటి ప్రైస్-1 , రెండవ ప్రైస్-1 మూడో ప్రైజ్- 2, నాలుగవ ప్రైస్ -2,ఐదవ ప్రైస్ -3,కన్సోలేషన్ ప్రైసెస్ -64,స్పెషల్ ప్రైసెస్-12 మరియు గోల్డ్ మెడల్స్ -116మొత్తం -202 మంది విద్యార్థులు సాధించాలని సాధించారని అన్నారు. ఐ ఎన్ టి ఎస్ ఓ లెవెల్ 2 లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్వేతా రెడ్డి ,ఏ.జీ.ఎం శివరామకృష్ణ ,ఆర్. ఐ పద్మజ, అకాడమిక్ కోఆర్డినేటర్స్ మురళీకృష్ణ మరియు వెంకట శివ ,పాఠశాల డీన్ సైదులు, సి ఇంచార్జ్ అంజలీదేవి, ప్రైమరీ ఇంచార్జ్ లావణ్య మరియు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.




## పోమల్ పల్లి అభివృద్ధికి మరో అడుగు విద్యుత్ లైన్ మంజూరు

### గ్రామ అభివృద్ధే లక్ష్యం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనుమగల్ల రమేష్




కేశంపేట, నేటి శుభోదయ :కేశంపేట మండలం పోమల్ పల్లి గ్రామానికి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా కల్పించేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశాల మేరకు కొండారెడ్డిపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి పోమల్ పల్లి వరకు ప్రత్యేకంగా విద్యుత్ లైన్ ఏర్పాటు చేయనున్నారు. గ్రామంలో చాలా కాలంగా కొనసాగుతున్న లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు, కాంగ్రెస్ నాయకులు పలుమార్లు కోరారు.ఈ నేపథ్యంలో కేశంపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనుమగల్ల రమేష్, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి గ్రామానికి 24 గంటల విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతిపత్రం సమర్పించారు. సమస్యను పరిశీలించిన ఎమ్మెల్యే వెంటనే స్పందించి విద్యుత్ శాఖ అధికారులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పోమల్ పల్లి గ్రామానికి విద్యుత్ స్తంభాలు ఇప్పటికే చేరుకున్నాయి. త్వరలోనే కాంట్రాక్టర్ ద్వారా పనులు



ప్రారంభించి వేగంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. కొత్త విద్యుత్ లైన్ పూర్తయితే గ్రామానికి 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి రానుంది. దీంతో గ్రామంలోని గృహాలు, రైతులు మరియు చిన్న వ్యాపారులు ప్రయోజనం పొందనున్నారు.తమ గ్రామానికి నిరంతర విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఉత్తమ ఫలితాలతోనే ఉజ్వల భవిష్యత్తు



నేలకొండపల్లి, నేటి శుభోదయ ::: విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ సమకూర్చిన పరీక్షా సామాగ్రి సద్వినియోగం చేసుకోవాలని, పదవతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు పొందుతారని ప్రధానోపాధ్యాయులు యం. నరేందర్ తెలిపారు.చెరువుమాధారం ఉన్నత పాఠశాలలో పదవతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ప్రధానోపాధ్యాయులు నరేందర్ మాట్లాడారు.విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని, తల్లిదండ్రులు కన్నకలలు నెరవేర్చటానికి కృషిచేయాలని ప్రధానోపాధ్యాయులు నరేందర్ విద్యార్థులను కోరారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉజ్వల, యం శ్రీలత, ఎస్ శ్రీనివాస్, ఆర్ అరవింద్, వి కల్పవల్లి, పి వేణు, పి మంగేశ్వరి, బి ప్రసాద్, వి ఈశ్వరమ్మ, పి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రేపటి భవిష్యత్తు కు క్రమశిక్షణ, సమయపాలన పునాది



వైరా, నేటి శుభోదయ ::: విద్యార్థుల రేపటి భవిష్యత్తు కు క్రమశిక్షణ, సమయపాలన పునాది గా ఉపకరిస్తాయని పాలడుగు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇమ్మానుయేల్ అన్నారు.పాలడుగు ఉన్నత పాఠశాలలో పదవతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం ప్రధానోపాధ్యాయులు ఇమ్మానుయేల్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ సమకూర్చిన పరీక్షా సామాగ్రిని విద్యార్థులకు పంపిణీ చేసారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వాలి సురేష్ బాబు, డి సునంద, ఎస్కే. ఇర్షాద్, జె. రవి తదితరులు పాల్గొన్నారు.

## గిర్గెట్పల్లిఅలంపల్లి రైల్వే గేట్ రహదారి వివాదం

### కలెక్టర్ ఆదేశాలతో స్థల పరిశీలన

### పరిశీలనకు వచ్చిన పోలీస్ అధికారులు

నేటి శుభోదయ వికారాబాద్ 13 మార్చి :వికారాబాద్ సమీపంలోని గిర్గెట్పల్లిఅలంపల్లి గ్రామాల మధ్య ఉన్న రైల్వే గేట్ రహదారి విషయంలో గ్రామస్తులు మరియు రైతులు జిల్లా కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు. దాదాపు 100 సంవత్సరాలుగా ఈ రహదారిని రెండు గ్రామాల ప్రజలు తమ రాకపోకల కోసం, అలాగే రైతులు తమ వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు ప్రధాన మార్గంగా ఉపయోగిస్తున్నామని వారు తెలిపారు.అయితే ప్రస్తుతం ఒక వ్యక్తి ఈ రహదారిపై రాకపోకలను అడ్డుకుంటున్నాడని గ్రామస్తులు ఆరోపించారు. దీంతో గ్రామాల ప్రజలు మరియు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ మార్గానికి ప్రభుత్వం ఇప్పటికే బీటీ రోడ్డు మరియు స్లాబ్ కల్వర్ట్ నిర్మాణ పనులకు అనుమతులు ఇచ్చిన నేపథ్యంలో, ఎలాంటి అడ్డంకులు లేకుండా ప్రజలు మరియు రైతులు ఈ రహదారిని వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ను కోరారు.గామస్తుల వినతిపై స్పందించిన జిల్లా కలెక్టర్ ఆ ప్రదేశాన్ని పరిశీలించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీనిలో భాగంగా సంఘటనా స్థలానికి పోలీసులు మరియు అధికారులు చేరుకొని పరిస్థితులపై సమాచారం సేకరించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రఘు కుమార్ అక్కడి పరిస్థితులను పరిశీలించి వివరాలు సేకరించారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ వైస్ మార్కెట్ కమిటీ చైర్మన్ మేకా చంద్రశేఖర్ రెడ్డి, 22వ వార్డు కౌన్సిలర్ లంకా లక్ష్మీకాంత్ రెడ్డి, కొత్తగడి కౌన్సిలర్ ప్రభాకర్ రెడ్డి వీరేష్ కుమార్, ఉమ్మెత్తల శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే అలంపల్లి మరియు గిర్గెట్పల్లి గ్రామాలకు చెందిన గ్రామస్తులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.





# పేదల సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం

**తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**- 2 సంవత్సరాలలో బీరోలు గ్రామ అభివృద్ధికి 29 కోట్ల 92 లక్షలు మంజూరు**

**- తిరుమలాయపాలెం మండలంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి**



ఖమ్మం, తిరుమలాయపాలెం, నేటి శుభోదయ ::: పేదల సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శుక్రవారం తిరుమలాయపాలెం మండలంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.బీరోలులో 2 కోట్ల 59 లక్షలతో బీరోలు నుండి ఏలువారిగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, 64 లక్షలతో ఎస్సీ కాలనీలో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, బంధంపల్లిలో 5 కోట్ల 50 లక్షలతో దమ్మాయిగూడెం నుండి సోలిపురం రోడ్డు హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా బీరోలులో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత పేద ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ఆత్మ గౌరవంగా జీవించేలా చర్యలు చేపట్టిందని, ఇందులో భాగంగా ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం సరఫరా, నూతన రేషన్ కార్డులు, సన్న వడ్లకు 500 రూపాయల బోనస్, రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి అనేక కార్యక్రమాలు అమలు చేసిందని అన్నారు. 2 కోట్ల 59 లక్షలతో బీరోలు నుండి ఏలువారి గూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు, 64 లక్షలతో నిర్మించనున్న అంతర్గత రోడ్లు, బంధంపల్లిలో 5 కోట్ల 50 లక్షలతో దమ్మాయి గూడెం నుండి సోలిపురం రోడ్డు హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు నేడు శంకుస్థాపన చేసుకున్నట్లు మంత్రి తెలిపారు. బంధం పల్లి నుండి అస్నాబాద్ వరకు 4 కోట్ల 5 లక్షల రూపాయలతో చేపట్టిన తారు రోడ్డు, కట్టెల పాడు నుంచి బీరోలు వరకు 6 కోట్ల 50 లక్షలతో తారు రోడ్డు, చౌటుపల్లి బీరోలు రోడ్డుకు 3 కోట్ల 20 లక్షల కల్వర్టు నిర్మాణం, కూసుమంచి బీరోలు రోడ్డుకు 2 కోట్లతో కల్వర్టు నిర్మాణం, బీరోలు నుంచి మేడేపల్లికి కోటి 87 లక్షలతో తారు రోడ్డు, బీరోలు నుంచి మేడేపల్లి రోడ్డు సిడీ పనులకు 30 లక్షల రూపాయలు, బీరోలు పెద్ద చెరువు మరమ్మత్తుకు 2 కోట్ల 25 లక్షలు, 80 లక్షలతో అంతర్గత సిసి రోడ్లు, 15 లక్షలతో అంగన్వాడి భవనం, 6 లక్షల రూపాయలతో త్రాగునీటి సరఫరా పనులు పూర్తి చేశామని, బీరోలు గ్రామానికి ప్రజా ప్రభుత్వం రెండు సంవత్సరాల మూడు నెలల్లో 29 కోట్ల 92 లక్షలు ఖర్చు చేసిందని అన్నారు.

రాష్ట్రంలో ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామని, పేదలకు అందించే సంక్షేమ కార్యక్రమాలు, రైతును రాజును చేసేందుకు తీసుకుంటున్న చర్యలు, మహిళలు ఆత్మ గౌరవంతో జీవించేలా పలు కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. నిరుద్యోగ యువత కు గతంలో ఎన్నడూ లేని విధంగా 72 వేల ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. సాగునీరు, త్రాగునీటి సమస్య రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ప్రభుత్వం భవిష్యత్తులో పేదలకు మరింత అండగా ఉంటుందని అన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ బీరోలు గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నూతనంగా ఎన్నిక కాబడిన పాలక వర్గానికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పేరిట ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రజా ప్రతినిధులకు అవసరమైన శిక్షణ అందించామని, ప్రభుత్వ ఆశయాల మేరకు 99 రోజుల వ్యవధిలో పంచాయతీకి విడుదలైన నిధులు వినియోగిస్తూ గ్రామాలలో పారిశుద్ధ్యం, పచ్చదనం, చిన్న చిన్న మరమ్మత్తు పనులు చేయాలని అన్నారు. అనంతరం సమావేశంలో రాకాసితండా గ్రామంలోని ఆకేరు ముంపు బాధిత కుటుంబాలకు ఇందిరమ్మ గృహాల మంజూరు పత్రాలను, తిరుమలాయపాలెం మండలానికి చెందిన మస్జిద్ కమిటీలకు, ముస్లిం లకు రంజాన్ గిఫ్ట్ ప్యాకెట్లను మంత్రి అందజేశారు.అనంతరం బీరోలు గ్రామంలోనీ శ్రీరామ లింగేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులను శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్,తహసీల్దార్ విల్సన్, ఎంపీడీఓ సిలారు సాహెబు, సర్పంచ్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# అమ్మాయిపల్లి గ్రామంలో మిత్ర కంటి వైద్య శిబిరం ఏర్పాటు విజయవంతం

### గ్రామ సర్పంచ్ మాదగౌని కవిత ప్రభంజన్ గౌడ్



చిన్నంబావి మండల వనపర్తి జిల్లా నేటి శుభోదయ: చిన్నంబావి మండల పరిధిలోని అమ్మాయి పల్లి గ్రామంలో వనపర్తి జిల్లాకు సంబంధించిన మిత్ర కంటి హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ మాదగౌని కవిత ప్రభంజన్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అనంత నరేష్ గౌడ్, మరియు వార్డ్ మెంబెర్స్ అల్లెన్న గౌడ్, పావని కవిందర్ గౌడ్, వెంకటేష్ గౌడ్, కురువ బుడ్డయ్య, మౌలాలి మరియు గ్రామ ప్రజలు, హాస్పిటల్ యాజమాన్యం తో కలిసి ఉదయం 9 గంటలకు గ్రామ పంచాయతీ (రచ్చకట్ట) దగ్గర మిత్ర కంటి ఆసుపత్రి వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం ను ప్రారంభించడం జరిగింది. గ్రామ సర్పంచ్ కవిత ప్రభంజనం గౌడ్ మాట్లాడుతూ అమ్మాయి పల్లి గ్రామ ప్రజలందరూ ప్రతి ఒక్కరు ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ శిబిరాన్ని ప్రజలు వారి కంటి చూపు, ముందు చూపు కోసమై జాగ్రత్తల కోసం టెస్ట్ కంటి పరీక్షలు చేయించు కోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. మిత్ర కంటి వైద్యశాల బృందం వారు ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవడం జరిగింది. గ్రామ ప్రజల తరపున గ్రామ సర్పంచ్ మాధగౌని కవిత ప్రభంజన్ గౌడ్ హాస్పిటల్ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తు ముందు ముందు ఎన్నో కార్యక్రమాలు అమ్మాయి పల్లి గ్రామ ప్రజలకు సద్వినియోగం చేసుకునే విధంగా ఏర్పాటు చేయాలని మిత్ర కంటి వైద్యశాల యజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వీజీబీ రాంజీ చట్టాన్ని రద్దు చేయాలి

### సిపిఎం డిమాండ్.



వనపర్తి జిల్లా నేటి శుభోదయ :చిన్నంబావి:కేంద్ర ప్రభుత్వం విబిజి రాంజీ చట్టాన్ని రద్దుచేసి ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని సిపిఎం వనపర్తి జిల్లా కమిటీ సభ్యులు ఎం. ఆది,సిపిఎం నాయకులు రాముడు డిమాండ్ చేశారు. శుక్రవారం చిన్నంబావి మండలం, దగడ పల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో వారి సమస్యలపై మాట్లాడటం జరిగింది. 2004లో యూపీఏ ప్రభుత్వంలో వామపక్షాల మద్దతుతో ప్రభుత్వాన్ని పరిపాలనలో పేదలకు గ్యారెంటీ పనిచేసే పథకం ఉండాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వంలో పోరాడి సాధించుకున్న చట్టానికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నామకరణం చేశారు.సంవత్సరానికి 100 రోజుల పని దినాలు కల్పిస్తూ చట్టాన్ని తీసుకొని రావడం జరిగింది అన్నారు.అప్పటి నుంచి ఈ పథకం 2025 వరకు కొనసాగుతూ వచ్చిందని ప్రజలందరూ 200 పని దినాలు పెంచి రోజువారి వేతనం 600 రూపాయలు ఇవ్వాలని పోరాటాలు కొనసాగిస్తుంటే పిడుగు పడ్డట్టు కేంద్ర ప్రభుత్వం పాత ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చి చట్టాన్ని సవరించి కొత్తగా విబిజి రాంజీ అనే పేరుతో అనేక రకాల లొసుగులతో కొత్త పథకానికి నాంది పలికారని ఈ చట్టం ఉపాధి హామీ పథకానికి ఎలాంటి గ్యారెంటీ లేకపోగా నిర్వీర్యం చేసే దిశగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలందరూ గమనించి కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని వారు అన్నారు.బి

## తెలుగు సాహిత్య కవి కుమ్మరి మొల్లమాంబ జయంతి వేడుకలు ఘనంగా ఏర్పాటు

### నిజామాబాద్ జిల్లా రూరల్ ప్రతినిధి భీంగల్ పట్టణం

(నేటిశుభోదయ)మార్చి13.:16వ శతాబ్దపు తెలుగు సాహిత్యపు కవి కుమ్మరి ముద్దుబిడ్డ మొల్లమాంబ



జయంతి వేడుకలను పట్టణ కేంద్రంలోని శాలివాహన సంఘం భవనంలో అధ్యక్షుడు గొల్లపల్లి సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ మాట్లాడుతూ సాధారణ కుటుంబంలో పుట్టిన మొల్ల మాంబ తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధి చెందిన గొప్ప కవి అని తెలిపారు. రామాయణం అందరూ చదవాలని సదుద్దేశంతో మొల్ల రామాయణం అనే గ్రంథాన్ని సరళమైన భాషలో రాసి విద్య ఎక్కువ లేకపోయిన పట్టుదల భక్తితో ఏదైన సాధించవచ్చని నిరూపించిన గొప్ప మహిళ అని తెలిపారు. పుట్టుకే కాదు ప్రతిభ మనల్ని గొప్ప వాళ్లని చేస్తుందని నిరూపించిన వీర వనిత ఆమెని కొనియాడరు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు సాగర్, సుఖేష్ సాయికుమార్, ప్రశాంత్, నిశాంత్, పురుషోత్తం, రాజేశ్వర్, శ్యామ్, రాములు, శంకర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. మొల్ల చిత్రపటనికి నివాళులర్పిస్తున్న శాలివాహన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విదేశాల్లోని తెలంగాణ వలస కార్మికుల వివరాలపై లోకసభలో ఖమ్మం ఎంపీ ఆరా

**- రాష్ట్రాల వారీగా డేటాబేస్ ఉందా**

**- తెలంగాణకు చెందిన పురుషులు, మహిళా కార్మికుల గణాంకాలు వెల్లడించండి**



న్యూ ఢిల్లీ, నేటి శుభోదయ ::: విదేశాల్లో ఉపాధి కోసం వెళ్లిన తెలంగాణ వలస కార్మికుల గణాంకాలు, రాష్ట్రాల వారీగా డేటాబేస్ వివరాలు వెల్లడించాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పార్లమెంట్ మలి విడత బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఈ అంశాన్ని ఆయన శు క్రవారం లోక్‌సభలో లేవనెత్తారు.ఈ ప్రశ్నకు కేంద్ర విదేశీ వ్యవహారాలు, టెక్స్‌టైల్స్ శాఖల సహాయ మంత్రి పబిత్ర మార్గరీటా లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.- డేటాబేస్ నిర్వహణ ఇలా విదేశాల్లో ఉపాధి, ఉద్యోగాల కోసం వెళ్లే వలస తనిఖీ విధానం (ఈసీఆర్) పాస్‌పోర్ట్ కలిగిన భారత కార్మికుల వివరాలను ఈ-మైగ్రేట్ పోర్టల్ ద్వారా నమోదు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. విదేశాల్లో పనిచేస్తున్న కార్మికుల సమాచారాన్ని ఈ పోర్టల్‌లో నమోదు చేసి అవసరానికి అనుగుణంగా నవీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.గడిచిన ఐదేళ్లలో విదేశాలకు వెళ్లిన వారిలో 46,614 మంది పురుషులు, 858 మంది మహిళా కార్మికులు 2021లో విదేశాలకు వెళ్లిన తెలంగాణ కార్మికుల్లో 4,255 మంది పురుషులు, 120 మంది మహిళలు, 2022లో 11,790 మంది పురుషులు, 200 మంది మహిళలు, 2023లో 10,151 మంది పురుషులు, 221 మంది మహిళలు, 2024లో 9,663 మంది పురుషులు, 187 మంది మహిళలు, 2025లో 10,755 మంది పురుషులు, 130 మంది మహిళలు విదేశాలకు వెళ్లారని, ఈ ఐదేళ్ల కాలంలో మొత్తం 46,614 మంది పురుషులు, 858 మంది మహిళలు తెలంగాణ నుంచి విదేశాలకు ఉపాధి కోసం వెళ్లినట్లు కేంద్ర మంత్రి గణాంకాలు వెల్లడించారు. విదేశాల్లో కార్మికులకు సహాయం అందించేందుకు విదేశాల్లో ఇబ్బందులు ఎదుర్కొనే భారతీయులకు సహాయం అందించేందుకు ఇండియన్ కమ్యూనిటీ వెల్ఫేర్ ఫండ్ (ఐసిడబ్ల్యూఎఫ్ ) ద్వారా అవసరమైన సహాయం అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. వసతి, అత్యవసర వైద్యం, న్యాయ సహాయం, స్వదేశానికి రప్పించడం వంటి సేవలు అందించవచ్చని వివరించారు. తమ సమస్యలను తెలియజేయడానికి మా డెడ్, సిపిగ్రామ్స్ , ఈ మైగ్రేట్ వంటి ఆన్‌లైన్ ఫిర్యాదు వ్యవస్థలతో పాటు భారత రాయబార కార్యాలయాల్లో 24 గంటల హెల్ప్‌లైన్‌లు కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు.

## పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత



వరంగల్ ప్రతినిధి : మార్చి 13 నేటి శుభోదయ:పదవ తరగతి పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని సెంట్రల్ డీసీపీ తెలిపారు.వరంగల్ జిల్లా పరిధిలోని పరీక్ష కేంద్రాల వద్ద శాంతిభద్రతల రక్షణ లో భాగంగా సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్(144 సెక్షన్) అమలు చేయనున్నట్లు తెలిపారు.వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మొత్తం 150 పరీక్ష కేంద్రాల్లో( హన్మకొండ 64,వరంగల్ 47, జనగామ 39) నేటి నుండి ఏప్రిల్ 16 నుండి 2026 వరకు ఉదయం 09:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని డీసీపీ తెలిపారు.1. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడరాదు. 2. సభలు, సమావేశాలు, ర్యాలీ లు, ధర్నాలు నిషేధం. 3. పరీక్ష కేంద్రాల నుండి 500 మీటర్ల పరిధిలోని అన్ని జిరాక్స్ కేంద్రాలు తేది రేపటి నుండి ఏప్రిల్ 16 నుండి 2026 వరకు ప్రతిరోజూ ఉదయం 06:00 గంటల నుండి మధ్యాహ్నం 02:00 గంటల వరకు మూసివేయాలని డీసీపీ ఆదేశించారు. ఎవరైనా ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయని డీసీపీ హెచ్చరించారు

## శాలివాహన సంఘశీ ఆధ్వర్యంలో ఘనంగా

### శ్రీ శ్రీ అక్కమహాదేవి జయంతి వేడుకలు



నేటి శుభోదయ మార్చి 13 శేరిలింగంపల్లి :శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ పి జె ఆర్ స్టేడియంలో ఘనంగా శ్రీ శ్రీ అక్కమహాదేవి జయంతి వేడుకలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై అక్కమహాదేవి చిత్రపటాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పుష్పాంజలి ఘటించి ఆమె ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మాట్లాడుతూ అక్కమహాదేవి జీవితంలో ఉన్న భక్తి, త్యాగం మరియు ఆధ్యాత్మిక సందేశాలు సమాజానికి ఆదర్శమని తెలిపారు. ఆమె చూపిన మార్గం యువతకు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. జయంతి సందర్భంగా భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమానికి గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేశారు. ఈ వేడుకలను నిర్వహించిన కమిటీ సభ్యులను స్థానికులు అభినందించారు. కుదురుతే ప్రభుత్వం ఈ పండుగ రోజున సెలవు ప్రకటించాలి అని కోరుతున్నాము. ఈ కార్యక్రమం లో చైర్మన్ ఊరిటి వెంకట్ రావు ప్రజపతి,వైస్ చైర్మన్ పేదపూడి శ్రీనివాస్ ప్రజపతి, అధ్యక్షులు పులివర్తి సుబ్బారావు, ఉపాధ్యక్షులు నిడమనూరి రమణయ్య, ప్రధాన కార్యదర్శి మద్దిగొండ అంకమరావు, సంయుక్త కార్యదర్శి నిజాంపట్నం నరసింహారావు, కోశాధికారి మోదుకూరి శ్రీనివాస్ రావు, కార్యవర్గ సభ్యులు ఉరిటి వీరరాఘవులు, వల్లూరి గోపయ్య, ఈమని శ్రీనివాస్ రావు, మోదుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

## ఇల్లులేని ప్రతి పేద కుటుంబానికి డబల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించాలి సమతాప్రకాష్ ముదిరాజ్




( నేటి శుభోదయ ప్రతినిధి మహేశ్వరం మార్చ్ 13:) రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని సర్దార్ నగర్ లో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు సమత ప్రకాష్ మాట్లాడుతూ... ఇల్లు లేని పేద కుటుంబాలను గుర్తించి డబల్ బెడ్ ఇండ్లని కేటాయించాలని హౌసింగ్ ఎండి గౌతమ్ రెవెన్యూ అధికారులను కోరారు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం మహేశ్వరం మండలం మంకాల రెవెన్యూ పరిధిలోని సర్దార్ నగర్ వద్ద నిర్మించిన రెండు పడకల లబ్ధిదారుల తో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు ఈ సందర్భంగా స్థానిక నాయకురాలు కందుల సమతా ప్రకాష్ మహేశ్వరం నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు ఇంకా మిగిలిపోయిన ఇండ్లను పేద లబ్ధిదారులకు ఇవ్వాల్సిందిగా కోరారు ఇందులో స్థానిక నాయకులు పూర్ణ మహేందర్ శ్రీను పూర్ణానంద గణేష్ సునీల్ బాబు మహిళలు స్థానికులు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది

## అంగన్వాడి బిల్డింగ్ నిర్మించడం 23 సం" గ్రామ ప్రజల కల సర్పంచ్ బెల్లి స్వప్న శ్రీనివాస్ యాదవ్

**అగర్ మియాగూడ లో అంగన్వాడి బిల్డింగు కొరకు ముగ్గు పోసిన సర్పంచ్ స్వప్న శ్రీనివాస్ యాదవ్**



( నేటి శుభోదయ ప్రతినిధి మహేశ్వరం మార్చ్ 13:) రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల కేంద్రంలోని అగర్ మియాగూడ గ్రామ సర్పంచ్ బెల్లి స్వప్న శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. గ్రామంలో గత 23 సంవత్సరాలుగా అంగన్వాడీ బిల్డింగ్ లేక ప్రజలు చాలా ఇబ్బందులకు గురి కావడం జరిగిందని అన్నారు ఇన్ని సంవత్సరాల తర్వాత గ్రామంలో నూతన భవనానికి శంకుస్థాపన గ్రామ సర్పంచ్ స్వప్న శ్రీనివాస్ యాదవ్ చేయడం జరిగింది గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతామని గ్రామంలో నీటి సమస్య డ్రైనేజ్ సమస్య విద్యుత్ సమస్యలు లేకుండా చూస్తామని అన్నారు అదేవిధంగా గ్రామంలో ఎలాంటి పథకాలు వచ్చినా నిరుపేద కుటుంబాలకు చూసి ఇస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు ఈ యొక్క కార్యక్రమంలో.. గ్రామ సర్పంచ్ బెల్లి స్వప్న శ్రీనివాస్ యాదవ్ తో పాటు. ఉప సర్పంచ్ లిక్కి శ్రీకాంత్ రెడ్డి వార్డు సభ్యులు లిక్కి జయమ్మ, అంగన్వాడి టీచర్ గోసుల బాలమని ఆశా వర్కర్ అందే జ్యోతి గ్రామ ప్రజలు అందే ప్రవీణ్ యాదవ్ ఈర్లపల్లి నరేందర్ రెడ్డి, సిహెచ్ రవీందర్ ముదిరాజ్,గోసుల వెంకటరెడ్డి, గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నట్టుగా పత్రిక విలేకరులకు తెలియజేశారు

## మాణిక్యమ్మ గూడా లో కొనసాగుతున్న పల్లె ప్రగతి

ప్రణాళిక పనులు సర్పంచ్ జెన్నపల్లి పద్మకృష్ణ





( నేటి శుభోదయ ప్రతినిధి మహేశ్వరం మార్చ్ 13:) రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని మాణిక్యమ్మ గూడ గ్రామంలో.. గ్రామ సర్పంచ్ జెన్నపల్లి పద్మకృష్ణ ఆధ్వర్యంలో.. గ్రామంలో కొనసాగుతున్న పల్లె ప్రగతి ప్రణాళిక పనులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పల్లెల రూపురేఖలను మార్చేందుకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమం "పల్లె ప్రగతి..ప్రగతి ప్రణాళిక 99రోజుల పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.ఇందులో భాగంగా మహేశ్వరం మండల గ్రామంలో మాణిక్యమ్మ గూడా సర్పంచ్ జెన్నపల్లి పద్మకృష్ణ పాలకవర్గంతో కలిసి గ్రామంలో ఉన్న అభివృద్ధి పనులు ప్రారంభించారు.ఈ పనులను పారిశుద్ధ్య కార్మికులు ఉపాధి హామీ సిబ్బందితో కలిసి పనులు ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..గ్రామంలో పారిశుద్ధ్యం, మొక్కలు నాటడం,విద్యుత్ సమస్యల పరిష్కారం, మంచినీటి గురించి అవగాహన తోపాటు పలు ప్రాంతాలలో శుభ్రం చేయడంతో పాటు పల్లెలను ఆదర్శ గ్రామాలుగా, మంచినీటి గ్రామాలుగా తీర్చిదిద్దడమే ఈ ప్రణాళిక ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాస్కర్ మరియు ఆశ వర్కర్ తో పాటు ముఖ్య నాయకులు పాల్గొన్నారు

## బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని ఎంపీడీవోకు వినతి పత్రం అందజేసిన గొల్లూరి శ్రీశైలం

**మహిళా భవనం కాదు ప్రజలకు కావాల్సింది బస్ సెంటర్ నిర్మాణం గొల్లూరి శ్రీశైలం**

**గొల్లూరు శ్రీశైలం ఎంపీడీవో కి బస్ స్టాప్ నిర్మించాలని వినతిపత్రం**



( నేటి శుభోదయ ప్రతినిధి మహేశ్వరం మార్చ్13:) రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం గ్రామానికి చెందిన గొల్లూరి శ్రీశైలం మాట్లాడుతూ... ప్రజల అవసరాలను బట్టి అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని గ్రామంలో డ్వాక్రా మహిళా భవనం ఉండగా గ్రామంలో విద్యార్థినీ విద్యార్థులు బస్ స్టాప్ లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారు అని అన్నారు అంతేకాకుండా గ్రామంలో ప్రతి ఒక్కరిని అడిగి చూడగా 100లో 80% మంది బస్సు సెంటర్ లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని తెలియజేశారు శివాజీ విగ్రహం వెనకాల కట్ట వలసింది డ్వాక్రా మహిళా భవనం కాదు.. బస్సు షెల్టర్ కట్టాలని ఎంపీడీవో కి వినతి పత్రం అందజేసినట్టుగా తెలియజేశారు ఈ యొక్క కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొనడం జరిగింది

## మహేశ్వరం లో వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమం పూర్తి షాహబుద్దీన్ ఖాన్



( నేటి శుభోదయ ప్రతినిధి మహేశ్వరం మార్చ్ 13:) రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ మహేశ్వరం మండల కేంద్రంలో పెద్దపులి నాగారం గ్రామానికి చెందిన 5వ వార్డు సభ్యులు షాహబుద్దీన్ ఖాన్ మాట్లాడుతూ... మండల కేంద్రంలో వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమం పూర్తి చేసుకున్న సందర్భంగా అధికారులు సర్టిఫికెట్లు అందజేయడం జరిగిందని తెలియజేశారు ఈ యొక్క కార్యక్రమంలో వార్డు సభ్యులు రాణమ్మ, నయీమ్ ఖాన్, హరీష్, రవి, పాల్గొన్నట్టుగా తెలియజేశారు

## ప్రతి నెల రెండవ శుక్రవారం ఇంటింటి కార్యక్రమం సర్పంచ్ దేశపాగ నరసింహా



( నేటి శుభోదయ ప్రతినిధి మహేశ్వరం మార్చ్ 13:) రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలో నందు పల్లి గ్రామ సర్పంచ్ దేశపాగ నరసింహ మాట్లాడుతూ.. 99 రోజుల ప్రజా ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఇంటింటి కి తిరిగి ఇంటి పరిసరాలలో చెత్త లాంటివి లేకుండా చూడడంతో పాటు కొబ్బరి బోండాలు కూలర్స్ లలో మరియు నీటి తొట్టిలలో ఎక్కువ రోజులు నీరు ఉండకూడదని అన్నారు మీరు చాలా రోజులు నిల్వ ఉంటే డెంగ్యూ వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి అని అన్నారు అదేవిధంగా ప్రతి నెల రెండవ శుక్రవారం రోజున పాలకవర్గంతో పాటు అందరూ ఇంటింటి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు ఈ యొక్క కార్యక్రమంలో సర్పంచ్ తో పాటు ఉప సర్పంచ్ షేక్ ఎజాస్, వార్డు సభ్యులు రంగుల యాదమ్మ కల్వకోల్ మహేందర్ లింగ సంతు పంచాయతీ కార్యదర్శి ఎస్ జానయ్య మరియు మహిళా సంఘం సభ్యులు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయడం జరిగిందని గ్రామ సర్పంచ్ పత్రికా విలేకరులకు తెలియజేయడం జరిగింది

## నందుపల్లిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సర్పంచ్ దేశపాగ నరసింహ



( నేటి శుభోదయ ప్రతినిధి మహేశ్వరం మార్చ్ 13:) రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలం నందు పల్లి గ్రామ సర్పంచ్ దేశపాగ నరసింహ మాట్లాడుతూ.. పంచాయతీలో ప్రజల కనీస సౌకర్యాలైన పారిశుధ్యం, నీటి సరఫరా, పనితీరు మెరుగు పరచడం ద్వారా వార్డుల వారీగా సమస్యలు పరిష్కరిం చేందుకు యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించిందనీ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ప్రభుత్వ కార్యక్రమంలలో పారిశుద్ధ్య కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. అదేవిధంగా రోడ్లు, వీధులు అనేక వాడల్లో పెద్ద ఎత్తున పరిశుద్ధ కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. బడి గుడి పరిసరాల్లో కూడా ముమ్మర పరిశుద్ధ కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. అదే విధంగా గ్రామపంచాయతీ సిబ్బంది సహకారంతో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక చర్యలలో భాగంగా అన్ని వార్డులలో ముమ్మర చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజాపాల న-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా మార్చి 6 నుంచి జూన్ 12వ తేదీ వరకు 99 రోజుల స్పెషల్ డ్రైవ్ చేపడుతుండగా, శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీలో ప్రణాళిక అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తో పాటు ఉపసర్పంచ్ షేక్ ఎజాస్, పంచాయతీ కార్యదర్శి ఎస్ జానయ్య, పంచాయతీ కార్మిక సిబ్బంది గ్రామ పెద్దలు యువకులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు అని పత్రిక విలేకరులకు తెలియజేశారు

## జాగృతి అధ్యక్షురాలికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన పాండురంగారెడ్డి



( నేటి శుభోదయ ప్రతినిధి మహేశ్వరం మార్చ్ 13:)తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా అవతరించడం చారిత్రాత్మక అవసరం: కప్పాటి పాండురంగారెడ్డితెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, కల్వకుంట్ల కవిత జన్మదినాన్ని పురస్కరించుకొని, నగరంలోని వారి నివాస కార్యాలయంలో తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కప్పాటి పాండురంగారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉద్యమ కాలం నుండి నేటి వరకు సాంస్కృతిక చైతన్యాన్ని రగిలించిన తెలంగాణ జాగృతి, ఇప్పుడు ప్రజల ఆకాంక్షల మేరకు రాజకీయ పార్టీగా రూపాంతరం చెందడం ఒక చారిత్రాత్మక ఘట్టమని ఆయన అభివర్ణించారు. "తెలంగాణ అస్థిత్వాన్ని ప్రపంచవ్యాప్తం చేసిన కవితమ్మ , ఇప్పుడు అదే స్ఫూర్తితో రాజకీయ రంగంలోకి అడుగుపెట్టుతుండడం హర్షణీయం అని అన్నారు. త్వరలోనే తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా ప్రజల పక్షాన నిలబడి, వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తుంది" అని పాండురంగారెడ్డి అన్నారు.కప్పాటి పాండురంగారెడ్డి తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా

## కందుకూరు మండల కేంద్రంలో శ్రీశ్రీ తెలుగు కవయిత్రి మొల్లమాంబ 586 జయంతి వేడుకలు

**ముఖ్య అతిథిగా మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షులు ఎగిరి శెట్టి బాలయ్య జాపాల సుధాకర్**



( నేటి శుభోదయ ప్రతినిధి మహేశ్వరం మార్చ్ 13:) రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల కుమ్మర సంఘం అధ్యక్షులు బొడ్డుపల్లి రవి అధ్యక్షతన జరిగిన కందుకూరు మండల కేంద్రంలో శ్రీశ్రీ తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతి 586 ఓ జయంతి ఉత్సవాలు జరుపుకోవడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జపాల సుధాకర్ అతిథిగా రావడం జరిగింది కందుకూరు సర్పంచ్ సరికొండ పాండు ఉప్ప సర్పంచ్ మమతా వెంకటేష్ నిమ్మ రాజశేఖర్ రెడ్డి సిరిగిరి కవిత పాల్గొన్నారు. జపాల సుధాకర్ మాట్లాడుతూ ఆనాటి కాలంలో అభ్యుదయ భావాలు కలిగిన మాతృమూర్తి ఈమె స్త్రీకి విద్య అవసరం లేదు అని పక్కన పెట్టిన రోజుల్లోనే తన కలంతో అందరికీ సమాధానం చెప్పి రామాయణాన్ని తెలుగులోకి అనువదించిన తెలుగు తొలి కవయిత్రి మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షులు ఎగిరి శెట్టి బాలయ్య మాట్లాడుతూ తెలుగు కవయిత్రి మొల్లమాంబ 15వ శతాబ్దం చెందిన రామాయణాన్ని తొలిసారిగా తెలుగులోకి అనువదించిన కవి ఈమె ఐదు రోజుల్లోనే అందరికీ అర్థమయ్యే విధంగా సరళ భాషలో అనువదించి కుమ్మరిలా చాటిచకాన్ని చాటింది అందరూ ఏకతాటిపై నడవాలని అందరు సంఘటితం కావాలని అన్ని రంగాలలో ఆర్థికపరంగా రాజకీయపరంగా విద్యాపరంగా ముందంజలో ఉండాలని రాజకీయంగా ఎదగాలని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమానికి కుమ్మర సంఘం నాయకులు తుక్కుగూడ తిరుమల ట్రాక్టర్స్ అధినేత కాసుల మహేందర్ మీరకంపేట్ సర్పంచ్ ఆలూరి నరేష్ బేగంపేట్ సర్పంచ్ పూజా హరిబాబు బాచుపల్లి ఉపసర్పంచ్ కుమ్మరి నరేష్ సిరిగిరి పురం మాజీ సర్పంచ్ సురేష్ వార్డ్ మెంబర్స్ జైత్వారం కుమ్మరి మధు కుమ్మరి రాజశేఖర బాచుపల్లి కుమ్మరి రాజు రవీందర కుమ్మర సంఘం ప్రధాన కార్యదర్శి ఆలూరి జంగయ్య ఉపాధ్యక్షుడు కొత్తగూడా కుమ్మరి సురేష కార్యదర్శి కుమ్మరి రమేష్ సేరి గూడెం రాజు ఉపాధ్యక్షులు కుమ్మరి సురేష్ జాపాల ఈశ్వర్ కోశాధికారి కుమ్మరి లింగం కందుకూరు మండల శాలివాహన ఎగిరిశెట్టి పెద్దరాజు సుదర్శన్ కొత్తగూడ కుమ్మరి అంజయ్య మన తెలంగాణ రిపోర్టర్ గణేష్ చందు ప్రవీణ్ రవి పాల్గొన్నారు

## మంచినీటి ట్యాంక్ శుభ్రపరిచిన మున్సిపల్ అధికారులు



శామీర్ పేట,మార్చి 13:అలియాబాద్ మున్సిపల్ ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటి సరఫరా అందించాలనే లక్ష్యంతో మున్సిపాలిటీలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శుక్రవారం పిట్టలగూడ వాటర్ ట్యాంక్ను శుభ్రపరిచడం జరిగిందని చైర్మన్ కంతం శిరీష కృష్ణ రెడ్డి పేర్కొన్నారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో మంచినీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్, వైస్ చైర్పర్సన్,కౌన్సిల్ సభ్యుడు గుర్క కుమార్, కౌన్సిల్ సభ్యుడు గూదె వెంకటేశ్, ఇన్చార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు, ఇన్చార్జ్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ విజయ్ , పట్టణ నాయకులు, ప్రజా ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.13ఎస్ ఎమ్ పి టీ 1కార్యక్రమం లో పాల్గొన్న కమిషనర్ చంద్రశేఖర్ తో పాటు చైర్ పర్సన్ కంతం శిరీష కృష్ణారెడ్డి,కౌన్సిలర్లు తదితరులు

## పదో తరగతి విద్యార్థులకు పెన్నులు, పరీక్ష ప్యాడ్ల పంపిణీ.

**నిజామాబాద్ జిల్లా రూరల్ ప్రతినిధి భీంగల్ పట్టణం**



(నేటిశుభోదయ)మార్చి 12.:భీంగల్ మండలం బెజ్జోర గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రేపటి నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు ప్రోత్సాహకంగా పెన్నులు, పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ మేస కార్తీక్ తమ్ముడు మేస కపిల్ తనవంతుగా విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షిస్తూ ఈ విద్యా సామగ్రిని అందజేశారు. బెజ్జోర సర్పంచ్ మేస కార్తీక్ ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ మూడేల్ల లింబయ్య చేతుల మీదుగా విద్యార్థులకు ఈ సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావలని సూచించారు. పరీక్షల సమయంలో ధైర్యంగా, ఏకాగ్రతతో ప్రశ్నలకు సమాధానలు రాయలని, భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలవలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, బెజ్జోర వార్డ్ మెంబర్ దివాకర్, గ్రామ యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వెలుగుమట్ల భూదాన్ భూముల్లో మౌళిక వసతుల పనులకు శ్రీకారం

- భూదాన్ ప్లాట్లలో విద్యుత్, త్రాగునీటి సరఫరా ఏర్పాట్లు
- లబ్ధిదారులకు సౌకర్యవంతమైన నివాస వాతావరణం లక్ష్యం
- మోడల్ కాలనీగా తీర్చిదిద్దే లక్ష్యంతో యుద్ధప్రాతిపదికన పనులు



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో లబ్ధిదారులకు కేటాయించిన ప్లాట్లలో మౌళిక వసతుల అభివృద్ధి పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం గృహ స్థలాలు పొందిన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన సదుపాయాలను కల్పించే దిశగా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్లాట్లలో విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ లైన్ల ఏర్పాటుతో పాటు త్రాగునీటి సరఫరా కోసం పైపులైన్ పనులు ప్రారంభించారు. ఇంటింటికి నల్లా లు ఏర్పాటుచేసి, శుద్ధమైన త్రాగునీరు అందించనున్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఈ పనులను కొనసాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో నివసించబోయే లబ్ధిదారులకు అవసరమైన అన్ని మౌళిక వసతులను దశలవారీగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో వెలుగుమట్ల భూదాన్ భూముల్లో అర్హులైన 311 మంది నిరుపేదలకు ఈనెల 11న రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి లు ఇళ్ళ స్థలాల పట్టాలతో పాటు, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు పత్రాలు లబ్ధిదారులకు అందజేశారు. ఈ నెల 12న 38 మంది లబ్ధిదారులు తమ ఇంటి నిర్మాణ పనులకు శంఖుస్థాపనలు చేసుకోగా, మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని, వెలుగుమట్ల ఒక అందమైన కాలనీగా, రాష్ట్రంలోనే మోడల్ కాలనీగా అన్ని వసతులు ఏర్పాటు చేయనున్నట్లు, ఆ దిశగా పనులు వెంటనే ప్రారంభించనున్నట్లు హామీ ఇచ్చారు. మిగతా లబ్ధిదారులందరూ ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నారు. విద్యుత్, త్రాగునీటి, పిల్లల చదువులకు తెలంగాణ పబ్లిక్ స్కూల్, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాల వంటి మౌళిక సదుపాయాలను ప్రాధాన్యతగా కల్పించనున్నారు. పనులను పూర్తి నాణ్యతతో, త్వరితగతిన పూర్తిచేసేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారుల కళ్ళల్లో సంతోషం



సదాశివపేట మార్చి 13 నేటి శుభోదయ ప్రతినిధి :సదాశివపేట మండలంలోని కంబాలపల్లి గ్రామ సర్పంచ్ ఇంధూరి భరతమ్మ బాబు ఇందిరమ్మ ఇల్లు భూమి పూజ ముఖ్య అతిథులు సిడిసి చెర్మెన్ గడీల రాంరెడ్డి రెజింతల్ గ్రామ సర్పంచ్ ఆశిరెడ్డిమాట్లాడుతూసొంతింటి కల నెరవేరింది.ఈ సందర్భంగా సిడిసి చైర్మన్ రామ్ రెడ్డి ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి సహకారంతో నిరుపేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడంతో లబ్ధిదారులు సొంతింటి కల నెరవేర్చారుఅన్నారు.ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రభుత్వం ఇంటి బిల్లులు ఆలస్యం చేయకుండా దశల వారీగా బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేస్తుండడంతో సకాలంలో ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకుంటున్నారని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారుల కళ్ళల్లో సంతోషం చూస్తున్నామని అన్నారు. పేదల సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే సాధ్యమన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసే విధంగా టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి దృష్టికి తీసుకు వెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు భీంసేనారెడ్డి .ఉపసర్పంచ్ కుమ్మరి పార్వతమ్మ ఆంజనేయులు పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్.సభ్యుడు ప్రభు.సభ్యుడు ప్రభాకర్ రెడ్డి.సభ్యుడు మునీర్. కృష్ణ . నర్సిములు.సురేష్.మేస్త్రీ దుర్గా మేస్త్రీ.శివ తదితరులు పల్గొనడం జరిగింది

## ఘనంగా యువ నాయకుడు నక్క సందీప్ గౌడ్ జన్మదిన వేడుకలు

**ప్రజా సేవలో ముందుంటే కార్పొరేటర్గా అవకాశం ఖాయం: నక్క ప్రభాకర్ గౌడ్**



శామీర్ పేట , మార్చి 13:కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు నక్క సందీప్ గౌడ్ జన్మదిన వేడుకలు శుక్రవారం షామీర్పేటలోని ఎస్పీజీ ఫామ్ హౌస్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అలియాబాద్, షామీర్పేట, తోముకుంట తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో యువకులు, అభిమానులు, పార్టీ నాయకులు హాజరై సందీప్ గౌడ్కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ ప్రజల్లో మంచి పేరు సంపాదించి, ప్రజా సంక్షేమం కోసం కృషి చేసే నాయకత్వ లక్షణాలు ఉన్నవారికి రాజకీయాల్లో తప్పకుండా అవకాశాలు వస్తాయని అన్నారు. షామీర్పేట్ డివిజన్ నుంచి కార్పొరేటర్గా పోటీ చేసే అవకాశం తన కుమారుడు నక్క సందీప్ గౌడ్కు వస్తే తన వంతు పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. ప్రజా సేవే ధ్యేయంగా ముందుకు సాగాలని యువ నాయకులకు పిలుపునిచ్చారు.జన్మదిన వేడుకల సందర్భంగా ప్రముఖ నాయకులు సందీప్ గౌడ్తో కలిసి కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ ప్రజా సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తే పార్టీ అధిష్టానం గుర్తించి భవిష్యత్తులో కార్పొరేటర్ టికెట్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని పలువురు సీనియర్ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ కంతం శిరీష కృష్ణారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కంతం కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొత్తగూడెం లో సాదిక్ ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో విద్యార్థి మహాసభ

**విద్యాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం : ప్రొఫెసర్ హరగోపాల్, డాక్టర్ ఎం.ఎ. ఫర్హా**



ఖమ్మం, కొత్తగూడెం, నేటి శుభోదయ ::: దేశ అభివృద్ధికి విద్య అత్యంత ముఖ్యమని ప్రొఫెసర్ హరగోపాల్, మిసెస్ ఇండియా, ఫిట్ ఇండియా అంబాసడర్ డా. ఎం. ఎ. ఫర్హా పేర్కొన్నారు. ఒక కార్యక్రమంలో పాల్గొని వారు మాట్లాడుతూ విద్య అభివృద్ధి చెందిన చోటే సమాజం, దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. దేశ భవిష్యత్తు తరాల అభివృద్ధి కోసం విద్యారంగానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని వారు అన్నారు. ముఖ్యంగా దేశ బడ్జెట్లో కనీసం 20 శాతం విద్యకు కేటాయించడం అవసరం అని అభిప్రాయపడ్డారు.సమాజంలో ఉన్న పేదలు, వెనుకబడిన వర్గాలు, మైనారిటీలకు సమాన అవకాశాలు కల్పించడానికి విద్య కీలక పాత్ర పోషిస్తుందని వారు వివరించారు. అందరికీ సమానంగా విద్య అందితేనే సమానత్వం మరియు సామాజిక న్యాయం సాధ్యమవు తుందని పేర్కొన్నారు.విద్యను బలోపేతం చేస్తేనే దేశ భవిష్యత్తు బలంగా ఉంటుందని, ప్రభుత్వం సమాజం కలిసి విద్యాభివృద్ధికి కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే మొత్తం రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని కోరుతూ విద్యార్థి మహాసభ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ హరగోపాల్, మిసెస్ ఇండియా, ఫిట్ ఇండియా అంబాసడర్ అయిన డా. ఎం. ఎ. ఫర్హా పాల్గొన్నారు."

# ఖమ్మం జిల్లాలో రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా దూసుకెళ్తున్న బీసీ సమాజం

**జాతీయ బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ కె.వి కృష్ణారావు**

**– నూతన కమిటీల ఎన్నిక**



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలో శుక్రవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తిని మధు గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ కె.వి కృష్ణారావు హాజరై మాట్లాడారు . సమాజంలో బీసీలు అనగా దొక్కబడు తున్నారని ఇప్పటికైనా మేల్కొని బీసీలు అంతా ఐక్యమై రాజ్యాధికార దిశగా ప్రయాణించాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు కామారెడ్డి డిక్లేషన్ సభలో ఇచ్చిన హామీ అయిన బీసీ 42 శాతం రిజర్వేషన్ ను వెంటనే అమలు చేసి షెడ్యూల్ నైన్ (9) లో పొందుపరిచి చట్టబద్రత కల్పించాలని అలాగే బీసీ మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ ను ఏర్పాటు చేసి సామాజిక , ఆర్థిక , రాజకీయ , విద్య , వైద్య మరియు ఉద్యోగ రంగాలలో బీసీ అభివృద్ధికి ప్రభుత్వాలు తోడ్పడి బీసీ బిడ్డలకు ముందు తరాల భవిష్యత్తును అందించాలని కోరారు . అలాగే మార్చ్ 15న జరిగే ఫీజు పోరు దీక్ష ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు . సత్తుపల్లి నియోజకవర్గం అధ్యక్షులు మారుతి ఆధ్వర్యంలో 5 మండలాల అధ్యక్షులు నియమించడం జరిగింది . ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మోత్కూరు వెంకటేశ్వర చారి , రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు యాదవ్ , జిల్లా గౌరవ సలహాదారులు పద్మాచారి , జిల్లా ఉపాధ్యక్షులు మక్కల వెంకన్న , యువజన విభాగం జిల్లా అధ్యక్షులు రాసాల సతీష్ యాదవ్ , ప్రధాన కార్యదర్శి చిన్నం శెట్టి వెంకట రామకృష్ణ , కోశాధికారి గునిగంటి వీరన్న , జిల్లా కార్యదర్శి కుందారపు సుధాకర్ , ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పుల్లూరు వెంకన్న బాబు , సత్తుపల్లి కాంసెన్సీ స్టూడెంట్ అసోసియేషన్ అధ్యక్షులు సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు . కొండలరావు సత్తుపల్లి మండలం , మణికంఠ వేంసూరు మండలం , శీను పెనుబల్లి మండలం , మురళి కల్లూరు మండలం , శ్రీనివాసరావు తల్లాడ మండలం వారిగా ఎన్నుకున్నారు

## ప్రతి పౌరుడు వార్డును శుభ్రంగా ఉంచాలి

**– వైరా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ ఇంటి పరిసరాల్లో నీరు నిలవకుండా చూడాలి – డ్రై డే ఫ్రైడే కార్యక్రమాల్లో వార్డు కౌన్సిలర్లు**




వైరా, నేటి శుభోదయ ::: వైరా మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా 6వ వార్డ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డ్‌లో పరిశుభ్రత కార్యక్రమాలను పరిశీలించి, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు నివారించేందుకు ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.ఇళ్ల వద్ద నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో ప్రజలు సహకరించాలని కోరారు. 20వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పుంద్రు వరలక్ష్మి శ్యాంబాబు దంపతులు పాల్గొన్నారు ఈ సందర్భంగా వార్డులో పరిశుభ్రత కార్యక్రమాలను పరిశీలించారు కొత్తగా నిర్మించిన రోడ్లను కౌన్సిలర్ పరిశీలించారు అనంతరం అపరిస్కృతంగా ఎన్నో నెలలు నుండి కాలవ మరో మత్తులను దగ్గరుండి పర్యవేక్షించారు ప్రతి ఒక్కరూ శుభ్రత పరిశుభ్రత పాటించాలని ఇంటి వద్ద నీరు నిలవకుండా తడి చెత్త పొడి చెత్తను చెత్త బండిలో వెయ్యాలని అదేవిధంగా టీచర్స్ కాలనీలో పిచ్చి మొక్కలు తొలగించి రోడ్లను క్లీన్ చేయించారు డ్రై డే ఫ్రైడే కార్యక్రమాల్లో మున్సిపాలిటీ పరిధిలోని 4 5..10.11.12.13 ఉన్న వార్డు లో ని కౌన్సిలర్లు నిమ్మ తోట శ్రావణి కట్టా స్వరూప రాణి కిన్నెర కృష్ణ దొంతు బోయిన వెంకటేశ్వర్లు మాదినేనిసునీత ముళ్ళపాటి విజయలక్ష్మి తదితరులు వార్డులో ప్రతి బజారును పరిశీలించి పిచ్చి మొక్కలు తొలగించి చెత్తాచెదారం లేకుండా రోడ్లను క్లీన్ చేశారు అదేవిధంగా ప్లాస్టిక్ నివారణ పై అవగాహన కల్పించారు ప్రతి ఒక్కరూ వార్డు అభివృద్ధికి సహకరించాలని వారి కోరారు కౌన్సిలర్లు ఉదయం 7 గంటల నుండి డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది వార్డుప్రజలు తదితరులు పాల్గొ నారు

## పాలడుగు ప్రాథమిక పాఠశాలలో ఘనంగా ఆత్మీయ వీడ్కోలు

**– ముఖ్యఅతిథిగా గ్రామ ఉపసర్పంచ్ ఓర్సు సుజాత**



వైరా, నేటి శుభోదయ ::: వైరా మండల పరిధిలోని పాలడుగు ప్రాథమిక పాఠశాల నుండి విద్య ముగించుకొని ఉన్నత పాఠశాలకు వెళ్తున్న విద్యార్థిని విద్యార్థులను అభినందిస్తూ శుక్రవారం తోటి విద్యార్థులు ఉపాధ్యాయులు సమక్షంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ ఉపసర్పంచ్ ఓర్సు సుజాత, కార్యదర్శి వేము కిరణ్ కుమార్ హాజరై వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఐదేళ్లపాటు పాఠశాలలో గడిపిన అనుభవాలను విద్యార్థులు గుర్తు చేసుకున్నారు.అనంతరం ముఖ్య అతిథులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యలో రాణించాలని దిశా నిర్దేశం చేశారు. విద్యార్థులు తమ పాఠశాల ఉపాధ్యాయులకు, పాఠశాలకు ధన్యవాదాలు తెలిపి ఉన్నత స్థానాలకు చేరుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.అనంతరం విద్యార్థులు అందరితో కలిసి ఉపాధ్యాయులు ఆత్మీయ విందులో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కారు మంచి దయాకర్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి నియోజకవర్గంలోని పలు గ్రామాలకు రూ.2 కోట్ల ఎన్.ఆర్.ఇ జిఎస్ నిధులు సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం



సంగారెడ్డి మార్చ్ 13 నేటి శుభోదయ ప్రతినిధి :సంగారెడ్డి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎన్.ఆర్.ఇ జిఎస్ నిధుల ద్వారా రూ.2 కోట్లు మంజూరు అయ్యాయని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తెలిపారు. మంజూరైన ఈ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు రేపటి నుంచే ప్రారంభం కానున్నాయని ఆయన చెప్పారు.రోడ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుందని, ముఖ్యంగా వర్షాకాలంలో మట్టి రోడ్ల వల్ల ఎదురయ్యే ఇబ్బందులు గణనీయంగా తగ్గుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ , ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అందించే దిశగా నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు.ఇదిలా ఉండగా, సంగారెడ్డి నియోజకవర్గంలోని పలు గ్రామాలకు సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.2 కోట్లు నిధులు మంజూరు చేయించడంలో కృషి చేసిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కి స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.

## వైరాలో ఘనంగా మొల్లమాంబ జయంతి వేడుకలు



వైరా, నేటి శుభోదయ ::: వైరా నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో తెలుగు సాహిత్య చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించిన మహాకవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ హాజరై మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామాయణాన్ని సాధారణ ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా తెలుగులో రచించి ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించిన గొప్ప కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ అని అన్నారు. కులం స్థితిగతులు అనే అడ్డంకులు ఉన్న కాలంలో కూడా తన ప్రతిభతో తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిన మహానుభావురాలని తెలిపారు. ఆమె రచించిన మొల్ల రామాయణం ఇప్పటికీ ప్రతి ఒక్కరికి మార్గదర్శకంగా నిలుస్తోందని చెప్పారు. ఇలాంటి మహనీయుల జయంతులను జరుపుకోవడం ద్వారా నేటి తరానికి వారి గొప్పతనం స్ఫూర్తిగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్,జిల్లా కాంగ్రెస్ నాయకులు శీలం వెంకట నర్సిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ డాక్టర్ సెల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాప మురళీకృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సీతారాములు, శాలివాహన సంఘం జిల్లా నాయకులు గుమ్మడిదల వెంకటనారాయణ, సంగెపు వెంకటేశ్వరరావు, దరిపల్లి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం లో మాంగళ్య షాపింగ్ మాల్ 30వ శాఖ ఘన ప్రారంభం



ఖమ్మం, నేటి శుభోదయ ::: 2012లో తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో ప్రారంభమైన మాంగళ్య షాపింగ్ మాల్, వస్త్ర వ్యాపార రంగంలో నూతన ఒరవడిని సృష్టిస్తూ వేగంగా విస్తరిస్తోంది. నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందిస్తూ ప్రజల ఆదరణను పొందిన మాంగళ్య, ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో తన ఉనికిని చాటింది.ఈ క్రమంలో ఖమ్మం లో 30 వ శాఖను ఘనంగా ప్రారంభించింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరై మాట్లాడుతూ వస్త్ర వ్యాపార రంగంలో దశాబ్దాల అనుభవం తో నాణ్యమైన వస్త్రాలను అందిస్తూ మూడు రాష్ట్రాల ప్రజలకు విశేష సేవలందిస్తున్న మాంగళ్య యాజమాన్యం పిఎన్ మూర్తి, కాసం నమఃశివాయ బ్రదర్స్ కలిసి కృష్ణార్జునుల లాగా వ్యాపారం చేస్తున్నా వారికి మా ప్రభుత్వం తరపున కృతజ్ఞతలు తెలుపుతూ త్వరలో తమిళనాడు రాష్ట్రంలో విస్తరించనున్నారని పేర్కొన్నారు, ఆ తర్వాత ప్రముఖ సినీ నటి శ్రీలీల ముఖ్య అతిథిగా హాజరై, దీప ప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. అనంతరం మాల్‌లోని వివిధ విభాగాలను సందర్శించి, అభిమానులతో సంతోషంగా మమేకమయ్యారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చి ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు. రిబ్బన్ కటింగ్ అనంతరం నటి శ్రీలీల మాట్లాడుతూ “ఖమ్మం ప్రజలు మాంగళ్య షాపింగ్ మాల్‌కు మంచి ఆదరణ అందిస్తారని నమ్మకం ఉంది. వారి ఆశీర్వాదాలతో ఈ మాల్ మరింత విజయవంత మవుతుంది” అని అన్నారు. మాంగళ్య షాపింగ్ మాల్ డైరెక్టర్లు పుల్లూరు నరసింహ మూర్తి, కాసం నమశివాయ, కాసం మల్లికార్జున, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్ కుమార్ మాట్లాడుతూ ‘ప్రతి వర్గానికి, ప్రతి సందర్భానికి అనువైన నాణ్యమైన వస్త్రాలను అందుబాటు ధరల్లో అందించడమే మా విజయ రహస్యం” అని తెలిపారు.“మా స్వంత హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఆధునిక మార్కెట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా డిజైన్ చేసి, వస్త్ర వ్యాపారంలో ముందంజలో కొనసాగుతున్నాం” అని పేర్కొన్నారు.మాంగళ్య షాపింగ్ మాల్‌లో మహిళలు, పురుషులు, యువత, పిల్లల కోసం తాజా ఫ్యాషన్ కలెక్షన్స్, అలాగే వివాహాలు, శుభకార్యాలకు ప్రత్యేకమైన భారీ వెడ్డింగ్ కలెక్షన్స్ అందుబాటులో ఉన్నాయి. ఈ మాల్ ప్రారంభంతో ఖమ్మం జిల్లా ప్రజలు ఇకపై పెళ్లి షాపింగ్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, తమ ప్రాంతంలోనే నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు కొనుగోలు చేయవచ్చు.రూ.99 నుంచి ప్రారంభమై రూ.1 లక్ష వరకు ధరల శ్రేణిలో వస్త్రాలు అందుబాటులో ఉండటంతో పాటు, మాంగళ్య ఒక సంపూర్ణ ఫ్యామిలీ షాపింగ్ మాల్ గా ప్రత్యేక గుర్తింపు పొందింది. ప్రస్తుతం మూడు రాష్ట్రాల్లో విజయవంతంగా కొనసాగుతున్న మాంగళ్య షాపింగ్ మాల్, రాబోయే రోజుల్లో ఈ మూడు రాష్ట్రాల్లోనే 910 కొత్త ప్రాజెక్టులు ప్రారంభించనుండగా, భవిష్యత్తులో తమిళనాడు రాష్ట్రానికి కూడా విస్తరించనున్నట్లు డైరెక్టర్లు తెలిపారు. దేశవ్యాప్తంగా వినియోగదారుల విశ్వాసాన్ని పొందిన మాంగళ్య షాపింగ్ మాల్, పాన్ ఇండియా స్థాయిలో నంబర్ వన్ షాపింగ్ మాల్‌గా నిలుస్తోంది.ఖమ్మం జిల్లా ప్రజలు తమ తమ శుభ కార్యక్రమం ఏది ఉన్న ఒకసారి మాంగళ్య షాపింగ్ మాల్ కు సకుటుంబ సపరివారంగా విచ్చేసి ఒక నూతన షాపింగ్ ఒరవడి సృష్టించాలని యాజమాన్యం తెలిపింది, ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు విశాల్, వరుణ్, కార్తిక్, అరుణ్, పనీత్, సాయి కృష్ణ పాల్గొన్నారు.



# ఎల్.పీ.జీ గ్యాస్ సిలిండర్ల విషయంలో ఆందోళన వద్దు

**జిల్లా అవసరాలకు సరిపడా అందుబాటులో ఉన్నాయి**

**పర్యవేక్షక కమిటీ సమావేశంలో కలెక్టర్ వెల్లడి**

**అక్రమాలకు ఆస్కారం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం**

**విద్యా సంస్థలు,ఆసుపత్రులకు ఇండెంట్ అందిన వెంటనే గ్యాస్ సరఫరా చేయాలి**



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ మార్చి 13 నేటి శుభోదయ :వంట గ్యాస్ సిలిండర్ల విషయంలో ప్రజలు ఎవరు కూడా ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు.జిల్లా అవసరాలకు సరిపడా నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని,జిల్లాలో గ్యాస్ కొరత ఎంతమాత్రం లేదని స్పష్టం చేశారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పర్యవేక్షక కమిటీ సమావేశం జరిగింది.జిల్లాలో వంట గ్యాస్ డిమాండ్,సరఫరా తీరుతెన్నుల గురించి ఈ సమావేశంలో సమీక్షించారు.జిల్లాలో 5,81,769 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని,33 గ్యాస్ ఏజెన్సీల ద్వారా సరఫరా జరుగుతోందని,శుక్రవారం నాటికి 10,850 సిలిండర్లు జిల్లాలో గృహావసరాల కోసం పంపిణీ నిమిత్తం అందుబాటులో ఉన్నాయని,వీటికి అదనంగా మరో 5,875 సిలిండర్లు జిల్లాకు రానున్నాయని పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి కలెక్టర్ దృష్టికి తెచ్చారు.సిలిండర్ బుక్ చేసిన వారికి మూడు నుంచి నాలుగు రోజుల వ్యవధిలో గృహావసరాల సిలిండర్లు పంపిణీ చేయబడుతున్నాయని తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....జిల్లాలో ఎల్.పీ.జీ సిలిండర్ల పంపిణీని నిశితంగా పర్యవేక్షిస్తున్నామని అన్నారు.ఎవరైనా కృత్రిమ కొరతను సృష్టించి,బ్లాక్ మార్కెట్‌లో గ్యాస్ సిలిండర్లను విక్రయిస్తే,నిత్యావసర సరకుల చట్టం,1955 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే తనిఖీలను ముమ్మరం చేయించామని, ప్రస్తుత మార్చి నెలలో ఎన్ ఫోర్స్ మెంట్ బృందాలు ఆకస్మిక దాడులు జరిపిన సందర్భంగా వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న 156 డొమెస్టిక్ సిలిండర్లను వివిధ వ్యాపార,వాణిజ్య దుకాణాల నుండి స్వాధీనం చేసుకుని వాటి నిర్వాహకులపై కేసులు నమోదు చేశారని కలెక్టర్ వివరించారు.హోటళ్ళు,రెస్టారెంట్లలో కమర్షియల్ సిలిండర్ మాత్రమే ఉపయోగించాలని,డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అన్ని ప్రభుత్వ పాఠశాలలు,వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూల్స్, గురుకులాలకు, ఆసుపత్రులకు, అంగన్వాడీ కేంద్రాలకు, అనాథ్రమాలకు ఇండెంట్ లు అందిన వెంటనే జాప్యానికి తావు లేకుండా గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాలని ఏజెన్సీల నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులు, రోగులు, వారి అటెండెంట్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదని అన్నారు.ఆసుపత్రులలో ఇన్ పేషంట్ల సంఖ్యకు అనుగుణంగానే సిలిండర్లు ఇండెంట్ పెట్టేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేయాలని డీ.ఎం.హెచ్.ఓను ఆదేశించారు.ప్రస్తుతం జిల్లాలో గృహ అవసరాల కోసం వినియోగించే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల కొరత ఎంతమాత్రం లేదని అన్నారు.ఎల్.పీ.జీ వినియోగదారులు ఆన్లైన్లో మాత్రమే సిలిండర్లను బుక్ చేసుకోవాలని,ఏజెన్సీల వద్దకు,గ్యాస్ గోదాముల వద్దకు వెళ్లవద్దని కలెక్టర్ కోరారు.గ్యాస్ బుకింగ్ కోసం సింగిల్ సిలిండర్ కి 25 రోజులు,డబుల్ సిలిండర్ కి 45 రోజుల వ్యవధి తర్వాత మాత్రమే బుకింగ్ నమోదు నిబంధన అమలులో ఉందన్నారు.వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి,నిర్ణీత వ్యవధి దాటిన తరువాతనే గ్యాస్ రీఫిల్ కోసం బుకింగ్ చేసుకోవాలని సూచించారు.కాగా,కొంతమంది వినియోగదారులు సిలిండర్ లో ఇంకను గ్యాస్ నిల్వలు కొంతవరకు మిగిలి ఉన్నప్పటికీ,కొత్తగా బుకింగ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని,ఈ తరహా ఆదుర్దాను ప్రదర్శించడం వల్ల గ్యాస్ విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుందని,గ్యాస్ సిలిండర్ పూర్తిగా ఖాళీ అయి,నిర్ణీత వ్యవధి దాటిన అనంతరమే బుకింగ్ చేసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు.గ్యాస్ డెలివరీ చేసే సమయంలో డెలివరీ బాయ్ కి ఓటీపీ చెప్పి సహకరించాలని,వారి విధులకు ఎవరైనా ఆటంకము కలిగించినట్లయితే,అలాంటి వినియోగదరులపైన కూడా చట్టపరముగా చర్యలు తీసుకోబడతాయని అన్నారు.ఎల్పీజీ వినియోగదారులు తప్పనిసరిగా కేవైసీ పూర్తి చేసుకోవాలని,గ్యాస్ ఏజెన్సీల వద్ద,ఆన్లైన్లో కానీ గ్యాస్ కంపెనీ అధికారిక వెబ్సైట్ లేదా యాప్ లో,గ్యాస్ సిలిండర్ పంపిణీ సమయంలో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల వద్ద కేవైసీ పూర్తి చేసుకోవచ్చని సూచించారు.ఈ



సమావేశంలో అదనపు డీ.సీ.పీ బస్వారెడ్డి,ఇంచార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్,ఎ.ఎస్.ఓ అరవింద్ రెడ్డి,డీ.టీ.ఓ ఉమామహేశ్వర్ రావు,డీ.పీ.ఓ శ్రీనివాస్ రావు,డీ.డబ్ల్యూ.ఓ పద్మ,జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిణి కృష్ణవేణి,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరస్వామి,ఆర్ సీ ఓ లు,గ్యాస్ కంపెనీల సేల్స్ ఆఫీసర్లు,ఎల్.పీ.జీ డీలర్లు పాల్గొన్నారు.

## వెంకటాపురంగ్రామస్తులపై తేనెటీగల దాడి గ్రామంలో భయాందోళన వాతావరణం

సదాశివపేట, మార్చ్ 13 నేటి శుభోదయ ప్రతినిధి :సదాశివపేట మండలం వెంకటాపురం గ్రామంలో తేనెటీగలు ఒక్కసారిగా గ్రామంలోకి దూసుకువచ్చి రోడ్డు పై వెళుతున్న గ్రామస్తులపై దాడి చేయడంతో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఎటు చూసినా తేనెటీగల గుంపులు గ్రామంలో తిరుగుతుండటంతో ప్రజలు స్కూల పిల్లలు ప్రాణాలు కాపాడుకోవడానికి ఇళ్లలోకి పరుగులు పెట్టారు.గ్రామంలో ఒక్కసారిగా తేనెటీగల దాడి ప్రారంభమవడంతో పలువురు గ్రామస్తులు గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే 108 అంబులెన్స్ సాయంతో సమీప ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. అయితే గాయపడిన వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఒకే అంబులెన్స్ సరిపోకపోవడంతో కొందరు స్వయంగా వాహనాల్లో ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.తేనెటీగల దాడి వల్ల గాయపడిన వారికి తీవ్రమైన నొప్పి, వాపు, చర్మం ఎర్రబారడం వంటి సమస్యలు కనిపిస్తున్నాయి. కొందరికి అలర్జీ సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఒకేసారి ఎక్కువసార్లు తేనెటీగలు కుట్టినప్పుడు శరీరంలో విష ప్రభావం పెరిగి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, తలనొప్పి, వాంతులు, చర్మంపై తీవ్రమైన వాపు వంటి సమస్యలు రావచ్చు.ప్రత్యేకంగా చిన్నపిల్లలు, వృద్ధులు, అలర్జీ సమస్యలు ఉన్నవారికి తేనెటీగల కాటు మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. కొందరికి తీవ్ర అలర్జీ రియాక్షన్ (అనాఫైలాక్సిస్) వచ్చే ప్రమాదం కూడా ఉంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాంటి పరిస్థితుల్లో వెంటనే వైద్య సహాయం తీసుకోవడం తప్పనిసరి.ఈ ఘటనతో వెంకటాపురం గ్రామంలో భయాందోళన వాతావరణం నెలకొంది. గ్రామంలో ఇంకా తేనెటీగల గుంపులు తిరుగుతుండటంతో ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారు. తేనెటీగల గూళ్లను గుర్తించి తొలగించాలని, ప్రజల భద్రత కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.ఈ సంఘటన గ్రామీణ ప్రాంతాల్లో తేనెటీగల గూళ్ల నిర్వహణ, భద్రతా చర్యల అవసరాన్ని మరోసారి గుర్తు చేస్తోంది. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ఇలాంటి ఘటనలు పెద్ద ప్రమాదాలకు దారితీయవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.





## 10వ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

**-ఎన్.శంకర్,మండల విద్యాధికారి,**




సదాశివపేట మార్చి 13 నేటి శుభోదయ ప్రతినిధి :శుక్రవారం రోజున మన మండల పరిధిలో నిర్వహించబడనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు సక్రమంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి ఎన్.శంకర్ తెలిపారు.ఈ సంవత్సరం మన మండలంలో మొత్తం 7 పరీక్షా కేంద్రాలలో 1209 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని,పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా త్రాగునీరు, విద్యుత్, ఫర్నిచర్, టాయిలెట్స్ మరియు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయబడినట్లు,సెయింట్ ఆంథోనీ పాఠశాలలో ఏర్పాట్లను సి.ఎస్ శ్రీనివాసులు, డి.ఓ భాను ప్రకాష్, ఇన్విజిలేటర్స్, ప్రిన్సిపల్ మరియు సిఆర్పి తో పాటు పరిశీలించడం జరిగిందని,పరీక్షలు ప్రశాంతంగా మరియు పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రతి పరీక్షా కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ మరియు ఇన్విజిలేటర్స్ లను నియమించడం జరిగిందని తెలిపారు.విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు కనీసం అరగంట ముందుగా చేరుకోవాలని, హాల్ టికెట్ తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. ఎలక్ట్రానిక్ పరికరాలు (మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు మొదలైనవి) పరీక్షా కేంద్రాలకు తీసుకురావద్దని తెలిపారు.పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అందరి సహకారం కోరుతున్నట్లు మండల విద్యాధికారి ఎన్.శంకర్ తెలిపారు.

# ప్రకృతి ఒడిలో పర్యావరణహితంగా డాక్టర్ భువిఅభి పరిణయం

**– ప్రాణాలు నిలిపే వైద్య వృత్తి , సమాజ బాధ్యతతో పర్యావరణ పరిరక్షణకు పట్టం కట్టిన డాక్టర్స్ ఏ.వి. కుటుంబం**

**– సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్ ఏవి గిరి సింహారావు వరలక్ష్మి ల ఏకైక కుమార్తె, డాక్టర్ త్రిభువన భార్గవి– డాక్టర్ అభినవ్ కౌశల్ ల వివాహం**

**– ప్లాస్టిక్ రహిత వివాహంతో సమాజానికి సందేశం ఇచ్చిన డాక్టర్ ఎ.వి. గిరిసింహారావు కుటుంబం**

ఖమ్మం, నేటి శుభోదయ ::: ప్రకృతి ఒడిలో పచ్చని చెట్ల మధ్య, పల్లె వాతావరణం సాక్షిగా, పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా నిలిచేలా ఖమ్మం జిల్లాలో ఓ వైద్య కుటుంబం నిర్వహించిన వివాహ వేడుక అందరినీ ఆకట్టుకుంది. సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్ ఎ.వి. గిరిసింహారావు వరలక్ష్మి దంపతుల ఏకైక కుమార్తె డాక్టర్ త్రిభువన భార్గవి (భువి) వివాహం డాక్టర్ అభినవ్ కౌశల్ తో చింతకాని మండలంలోని వందనం గ్రామ సమీపంలో ఉన్న ‘ఋషి వనం‘లో ఈనెల 06 వ తేదీన అంగరంగ వైభవంగా, శాస్త్రోక్తంగా జరిగింది. ప్రకృతి సోయగాలతో నిండిన ఆహ్లాదకర వాతావరణంలో జరిగిన ఈ వివాహ వేడుకకు పలువురు ప్రముఖ వైద్యులు, బంధువులు, ఆత్మీయులు, స్నేహితులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. పల్లె వాతావరణంలో జరిగిన ఈ పరిణయ మహోత్సవం ప్రతి ఒక్కరికి కొత్త అనుభూతిని అందించింది.



### - ప్రకృతి మధ్య పరిణయ క్రతువు



వివాహ వేదికను వేంకటేశ్వర స్వామి ఆలయ గోపురం నమూనాలో కళాత్మకంగా నిర్మించారు. పచ్చని చెట్ల మధ్యలో అలంకరించిన ఆ వేదికపై వేద మంత్రోచ్చారణల నడుమ వధూవరులు మంగళసూత్రధారణ చేసి దాంపత్య జీవితంలోకి అడుగుపెట్టారు. ప్రకృతి ఒడిలో జరిగిన ఈ పరిణయ క్రతువు అక్కడికి విచ్చేసిన అతిథులను మంత్రముగ్ధులను చేసింది. పచ్చని చెట్లు వింజామరలతో ఊగుతూ ఆహుతులను స్వాగతించినట్లు కనిపించాయి. కొబ్బరి, జామ, సపోట, దానిమ్మ, సీతాఫలం చెట్లు నిటారుగా నిలబడి ఈ శుభకార్యానికి సాక్ష్యాలుగా నిలిచినట్లు అనిపించింది. నింగి నుండి కురిసిన వెన్నెల కాంతులు, పచ్చని ప్రకృతి సోయగాలు ఈ వేడుకకు మరింత అందాన్ని చేకూర్చాయి.

### - పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం

వైద్య వృత్తిలో సేవలందిస్తూ సమాజ బాధ్యతను గుర్తించిన డాక్టర్ ఎ.వి. గిరిసింహారావు కుటుంబం ఈ వివాహాన్ని పూర్తిగా పర్యావరణ హితంగా నిర్వహించడం విశేషం. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారిస్తూ సహజ వనరులతో తయారైన పాత్రలు, గ్లాసులు, ప్లేట్లు వినియోగించారు. ఒక్క వాటర్ బాటిల్ తప్ప ఇతరత్రా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటుకున్నారు.ఈ సందర్భంగా పలువురు అతిథులు మాట్లాడుతూ “ ప్లాస్టిక్ రహిత –పర్యావరణ హిత”వివాహం నిర్వహించడం ద్వారా సమాజానికి మంచి సందేశాన్ని ఇచ్చారు. ఇలాంటి కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తాయి‘ అని అభిప్రాయపడ్డారు.

### - పల్లె వాతావరణంలో ప్రత్యేక వేడుక

నేటి కాలంలో పట్టణాల్లో ఆర్భాటంగా, భారీ సెట్టింగులతో జరిగే వివాహాలకు భిన్నంగా ఈ వివాహాన్ని పల్లె వాతావరణంలో నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రకృతి మధ్యలో, పచ్చిక బయళ్ళ మధ్య నిర్వహించిన ఈ వేడుక ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. పట్టణాన్ని వదిలి గ్రామీణ వాతావరణాన్ని ఎంచుకోవడం పట్ల పలువురు అతిథులు డాక్టర్ గిరిసింహారావు కుటుంబాన్ని అభినందించారు.

### - అతిథులకు ఆతిథ్యం

వివాహానికి హాజరైన అతిథులకు సంప్రదాయ పద్ధతిలో పూర్తి శాఖాహార భోజనాన్ని షడ్రసోపేతంగా వడ్డించారు. గ్రామీణ వాతావరణంలో, ప్రకృతి మధ్యలో భోజనం ఆస్వాదించడం అతిథులకు కొత్త అనుభూతిని కలిగించింది. ఆశీర్వాదాలతో కొత్త జీవితం వివాహానికి హాజరైన ప్రముఖ వైద్యులు, బంధువులు, ఆత్మీయులు నూతన దంపతులు డాక్టర్ భువి డాక్టర్ అభినవ్ లను తలంబ్రాలతో ఆశీర్వదించారు. ప్రకృతి సాక్షిగా జరిగిన ఈ పరిణయ మహోత్సవం ఆనందోత్సాహాలతో నిండిపోయింది.ప్రకృతి ఒడిలో, పర్యావరణ పరిరక్షణ సందేశంతో జరిగిన ఈ వివాహ వేడుక ఖమ్మం జిల్లాలో ప్రత్యేక చర్చనీయాంశంగా మారింది. సమాజానికి ఆదర్శంగా నిలిచేలా పర్యావరణ హిత వివాహాన్ని నిర్వహించిన డాక్టర్ ఎ.వి. గిరిసింహారావు కుటుంబం అందరి ప్రశంసలను అందుకుంది.



# ముగిసిన ఇంటర్ పరీక్షలు

## జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ మార్చ్ 13 నేటి శుభోదయ :2025 - 26 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలో ఇంటర్ ప్రధాన పరీక్షలు శుక్రవారంతో ముగిశాయని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ తెలియజేశారు.మరో 17 పరీక్ష కేంద్రాల్లో వోకేషనల్ బ్రిడ్జి కోర్సు పరీక్షలు సోమవారం వరకు జరుగుతాయని ఆయన తెలియజేశారు.జిల్లాలో ఈ సారి పకడ్బందీ చర్యల ద్వారా ఎలాంటి కాపియింగ్ జరగకుండా కఠిన చర్యలు తీసుకున్నామని తెలిపారు.జిల్లాలో పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు,హైపర్ కమిటీ,ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు,సిట్టింగ్స్ స్క్వాడ్ బృందాలు నిరంతరం జిల్లాలోని 58 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తూ పర్యవేక్షణ చేయడం జరిగిందని తెలియజేశారు.ఈసారి జిల్లాలో ఒకే విద్యార్థి పై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు అయిందని ఆయన తెలియజేశారు.జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పరీక్షల నిర్వహణకు పోస్టల్ డిపార్ట్మెంట్,విద్యుత్తు,ఆర్టీసీ,రెవెన్యూ,పోలీస్ ఇతర అన్ని శాఖల సమన్వయం,సహకారంతో పరీక్షలను ఇంటర్ అధ్యాపక,అధ్యాపకేతర బృందం ప్రశాంతంగా నిర్వహించిందని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపుడి రవికుమార్ తెలియజేశారు.పరీక్షల నిర్వహణకు సహకరించిన అందరికి జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# 15 వ తేదీ నుండి ఇంటర్ మూల్యాంకనం

## అధ్యాపకులను రిలీవ్ చేయకుంటే చర్యలు

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ మార్చ్ 12 నేటి శుభోదయ :ఈ నెల 15వ తేదీ నుండి ప్రారంభమవుతున్న ఇంటర్ మూల్యాంకనం సబ్జెక్ట్ ల అధ్యాపకులు అందరూ 15వ తేదీన రిపోర్ట్ చేయాలని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపూడి రవికుమార్ తెలియజేశారు.ప్రభుత్వ,ఎయిడెడ్,ప్రైవేటు,అన్ని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ లు వారి కళాశాల లాగిన్ లలో అధ్యాపకుల అపాయింట్మెంట్ ఆర్డర్ లు ఇంటర్ బోర్డు నిక్షిప్తం చేసిందని ఆయన తెలియజేశారు.మూల్యాంకన విధులు ఉన్న తెలుగు,ఇంగ్లీష్,హిందీ,మ్యాథ్స్,సివిక్ సబ్జెక్టు అధ్యాపకులను రిలీవ్ చేయాలని,ఎవరైనా రిలీవ్ చేయని ప్రిన్సిపాల్ లు,ప్రైవేటు యాజమాన్యం పై ఇంటర్ బోర్డు నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తెలియజేశారు.ఆయా సబ్జెక్ట్ ల అధ్యాపకులందరూ 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న మూల్యాంకనంలో పాల్గొనాలని ఆయన ఆదేశించారు.

## బోయిన్ పేట్ సమస్యలు పరిష్కరించాలని మంత్రి కీ వినతి పత్రం

### కౌన్సిలర్ శ్రీలత క్రాంతి కుమార్



మంథని, మార్చి -13, నేటిశుభోదయ : మంథని మున్సిపల్ పరిది లోని బోయిన్ పేట్ సమస్యలు పరిష్కారించాలని మంత్రి శ్రీధర్ బాబు కి వినతి పత్రం అందజేసిన 6వార్డ్ కౌన్సిలర్ పోతరవేని శ్రీలతక్రాంతి శుక్రవారం మంథని మున్సిపల్ సమావేశానికి ముఖ్య అతిథి పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కు బోయిన్ పేట్ లోని పలు సమస్యల పై వినతి పత్రం అందజేసిన 6వార్డ్ కౌన్సిలర్ పోతరవేని శ్రీలత క్రాంతికుమార్. 1.కల్లు మండువా నుండి బొక్కల వాగు వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తో కలసి 20 ఫీట్ల సీసీ రోడ్డు నిర్మాణం..2.బోయిన్ పేట్ లోని గల్లీలలో మిగిలి ఉన్న సీసీ రోడ్ల నిర్మాణం 3.బోయిన్ పేట్ కు 3 మంచి నీటి బోర్లు 4.బోయిన్ పేట్ లో నిరుపేదలు ఎక్కువ ఉండడం వల్ల ఇందిరమ్మ ఇల్లు లు అధికంగా మంజూర్ చేయాలి.వీటికి సానుకూలంగా స్పందించిన మంత్రి తప్పకుండా పరిష్కారిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.

# ఎస్.సి. యాక్షన్ ప్లాన్ విడుదల

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం, నేటి శుభోదయ ::: ఎస్.సి. యాక్షన్ ప్లాన్ 2025-26 ను విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి యాక్షన్ ప్లాన్ లో బ్యాంకు అనుసంధానంతో ఆర్థిక సహాయ పథకములు రవాణా రంగం పథకం క్రింద ఇవి టూ వీలర్, ఇవి త్రి వీలర్ లు, వ్యవసాయ పథకముల క్రింద సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్ లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ అన్నారు. జిల్లాలోని అన్ని మండలాల, మున్సిపాలిటి పరిధి లోని షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులు, వ్యవసాయేతర పథకములకు వయస్సు 21 నుండి 50 సం. రాల వరకు వయస్సు, వ్యవసాయ ఆధారిత పథకములకు వయస్సు 21 నుండి 60 సం.రాల వయస్సు కలిగిన వారు ఆన్లైన్ ప్రక్రియ ఈ నెల 17 నుండి 24 వరకు నమోదు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఇట్టి అభ్యర్థుల యొక్క సంవత్సర ఆదాయం రూ. లక్షా యాభై వేలు గ్రామీణ ప్రాంతాల వారికి, రూ. రెండు లక్షలు పట్టణ ప్రాంతాలైన మున్సిపాలిటి, మున్సిపల్ కార్పొరేషన్, నగర పంచాయతీల ప్రాంతాల వారికి మించకుండా కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు ఆన్లైన్ చేసుకోవటానికి ఆధార్ కార్డ్, రేషన్ కార్డు/ఫుడ్ సెక్యూరిటీ కార్డు, కుల ధృవీకరణ పత్రం (మీసేవ జారీ చేసింది), ఆదాయ ధృవీకరణ పత్రం ( మీసేవ జారీ చేసింది), శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ (రవాణా రంగం పథకములకు ) ఇవి ద్విచక్ర వాహనాల కోసం ఎస్.సి. వ్యవస్థాపకులు/గిగ్ కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. జోమాటో, స్విగ్గి, రాపిడో, ఉబేర్ వంటి క్లెయిమ్ చెయ్యడానికి సంబంధిత సర్టిఫికెట్ సమర్పించాలన్నారు.పట్టాదార్ పాస్ బుక్ (సోలారా పంప్ సెట్ కోసం కనీసం రెండు ఎకరముల భూమి అవసరం), దివ్యాంగులు (సదరం సర్టిఫికెట్), పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు అవసరమవుతాయని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఫ్యాషన్ డిజైనింగ్ లో ఉచిత టైలరింగ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం



కూకట్ పల్లి, మార్చి 13: నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ కూకట్ పల్లి ఆధ్వర్యంలో మహిళలకు 15 రోజుల ఉచిత టైలరింగ్ కోర్సు నిర్వహిస్తున్నట్లు కూకట్ పల్లి బ్రాంచ్ డైరెక్టర్ దీపిక తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. ఈ మధ్యకాలంలో ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు కలిగిన ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల పట్ల మహిళలు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని అన్నారు. ఇటువంటి వృత్తి విద్యా కోర్సుల ద్వారా మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు.సంస్థ మంచి ఉద్దేశంతో మహిళలకు ఫ్యాషన్ డిజైనింగ్, టైలరింగ్ రంగంలో అవగాహన కల్పించేందుకు 15 రోజుల ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోర్స్ పూర్తి చేసిన అనంతరం సర్టిఫికెట్స్ ఇవ్వబడుతుందని ఆమె తెలిపారు . ఈ కోర్సులో రోజుకు 3 గంటల శిక్షణ అందించబడుతుందని చెప్పారు. ఈ శిక్షణలో రోజుకు రెండు బ్యాచ్ లు ఉంటాయి:మొదటి బ్యాచ్: ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు రెండవ బ్యాచ్: మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. ఈ నెల 16వ తేదీ నుండిశిక్షణ తరగతులు ప్రారంభం అవుతాయని తెలిపారు. టైలరింగ్ నేర్చుకోవాలనుకునే ఆసక్తి గల మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం సెల్: 9573909009/

# మంచిగా చదివి లక్ష్యానికి చేరుకోవాలి

## నేను ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని నే

## విద్యార్థులు చేడు మార్గం వైపు నడవవద్దు

## మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ



వైరా, నేటి శుభోదయ ::: నేను ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థిని నే అని వైరా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణా అన్నారు. శుక్రవారం వైరాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో 10వ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లను పంపిణీ చేశారు, ఈ సందర్భంగా పరీక్షలు రాసే విద్యార్థులు అందరికీ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణా బెస్ట్ ఆఫ్ లక్ తెలిపారు. అనంతరం డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణా మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచిగా పరీక్షలు రాసి ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు, అదేవిధంగా విద్యార్థులు చెడు మార్గంలో ప్రయాణించవద్దు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆమె సూచించారు. మీకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు కు ,పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొని రావాలని, భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి ఆదర్శంగా నిలవాలని ఆమె సూచించారు, పరీక్షలను భయంతో కాకుండా బాధ్యతతో చదివి ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ చైర్మన్ డాక్టర్ కాపామురళీకృష్ణా,ప్రధానోపాధ్యాయులు మాధవరావు మరియు ఉపాధ్యాయులు చంద్రశేఖర రావు, కృష్ణా ,నరసింహారావు ,అనిత తదితరులు పాల్గొన్నారు.

# మార్చి చివరి నాటికి లక్ష ఇందిరమ్మ ఇండ్లు పూర్తి

## తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు
- కామేపల్లి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి




ఖమ్మం, కామేపల్లి, నేటి శుభోదయ ::: మార్చి చివరి నాటికి రాష్ట్రంలో లక్ష ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం కామేపల్లి మండలంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.జాస్తిపల్లి గ్రామంలో 3 కోట్ల 15 లక్షలతో జాస్తిపల్లి నుండి కెప్టెన్ బంజర రోడ్డు వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, లాల్యతండ గ్రామంలో 3 కోట్ల 33 లక్షలతో లాల్యతండ ఆర్ అండ్ బి రోడ్డు నుండి జగన్నాథ తండ వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, ఊటుకూరు గ్రామంలో ముత్యాలంపాడు గుడి నుండి శ్మశాన వాటిక వరకు కోటి 80 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, తాళ్ళగూడెంలో ఆర్ అండ్ బి రోడ్డు నుండి డోర్నకల్ ఆర్ అండ్ బి రోడ్డు వయా టేకులతండ, పింజరిమడుగు, పాతలింగల మీదుగా 4 కోట్ల 20 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. దీంతో పాటు ముచ్చర్ల, పింజరమడుగు గ్రామాల్లో నిర్మించిన రెండు పడక గదుల నిర్మాణాలను ప్రారంభించి, లబ్ధిదారులకు ఇళ్ల పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత పాలకులు వైఎస్సార్ హయాంలో కట్టించిన ఇందిరమ్మ ఇండ్లను అవహేళన చేస్తూ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పేదలకు నిర్మిస్తామని హామి ఇచ్చి 2 పర్యాయాలు అధికారంలోకి వచ్చి ఇండ్లు కట్టకుండా మోసం చేశారని మంత్రి మండిపడ్డారు. ముచ్చర్ల, పింజరమడుగు గ్రామాల్లో గత ప్రభుత్వం అసంపూర్తిగా ఉంచిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసామని అన్నారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇండ్లు కూడా నిర్మించలేదని, తాము అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరమే 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. మార్చి చివరి నాటికి రాష్ట్రంలో లక్ష ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేస్తున్నామని మంత్రి ప్రకటించారు. రాబోయే ఏప్రిల్ నెలలో మరో విడత ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని అన్నారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని తెలిపారు. పేదింటి మహిళలు ఇబ్బంది పడవద్దని ప్రభుత్వం సన్న బియ్యం, నూతన రేషన్ కార్డులు, 200 యూనిట్లు ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యే కోరిన రోడ్డు ఏప్రిల్ నెలలో మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఊటుకూరు గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేసి వర్షాకాలం నాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం మంజూరు చేసి అసంపూర్తిగా ఉంచిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పూర్తి చేయాలని మంత్రి దృష్టికి తీసుకొని వెళ్లి ఇక్కడ ఉన్న విద్యుత్ సమస్య, ఇతర మౌలిక వసతుల సమస్యలు పరిష్కరించామని



అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్, వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా కళాశాలలో ఎకో క్లబ్ కార్యక్రమం



ఖమ్మం, నేటి శుభోదయ ::: తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్-ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారి సారథ్యంలో ఇవ్వబడిన షెడ్యూల్ ప్రకారం వివిధ కార్యక్రమాలను ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఖమ్మంలోని ఎకో క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. దీనిలోభాగంగా ఆరవ వ కార్యక్రమంను శుక్రవారం "నేచర్ క్యాంప్" అనే కార్యక్రమంలో




భాగంగా విధ్యార్థినులు పాల్వంచ లో థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సందర్శించి విద్యుత్ తయారీ ,సరఫరా గూర్చి తెలుసుకున్నారు, తదుపరి కిన్నెరసాని ఆనకట్టను మరియూ అక్కడ జింకల పార్క్ ను సందర్శించారు.ఈ కార్యక్రమం ప్రిన్సిపల్ డాక్టర్ బానోత్ రెడ్డి అనుమతితో ఇకో క్లబ్ కన్వీనర్ డాక్టర్ వి రవి శంకర్, రామ్ కుమారస్వామి, డాక్టర్ ప్రవీణ్ కుమార్, జి సావిత్రి ఆధ్వర్యంలో సందర్శించారు.

# భార్యను రోకలి బండతో కొట్టి చంపిన భర్త అరెస్ట్

వరంగల్ ప్రతినిధి : మార్చి 13 నేటి శుభోదయ : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్ ఎస్ఆర్ నగర్ లో భార్య అనితను హత్య చేసిన భర్త అబ్బరబోయిన రాజును పోలీసులు అరెస్ట్ చేశారు.ఏనుమాముల పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జివ్వాజి సురేష్ తెలిపిన వివరాలు ప్రకారం ఎస్ఆర్ నగర్ కు చెందిన అబ్బరబోయిన రాజు అనే వ్యక్తి తన భార్య అనిత (40) పై దాడి చేసి ప్రాణాలు తీశాడు. చిన్ననాన్న కర్మకాండలకు వెళ్లి వచ్చిన అనితతో, భర్త రాజు గొడవ జరుగుతున్న సమయంలో రాజు తీవ్ర ఆగ్రహానికి లోనై ఇంట్లో ఉన్న రోకలి తీసుకున్నాడు. అనిత తలపై బలంగా కొట్టడంతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. తీవ్ర రక్తస్రావం కావడంతో గమనించిన స్థానికులు వెంటనే ఆమెను కాపాడే ప్రయత్నం చేశారు.స్థానికులు వెంటనే అనితను వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.గాయం తీవ్రంగా ఉండటంతో చికిత్స పొందుతూ మరణించింది.మద్యానికి బానిసైన రాజుకు, భార్య అనితకు తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలోనే రాజు తన భార్యను హత్య చేశాడు. మృతురాలి సోదరి సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని,నిందితుడిని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసినట్లు సీఐ సురేశ్ తెలిపారు.

# రామప్రభు ఆధ్వర్యంలో ఎఫ్ సి ఐ కాలనీ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు..




శేరిలింగంపల్లి నేటి శుభోదయ .. :మియాపూర్ 240 డివిజన్ పరిధిలోని ఎఫ్ సి ఐ కాలనీ పార్కులో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, ట్రస్ట్ చైర్మన్ మరియు కార్యక్రమ నిర్వాహకుడు అట్టేపల్లి రామప్రభు సమక్షంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాలనీ మహిళలు, చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు మరియు వినోదాన్ని అందించేందుకు మ్యూజికల్ చైర్, ప్రొటెక్ట్ యువర్ బెలూన్, ఫిల్ ది వాటర్ బాటిల్, తగ్ ఆఫ్ వార్ వంటి వినోదాత్మక ఆటలను నిర్వహించారు.పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.5,000 విలువైన గిఫ్ట్, రెండవ బహుమతిగా రూ.3,000 విలువైన గిఫ్ట్ ప్రకటించారు. అలాగే పాల్గొన్న మహిళలందరికీ ప్రోత్సాహక బహుమతులు కూడా ప్రకటించారు.ఈ సందర్భంగా అట్టేపల్లి రామప్రభు మాట్లాడుతూ మహిళలు కుటుంబ వ్యవస్థకు మూలస్తంభాలని, వారి కృషి వల్లనే సమాజం సుస్థిరంగా నిలుస్తుందని తెలిపారు. మహిళలకు గౌరవం, అవకాశాలు మరియు ప్రోత్సాహం అందించడం ద్వారా సమాజం మరింత బలపడుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమం నిర్వహణలో జయంశంకర్,విజయ్,శంకర్,సురేష్,బాబ్జి,చంద్రిక,సువీణ సింధూర,రాజేశ్వరి, మానస, ప్రీతి,అరుణ, సుమలత, నర్మద, మరియు ఎఫ్ సి ఐ కాలనీ, చిరంజీవి నగర్, అమన్ కాలనీ, ఎస్ ఆర్ ఎ స్టేట్స్, టి ఎన్ నగర్, పోట్లపల్లి రెసిడెన్సీ, హేమదుర్గ అపార్ట్మెంట్స్ కమిటీ సభ్యులు, ఎ ఆర్ పి టీమ్ సభ్యులు, కాలనీ మహిళలు, పిల్లలు, నివాసితులు కలిసి భాగస్వామ్యం అయ్యారు.సుమారు 500 మందికి పైగా సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మహిళల ఆనందోత్సాహాల మధ్య ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది

# సంగారెడ్డిలో..ఇఫ్తార్ విందు ఏర్పాట్లను పరిశీలించిన

## తూర్పు భరత్ సాయి రెడ్డి! ఈనెల 15న జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు

## సంగారెడ్డి పట్టణంలోని మిలాద్ గ్రౌండ్ లో ఇఫ్తార్ విందు



సంగారెడ్డి మార్చి 13 నేటి శుభోదయ ప్రతినిధి :సంగారెడ్డిలోటీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 15న ముస్లిం సోదరులకు ఘనంగా ఇఫ్తార్ విందు నిర్వహించనున్నారు. సంగారెడ్డి పట్టణంలోని మిలాద్ మైదానం వేదికగా ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. జగ్గారెడ్డి కుమారుడు తూర్పు భరత్ సాయిరెడ్డి మిలాద్ మైదానం వద్దకు వచ్చారు. ఇఫ్తార్ విందుకోసం జరుగుతున్న ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. సంగారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ షఫీ హాఫీజ్ తో కలిసి ఇఫ్తార్ విందుకోసం కొనసాగుతున్న పనులను చూశారు. వేల సంఖ్యలో ముస్లిం సోదరులు హాజరుకానుండటంతో అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జగ్గారెడ్డి ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా ఘనంగా ఇఫ్తార్ విందు నిర్వహిస్తున్నారు. ఈసారి కూడా భారీ స్థాయిలో ఇఫ్తార్ విందుకోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించి ఇప్పటికే దాదాపుగా పనులు పూర్తికావొచ్చాయి. ఈ పనులన్నింటినీ భరత్ సాయి రెడ్డి దగ్గర ఉండి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నేతలు బబ్బు, తాహేర్, ఆరిఫ్, మొయిజ్, నవాజ్, ఫయాజ్, ఆమీన్, ఫైజ్, నదీమ్, బాబా, అన్వర్, కౌసర్, షఫీ, యాదుల్లా, యావర్, అఫ్సర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహేష్, శాంతి తదితరులు పాల్గొన్నారు.

# తపాలా పొదుపు పథకాలపై గ్రామస్థులకు అవగాహన




శామీర్ పేట , మార్చి 13:గ్రామీణ ప్రజలకు తపాలా శాఖ అందిస్తున్న పొదుపు, బీమా పథకాలపై అవగాహన కల్పించేందుకు లాల్‌గడి మలక్‌పేట్ పోస్ట్ ఆఫీస్ ఆధ్వర్యంలో శుక్రవారం "డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్" నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ జి. సంపత్ రెడ్డి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా సంపత్ రెడ్డి మాట్లాడుతూ పోస్టాఫీస్ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్న వివిధ పొదుపు పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా సుకన్య సమృద్ధి ఖాతా, రికరింగ్ డిపాజిట్, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్, కిసాన్ వికాస్ పత్ర, నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్, తపాలా జీవిత బీమా, టైమ్ డిపాజిట్లు, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ వంటి పథకాలతో పాటు అటల్ పెన్షన్ యోజన, పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై, హెల్త్ ఇన్సూరెన్స్, ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ సేవలు ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని వివరించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అలియాబాద్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కే. మాలతి మాధవ రెడ్డి మాట్లాడుతూ పోస్టాఫీస్ అందిస్తున్న వివిధ పొదుపు పథకాలు ప్రజల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తాయని తెలిపారు. గ్రామ ప్రజలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలపడాలని కోరారు.కార్యక్రమంలో షామీర్పేట్ సబ్ పోస్ట్ మాస్టర్ పి. సుధీర్, లాల్‌గడి మలక్‌పేట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ రేణుక, వివిధ గ్రామాల బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఎల్ పీ జీ గ్యాస్ కొరత లేదు

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ మార్చ్ 13 నేటి శుభోదయ :రాష్ట్రంలో ఎల్పి.జి గ్యాస్ కొరత ఉందన్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని,ప్రజలు అపోహలకు గురికాకూడదని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.శుక్రవారం హైదరాబాద్ సచివాలయం నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ....అమెరికా - ఇరాన్ యుద్ధ పరిస్థితులను కారణంగా చూపుతూ సోషల్ మీడియాలో జరుగుతున్న గ్యాస్ కొరత ప్రచారం పూర్తిగా అవాస్తవం అని అన్నారు.రాష్ట్రంలోని బాట్లింగ్ ప్లాంట్లలో ఎక్కడా గ్యాస్ కొరత లేదని ఆయన స్పష్టం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా 810 ఎల్పిజి డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుండగా,మొత్తం కోటి 29 లక్షల ఎల్పిజి కనెక్షన్లు ఉన్నాయని,రోజుకు సగటున 2.5 లక్షల సిలిండర్లు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అయితే అపోహల కారణంగా ప్రస్తుతం బుకింగ్స్ 72 శాతం వరకు పెరిగినట్లు పేర్కొన్నారు.గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులు, విద్యాసంస్థలు,




వృద్ధాశ్రమాలు, ప్రభుత్వ సంస్థలకు ప్రాధాన్యత క్రమంలో గ్యాస్ సరఫరా కొనసాగుతుందని మంత్రి తెలిపారు.అపోహలను ఆసరాగా చేసుకుని గ్యాస్ నిల్వ చేయడం,మళ్లించడం,బ్లాక్ మార్కెటింగ్ చేయడం వంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే,ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు.ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 288 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.పరిస్థితులను పర్యవేక్షించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో హైలెవల్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.అలాగే రాష్ట్రవ్యాప్తంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు.జిల్లాల వారీగా కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి రోజువారీ నిల్వలు,సరఫరా పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు.పట్టణ ప్రాంతాల్లో 25 రోజులకు ఒకసారి,గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు ఒకసారి మాత్రమే ఎల్పిజి బుకింగ్ చేయాలని వినియోగదారులకు సూచించారు.అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేయకుండా అపోహలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ నుండి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు,పౌర సరఫరాల కమిషనర్ స్టీవెన్ రవీంద్ర పాల్గొనగా,నిజామాబాద్ కలెక్టరేట్ నుండి కలెక్టర్ ఇలా త్రిపాఠి,అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్,అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి,డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి,అరవింద్ రెడ్డి,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# హెల్మెట్ లు దరిద్దాం ప్రాణాలను కాపాడుకుందాం

## బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి




షాద్నగర్ నియోజకవర్గం నేటి శుభోదయ ప్రతినిధి మార్చి 13 :మోటార్ సైకిల్ పై ప్రయాణం చేసేవారు తప్పకుండ హెల్మెట్ ధరించి సురక్షితంగా మీ గమ్యాలకు చేరాలని అన్నారు. ప్రపంచ ల్యాబ్ టెక్నీషియన్ డే సందర్భంగా తెలంగాణ డయోగ్నోష్టిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం షాద్ నగర్ పట్టణంలో స్థానిక బుగ్గారెడ్డి గార్డెన్ లో నిర్వహించడం జరిగింది.ఈయొక్క కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అందే బాబయ్య, ఏసీపీ లక్ష్మీనారాయణ హాజరుకావడం జరిగింది. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ షాద్ నగర్ నియోజకవర్గంలో ప్రమాదాల వల్ల అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు.మోటార్ సైకిల్ పై ప్రయానించే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించే విదంగా పోలీస్ శాఖ తగు చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రతి ఒక్కరు హెల్మెట్ దరిస్తే ప్రమాధాలు తగ్గుతాయని అన్నారు. రక్తదానం చేయడం వల్ల ప్రమాధాల్లో గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణాలు నిలబెట్టిన వారు అవుతారని అన్నారు. రక్త దానం చేసిన వారిని విష్ణువర్ధన్ రెడ్డి అభినందించడం జరిగింది.ఈయొక్క కార్యక్రమంలో డాక్టర్ అనురాగ్ రెడ్డి, అరవింద్, యువసత్త లక్ష్మణ్, .పోతుల శ్రీకాంత్, అనిల్ కుమార్ గౌడ్, శ్రవణ్ కుమార్,చెవుల బాస్కర్,దినేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

## కుమ్మర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి

**కవయిత్రి మొల్ల చిరస్మరణీయురాలు - మున్సిపల్ చైర్ పర్సన్ చందన రవీందర్**



గజ్వేల్ 13 మార్చి 2026 : నేటి శుభోదయ :సిద్దిపేట గజ్వేల్ లో కుమ్మర సంఘం ఆధ్వర్యంలో ఆత్మకూరి కవయిత్రి మొల్లమాంబ 586వ జయంతి సందర్భంగా శుక్రవారం మొల్ల విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్ పాల్గొని వారు మాట్లాడుతూ రామాయణాన్ని తెలుగులో వ్రాసిన మహిళ కవయిత్రి మొల్ల చిరస్మరణయురాలు అని, మహిళా లోకానికి వారు ఆదర్శవంతురాలని అన్నారు, ఈ కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్ , 17వ వార్డు కౌన్సిలర్ నాయిని సత్యలక్ష్మి యాదగిరి 15వ వార్డు నక్క సంతోషి రాములు గౌడ్, 6వ వార్డు కౌన్సిలర్ బొగ్గుల స్వప్న సురేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మొనగారి రాజు కాంగ్రెస్ నాయకులు,గాడిపల్లి శ్రీనివాస్, జంగం రమేష్ గౌడ్ గోపాల్ రావ్, శివారెడ్డి, మరియు కుమ్మరి సంఘం సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి నాగపూరి రమేష్,గజ్వేల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కొలిచెలిమె స్వామి , గజ్వేల్ మండల అధ్యక్షులు నాగపురి బాబు ,గజ్వేల్ మండల ప్రధాన కార్యదర్శి యాదగిరి , మండల కోశాధికారి నాగపురి మహేష్ మండల యూత్ అధ్యక్షులు నాగపురి చందు,మండల వృత్తి విభాగ అధ్యక్షులు శేగ్గారి కొండలు పట్టణ ఉపాధ్యక్షులు సత్యనారాయణ వడ్డేపల్లి యాదగిరి, కుమ్మర సంఘం నాయకులు కుమ్మరి పోచయ్య, కుమ్మరి యాదగిరి, కుమ్మరి నర్సయ్య, డాకురి బాలచంద్రం డాకూరి వీరేశం కానుగుల విట్టల్, తొవ్వల నరసింహులు, బొర్ర బాబు, శివకుమార్ .కుమ్మరి స్వామి, శనిగరం శ్రీనివాస్, బెజ్జంకి కిషన్, కుకునూరు శేఖర్, ఎనగంటి దశరథం,ఎనగంటి మల్లేశం, బోనకొండ స్వామి ఎలగందుల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు

## చిన్నంబావి మండలం లో ముగిసిన రెండవ విడత వార్డు సభ్యుల శిక్షణ తరగతులు

**మండల ఇంచార్జ్ ఎంపీడీవో( ఎంపిఓ ) రామస్వామి**

**మండల జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు**




వనపర్తి జిల్లా నేటి శుభోదయ :చిన్నంబావి మండల లోని పెద్దమారూర్ గ్రామ రైతు వేదికలో మార్చి 9 నుంచి ప్రారంభమైన వార్డు సభ్యుల శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. రెండో విడత మండలంలో 9 గ్రామాలకు చెందిన 78 వార్డు సభ్యులకు వార్డు సభ్యుల విధుల, బాధ్యతలు పంచాయతీరాజ్ చట్టం పై అవగాహన శిక్షణ ఇచ్చినట్లు ఇంచార్జి ఎంపిడిఓ రామస్వామి తెలిపారు. వార్డు సభ్యులు గ్రామ పంచాయతీ విధులు, నిధులు, సభ్యుల బాధ్యతలపై శిక్షణలో నేర్చుకున్న విషయాలను గ్రామాల అభివృద్ధికి ఉపయోగించాలని ఎంపిడిఓ రామస్వామి సూచించారు. ఈ కార్యక్రమంలో టిఓటీలు రాజబాబు, గోపాల్ రెడ్డి, రాజు, బాలశేషు, పెద్దమారూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, పెద్దమారూర్ గ్రామ సర్పంచ్ కేతపగ జయమ్మ లక్ష్మయ్యతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదం కి గురైన అనుఫర్నిచర్ షాప్ ను సందర్శించిన పి ఎ సి చైర్మన్ గాంధీ..



శేరిలింగంపల్లి నేటి శుభోదయ .. శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ డివిజన్ పరిధిలోని చందానగర్ లో గల అను ఫర్నిచర్ భవనం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన కాలిపోయిన విషయం తెలియగానే సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించిన పి ఎ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ అను ఫర్నిచర్ భవనం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన పూర్తిగా దగ్ధం అవడం దురదృష్టకరం అని, చాలా బాధాకరమైన విషయం అని, ఎటువంటి ప్రాణ నష్టం జరుగలేదు కానీ, ఆస్తి నష్టం జరిగినది అని పి ఎ సి చైర్మన్ గాంధీ తెలిపారు.ఎండకాలంలో అగ్నిప్రమాదలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది అని , కావున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, వాణిజ్య భవనాలు, వ్యాపారస్తులు అగ్నిప్రమాదాలు సంభవించకుండా అవసరమైన ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అన్ని రకాల ఏర్పాట్లు చేసుకోవాలని పి ఎ సి చైర్మన్ గాంధీ తెలియచేసారు. ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని



గాంధీ తెలియచేసారు. అధైర్య పడవద్దు అని , తన వంతు సహాయ సహకారాలు ఉంటాయి అని పి ఎ సి చైర్మన్ గాంధీ తెలియచేసారు.ఈ కార్యక్రమంలో అను ఫర్నిచర్ అధినేత రమణ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు రఘుపతి రెడ్డి , రవీందర్ రావు, మాజీ కార్పొరేటర్ అశోక్ గౌడ్, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, నాగరాజు, ప్రవీణ్ రెడ్డి, నరేందర్ బల్లా, యశవంత్ రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

**- యువత ర్యాష్ డ్రైవింగ్,త్రిబుల్ రైడ్ చేస్తే కేసులు నమోదు**

**- గంజాయి తాగిన, విక్రయించిన జైలుకే**

**- పిడిఎస్ బియ్యం విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు**

**- మధిర రూరల్ పోలీస్ స్టేషన్లో జరిగిన విలేకరుల సమావేశంలో వైరా ఏసిపి ఎస్.సారంగపాణి**



ఖమ్మం, మధిర, నేటి శుభోదయ ::: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అక్రమ రవాణా ప్రభుత్వ నిబంధనలకు లోబడి రవాణా చేయాలని అలాకాకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే అట్టి ఇసుక ట్రాక్టర్ల పై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వైరా ఏసిపి సారంగపాణి తెలిపారు. శుక్రవారం రూరల్ పోలీస్ స్టేషన్లో జరిగిన విలేకరుల సమావేశంలో వైరా ఏసిపి సారంగపాణి మాట్లాడుతూ మధిర ఆంధ్ర సరిహద్దు ప్రాంతం నుండి అక్రమంగా ఇసుక తరలిస్తే సతపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అదేవిధంగా రాష్ డ్రైవింగ్ చేసిన త్రిబుల్ రైడింగ్ డ్రైవింగ్ చేసిన లైసెన్స్ ఆర్ సి హెల్మెట్ లేకుండా రోడ్డుపై వాహనాలు నడిపిన అలాంటి వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారన్నారు. అదేవిధంగా వైరా డివిజన్ పరిధిలోని గంజాయి తాగిన అమ్మకాలు చేపట్టిన అలాంటి వారిపై కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారన్నారు. ఇసుక అక్రమ రవాణా జరిగే సమాచారాన్ని ప్రజలు ఇస్తే సమాచారం ఇచ్చిన వారికి తగిన పారితోషం ఇవ్వటం జరుగుతుందని వారు తెలిపారు. ముందుగా ఇసుక రవాణా చేసే వారితో అవగాహన సమావేశం ఏర్పాటు చేసి వారికి తగిన సూచనలు ఇవ్వటం జరుగుతుందని ఆ తర్వాత ఇసుక అక్రమ రవాణా జరిగితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో మధిర సీఐలు మధు రమేష్ ,రూరల్ ఎస్సై లక్ష్మీ భార్గవి పాల్గొన్నారు.

## కొండ సురేఖకి ఘన స్వాగతం పలికినా నిజామాబాద్ కార్పొరేషన్ డిసిసి అధ్యక్షులు

**బొబ్బిలి రామకృష్ణ**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్**



మార్చ్ 13 నేటి శుభోదయ :నిజామాబాద్ కి విచ్చేసిన అటవీ శాఖ పర్యావరణ ఎండోమెంట్స్ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు కొండ సురేఖ కి ఘనంగా స్వాగతం పలికినా నిజామాబాద్ కార్పొరేషన్ డిసిసి అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ.అనంతరం నిజామాబాద్ జిల్లా నర్సింగ్ పల్లి గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమంలో నిజామాబాద్ కార్పొరేషన్ డిసిసి అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ,నిజామాబాద్ నగర మేయర్ ఉమా రాణి,ప్రముఖ చిత్ర నిర్మాత దిల్ రాజు,మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత,పిసిసి ప్రధాన కార్యదర్శి రామ్ భూపాల్,మాజీ నగర మేయర్ ఆకుల సుజాత,ఏఐసీసీ కో ఆర్డినేటర్ కప్కర్ గన్‌రాజ్,మాజీ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జగడం సుమన్ ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌షిప్‌కు దరఖాస్తులు ఆహ్వానం

**టీజీఎస్ఆర్టీసీ ఖమ్మం రీజియన్ ఆర్ ఎం సరిరామ్**



ఖమ్మం, నేటి శుభోదయ ::: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఖమ్మం రీజియన్‌లో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌షిప్ శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు.బి.కాం, బి.ఎస్సి, బి.బి.ఎ, బి.సి.ఎ, బి.ఏ మరియు ఇంజనీరింగ్/ డిప్లమా వంటి డిగ్రీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అప్రెంటిస్‌షిప్‌కు అర్హులని పేర్కొన్నారు. ముఖ్యంగా 2021 సంవత్సరం తర్వాత డిగ్రీ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.అభ్యర్థులు కేంద్ర ప్రభుత్వ ఎన్ ఏటిఎస్ 2.0 పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు ప్రక్రియ మార్చి 14, 2026 నుండి మార్చి 23, 2026 వరకు కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు.ఎంపికైన అభ్యర్థులకు టీజీఎస్ఆర్టీసీ ఖమ్మం రీజియన్ పరిధిలోని డిపోలు, వర్క్‌షాపుల్లో అప్రెంటిస్‌షిప్ శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు గడువు లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అప్రెంటిస్‌షిప్‌కు సంబంధించిన పూర్తి వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని టీజీఎస్ఆర్టీసీ ఖమ్మం రీజియన్ మేనేజర్ సరి రామ్ తెలిపారు.

## ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం చేసిన శేఖర్ రెడ్డి

**పేదోడి కళ్ళల్లో ఆనందమే లక్ష్యం**

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎల్లారం శేఖర్ రెడ్డి**








ఏనుగు మడుగు తండాలో సర్పంచ్ గోవింద్ నాయక్ గారి ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం

షాద్నగర్ నియోజకవర్గం నేటి శుభోదయ ప్రతినిధి మార్చి 13 : ప్రతి పేదవాడికి సొంతింటి కల నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వై.యం సర్పంచ్ గోవింద్ నాయక్ అన్నారు.కొత్తూరు మండలంలోని ఏనుగు మడుగు తాండ గ్రామపంచాయతీలో సర్పంచ్ సర్పంచ్ గోవింద్ నాయక్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవానికి ఎల్లారం శేఖర్ రెడ్డి,సర్పంచ్ గోవింద్ నాయక్ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేద ప్రజల సొంతింటి కల ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో సాధ్యమైందని అన్నారు.నిరుపేద ప్రజలు ఆత్మగౌరవంతో జీవించే విధంగా ప్రభుత్వం అందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నదని వారు చెప్పారు.ఈ కార్యక్రమంలో సిద్దాపూర్ సర్పంచ్ బాసు నాయక్,వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షల దృష్ట్యా పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు

**జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపియస్**

సంగారెడ్డి జిల్లా మార్చ్ 13 నేటి శుభోదయప్రతినిధి మార్చి-14 నుండి ఏప్రిల్-16 వరకు నెల రోజు పాటు జరగనున్న పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న 92 పరీక్ష కేంద్రాల వద్ద 163 బి.యన్.యస్.యస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుండి మద్యాహ్నం 12.30 గంటల వరకు జరగనున్న ఈ పరీక్షకు విద్యార్థులు సకాలంలో హాజరు కావాలసిందిగా సూచించారు. పరీక్ష కేంద్రంలోనికి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. ప్రజలు పరీక్ష కేంద్రం వద్ద గుంపులుగా తిరగడం నిషేధమని స్పష్టం చేశారు. ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఇతర ఎవరూ కూడా పరీక్ష కేంద్రంలో సెల్‌ఫోన్ వినియోగించరాదని తెలిపారు.ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్ష సమయంలో పరీక్ష కేంద్రం పరిసరాలలో 200 మీటర్ల దూరం వరకు ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించడం జరిగిందన్నారు. పరీక్షకు సంభందించి ఎలాంటి అసత్య ప్రచారాలు చేసిన నమ్మరాదని, ప్రత్యేక బందోబస్తు నడుమ పరీక్షలు జరుగుతాయని అన్నారు. తప్పుడు ప్రచారాలు చేసే వ్యక్తులపై జిల్లా పోలీసు కేంద్రం నుండి ప్రత్యేక నిఘా ఉంటుందని హెచ్చరించారు.

## మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో ఒక వ్యక్తికి న్యాయస్థానం మూడు రోజులు జైలు శిక్ష




సదాశివపేట మార్చి 13 నేటి శుభోదయ ప్రతినిధి :మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో ఒక వ్యక్తికి న్యాయస్థానం మూడు రోజులు జైలు శిక్ష విధించిన ఘటన సదాశివపేట పోలీసు స్టేషన్ పరిధి లో జరిగింది. సదాశివపేట పోలీసు వారు సదాశివపేట పట్టణంలో వెహికిల్ చెకింగ్ నిర్వహిస్తుండగా సదాశివపేట పట్టణానికి చెందిన వడిత్య సుభాష్ మద్యం సేవించి బైకు నడుపుతుండగా పోలీసులు అతడిని ఆపి బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించి మద్యం సేవించినట్లు తేలడంతో కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరు పరిచారు, కేసును విచారించిన సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ షకీల్ అహ్మద్ సిద్ధికి మూడు రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

## ఉపసర్పంచులకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

**లేకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనకు పిలుపునిస్తాం**

**అప్పటి ప్రభుత్వం అన్ని ఆలోచించే ఉపసర్పంచ్ లకు చెక్ పవర్ ఇచ్చింది**

**ఉప సర్పంచ్ల చెక్ పవర్ తీసేసే అధికారం ఎవరికి లేదు**

**కొత్తూరు పాపి రస్ పోర్ట్ లో ఉప సర్పంచ్లు మీడియా సమావేశంలో వెల్లడి**



షాద్నగర్ నియోజకవర్గం నేటి శుభోదయ ప్రతినిధి మార్చి 13 : ఉప సర్పంచ్ల చెక్ పవర్ రద్దు చేయాలని కలెక్టర్కు మెమొరండం ఇచ్చిన సర్పంచ్ లు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని పెంజర్ల ఉపసర్పంచ్ శంతన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఉప సర్పంచ్ల చెక్ పవర్ ను రద్దు చేయాలని కోరుతూ కలెక్టర్కు వినతిపత్రం ఇచ్చిన నేపథ్యంలో కొత్తూరు మండల ఉపసర్పంచ్లు పాపి రస్ పోర్ట్ లో శుక్రవారం ప్రెస్ మీట్ ను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పెంజర్ల ఉపసర్పంచ్ శంతన్ రెడ్డి మాట్లాడుతూ..అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వము అన్ని ఆలోచించే ఉపసర్పంచ్ లకు చెక్ పవర్ ఇచ్చిందన్నారు.ఉపసర్పంచ్ల చెక్ పవర్ తీసేసే అధికారం ఎవరికి లేదని చెప్పారు.ఇప్పటికైనా సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ ఉపసర్పంచ్ లకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. ఎస్ బి పల్లి ఉపసర్పంచ్ సున్నాల గణేష్ మాట్లాడుతూ..ఎర్రోళ్ల జగన్ వెంటనే క్షమాపణ చెప్పకపోతే ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం ఆయా గ్రామాల ఉపసర్పంచులు మాట్లాడుతూ.. సర్పంచులు ఉప సర్పంచులు కలిసి అభివృద్ధికి పాటుపడాలని అన్నారు.ఉప సర్పంచులు వార్డు మెంబర్లతో కలిసి అభివృద్ధి పటంలో నడవాలని సర్పంచ్లకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్లు ఎండి సిరాజ్,ఆరోగ్యం,వెంకటమ్మ, స్వరూప,స్వప్న రాందాస్,హనుమంత్ నాయక్, డోపాలా యాదయ్య,వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల సమస్యలు తీర్చిన వాడే నాయకుడు

**బూర్గుల నవీన్ కుమార్**

**బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు బూర్గుల నవీన్ కుమార్**



( నేటి శుభోదయ ప్రతినిధి మహేశ్వరం మార్చ్ 13:) రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం గ్రామంలో... 8వ వార్డు లో అభివృద్ధి పనులలో దూసుకెల్లడం జరుగుతుంది.. వార్డు సభ్యులు రాణమ్మ కుమారుడు బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు దగ్గరుండి వార్డులో ప్రతి సమస్యను తీర్చడం జరుగుతుంది సొంత ఖర్చులతో వార్డులో ప్రతి గల్లీ గల్లీలో సిసి కెమెరాలు ఏర్పాటు తోపాటు వీధిలైట్లు సొంత ఖర్చులతో రెండు బోర్లు వేయించడం అడిగిన వెంటనే సమస్యలు తీర్చడం ఎక్కడ ప్రాబ్లం ఉంది అని చెప్పిన వెంటనే స్పందించి వార్డు సభ్యులకు అందుబాటులో ఉంటూ.. గ్రామంలోనే నెంబర్ వన్ వార్డుగా నిలుపుతానని బూర్గుల రాణమ్మ కుమారుడు నవీన్ కుమార్ ఈ సందర్భంగా తెలియజేశారు

## పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత కల్వకోల్ సర్పంచ్

**బక్కని.లక్ష్మమ్మ రవి మాదిగ**

**పరిసరాల పరిశుభ్రత పై అవగాహన**

**కల్పించిన గ్రామ కల్వకోల్ సర్పంచ్ బక్కని.లక్ష్మమ్మ రవి మాదిగ**



( నేటి శుభోదయ ప్రతినిధి మహేశ్వరం మార్చ్ 13:) రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని కల్వకోల్ గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ రవి మాదిగ మాట్లాడుతూ..ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళిక కార్యాచరణ కార్యక్రమంలో భాగముగా కల్వకోల్ గ్రామంలో గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమమును నిర్వహించడం జరిగింది. మరియు సమావేశమును నిర్వహించి హెచ్పీ వ్యాక్సిన్ గురించి ఏఎన్ఎం తన యొక్క ప్రాముఖ్యత గురించి వివరించండి అంటూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది గ్రామంలో వార్డులో తడి చెత్త పొడి చెత్త గురించి ప్రజలకు అవగాహన కల్పించామన్నారు అదేవిధంగా ఖాళీగా ఉన్న వాటిలలో ఎక్కువగా నీరు ఉండి ప్రమాదకరంగా మారి డెంగ్యూ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయి ఎప్పటికప్పుడు నీటిని శుభ్రపరచుకోవాలని సర్పంచ్ లక్ష్మమ్మ రవి మాదిగ గ్రామ ప్రజలకు వివరించారు అదేవిధంగా గ్రామంలో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బందికి విధులలో ఉపయోగించే సామాగ్రి అందజేసినట్టు తెలియజేశారుఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఉప సర్పంచ్ జనార్దన్ గౌడ్ విలేజ్ సెక్రెటరీ శ్రీనివాస్ వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు



## ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కొండగారి రాములు మృతి ప్రజాతంత్ర వాదులకు, కమ్యూనిస్టులకు తీరని లోటు:బి.దత్తు నాయక్



( నేటి శుభోదయ ప్రతినిధి మహేశ్వరం మార్చి13:)మహేశ్వరం:విప్లవ యోధుడు,అమరజీవి కామ్రేడ్ కొండగారి రాములు మృతికి సిపిఐ మహేశ్వరం నియోజకవర్గ కార్యదర్శి బి. దత్తు నాయక్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి రెండు సార్లు ఎమ్మెల్యేగా సేవలందించిన కొండగారి రాములు ప్రజా సమస్యల పరిష్కారానికి,కార్మిక వర్గ హక్కుల సాధనకు నిరంతరం కృషి చేసిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు.బూర్జువా రాజకీయాలను లెక్కచేయకుండా ఎర్రజెండా నీడలో ప్రజా శ్రేయస్సు కోసం అనునిత్యం పోరాడిన ప్రజానాయకుడిగా ఆయన నిలిచారని కొనియాడారు.కొండగారి రాములు మరణం ప్రజాతంత్ర వాదులకు,కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని అన్నారు.ఈ సందర్భంగా ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు పీ.జంగారెడ్డి,మహేశ్వరం మాజీ ఎంపీపీ రఘువారెడ్డి, రామ్ రెడ్డి,మహేశ్వరం సిపిఐ మండల కార్యదర్శి పి.దేవేందర్ గౌడ్,అమీర్పేట్ వార్డ్ నం.ప్రతినిధి మంచినీళ్ల శ్రీనివాస్,రాజు తదితరులు పాల్గొని పుష్పాంజలి ఘటించారు.అభినందనలతోబి.దత్తు నాయక్ సిపిఐ మహేశ్వరం నియోజకవర్గ కార్యదర్శి.

## తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన

**- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో స్వచతర్యాలీ**




సంగారెడ్డి మార్చ్ 13 నేటి శుభోదయ ప్రతినిధి :సంగారెడ్డిమున్సిపల్ కార్యాలయం నుండి అంబేద్కర్ స్టేడియం మదిన చౌరస్తా సినిమారోడ్డు శివాజీ నగర్ నుండి ఓల్డ్ బస్టాండ్ వరకు మరియు ఓల్డ్ బస్టాండ్ అంబేద్కర్ స్టాచ్ నుండి మున్సిపల్ కార్యాలయం వరకు స్వచతర్యాలీ తీయడం జరిగింది.! ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మన మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనిత సంతోష్ కుమార్ పట్టణ సి.ఐ 38 వార్డుల కౌన్సిలర్లు.మున్సిపల్ డి.ఇ.ఇ శానిటరీ ఇన్ స్పెక్టర్ ఆర్.ఐ మున్సిపల్ సిబ్బంది కలసి పాల్గొని విజయవంతం చేశారు.



## కొనసాగుతున్న పల్లె ప్రకృతి వనంలో పనులు

**నర్సరీ తోనే గ్రామాల్లో పచ్చదనం మల్లాపూర్ సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి**



షాద్నగర్ నియోజకవర్గం నేటి శుభోదయ ప్రతినిధి మార్చి 13:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పల్లెల రూపురేఖలను మార్చేందుకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమం “పల్లె ప్రగతి..ప్రగతి ప్రణాళిక 99రోజుల పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.ఇందులో భాగంగా కొత్తూరు మండల పరిధిలోని మల్లాపూర్ గ్రామంలో సర్పంచ్ మల్లాపూర్ సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి పాలకవర్గంతో కలిసి గ్రామంలో ఉన్న నర్సరీని ప్రారంభించారు.ఈ పనులను పారిశుద్ధ్య కార్మికులు ఉపాధి హామీ సిబ్బందితో కలిసి పనులు ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..గ్రామంలో పారిశుద్ధ్యం, మొక్కలు నాటడం,విద్యుత్ సమస్యల పరిష్కారం,నర్సరీలలో శుభ్రం చేయడంతో పాటు పల్లెలను ఆదర్శ గ్రామాలుగా, హరిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ఈ ప్రణాళిక ముఖ్య ఉద్దేశ్యం అన్నారు.ఈ కార్యక్రమంలో సెక్రెటరీ రాణి, జయేందర్ రెడ్డి, మాజీ వార్డ్ సభ్యుడు చిర్ర రాజు, పాపిరెడ్డి, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు

# లైఫ్ లైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు రంజాన్ రేషన్ కిట్ల పంపిణీ




ఖమ్మం, నేటి శుభోదయ ::: స్థానిక 14వ డివిజన్ పరిధిలోని గొల్లగూడెం ( రాజన్నపేట కాలనీలో ) లైఫ్ లైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు రంజాన్ రేషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లైఫ్ లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు షేక్ జానీమియా మాట్లాడుతూ తమ సమస్త సభ్యుల సహకారంతో కాలనీలో నిరుపేద కుటుంబాలకు రంజాన్ రేషన్ కిట్లను పంపిణీ చేయడం తమ సౌభాగ్యంగా అభివర్ణించారు. అందరితోపాటు నిరుపేదలు సైతం రంజాన్ పర్వ దినోత్సవాన్ని ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకునే విధంగా తమ సంస్థ చిరు కానుకగా ఈ రంజాన్ కిట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో లైఫ్ లైన్ ఫౌండేషన్ వాలంటీర్స్ షేక్ నజీరుద్దీన్, షేక్ గౌస్ మియా, షేక్ నజీర్, షేక్ కన్నం సాహెబ్, షేక్ చిన్న జానీ మియా, షేక్ షరీఫ్, ఇమామ్, మదర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.




## 8వ వార్డు కౌన్సిలర్ కొత్త గొల్ల సోమశేఖర్ ఆధ్వర్యంలో మైనార్టీ సోదరులకు ఇఫ్తార్ విందు

**ముఖ్య అతిథులుగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింత సాయినాథ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింత గోపాల్**




సదాశివపేట మార్చి 13 నేటి శుభోదయ ప్రతినిధి :ఎనిమిదో వార్డు కౌన్సిలర్ కొత్తగొల్ల సోమశేఖర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం జరిగిందిఈ సందర్భంగా ముఖ్య నాయకులు మాట్లాడుతూ రంజాన్ మాసం ముస్లింలకు పవిత్రమైన మాసమని, రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేపడుతూ, అల్లాకు ప్రార్థనలు నిర్వహిస్తూ, అల్లా ఆశీర్వాదములు పొందుతారు అన్నారు.ఈ కార్యక్రమంలో ఫరీద్, మహిమద్దీన్, బద్దాద్, జమీర్, బందేలీ, నిజాం, అల్తాఫ్, మోహి, అజ్జు,యదు,ముస్తఫా, మొహమ్మద్,ఫయాజ్,అల్తాఫ్, అక్బర్ హుస్సేన్, కౌన్సిలర్ నసీరుద్దీన్,రత్నాకర్ రెడ్డి, కొల్కూర్ ప్రవీణ్, రామ్ రెడ్డి, అంజన్న, కాలనీ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మహేశ్వరంలో 5రోజులపాటు ఉప సర్పంచ్ వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమంలో సర్టిఫికెట్లు అందజేసిన అధికారులు




( నేటి శుభోదయ ప్రతినిధి మహేశ్వరం మార్చ్ 13:) రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని నందుపల్లి పాలకవర్గం వార్డు, సభ్యులు,సభ్యురాలు అయినటువంటి వార్డ్ మెంబర్స్ గత ఐదు రోజుల నుండి అనగా 9/3/26 నుండి 13/3/26 అనగా వరకు గ్రామపంచాయతీ పాలన పై మన మండల ప్రజా పరిషత్ కార్యాలయం మహేశ్వరం నందు ఎంపీవో ఎన్ . రవీందర్ రెడ్డి గ్రామ పాలన అవగాహన కొరకు శిక్షణ ఇవ్వడం జరిగింది. కావున ఉప సర్పంచ్ షేక్ ఎజాస్ , తోపాటు వార్డు మెంబెర్స్ దేశపాగలింగి సంతు , హసీనా, రంగుల యాదమ్మ , కల్వకోలు మహేందర్, దేశపాగ రమేష్ కర్రే సునీత, అందరికీ సూపరింటెండెంట్ రెహమాన్ స సర్టిఫికెట్స్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైనవారు పంచాయతీ కార్యదర్శి సొంటి జానయ్య, వార్డ్ మెంబర్స్ అందరూ పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు .

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న కాకి ఈశ్వర్ ముదిరాజ్



( నేటి శుభోదయ ప్రతినిధి మహేశ్వరం మార్చ్ 13:) రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిపార్ట్మెంట్ మహేశ్వరం మండల్ చైర్మన్ మహమ్మద్ ఇర్షాద్ గృహములో జరిగిన ఇఫ్తార్ విందు లో హాజరైన తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్. ముదిరాజ్ సంఘం మహేశ్వరం మండలం నాయకులు కాకి సత్యనారాయణ ముదిరాజ్. గదగుటి జంగయ్య ముదిరాజ్. కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం గ్రామ శాఖ అధ్యక్షులు బంగారుగళ్ల లాజర్. కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సమన్వయకర్త ఇందిరమ్మ కమిటీ సభ్యులు స్వర్ణగంటి సుభాష్. తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గదగుటి మహేందర్ ముదిరాజ్ .కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షులు గదగూటి హరికృష్ణ ముదిరాజ్. మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు షేక్ హాజీ బాబా. మహమ్మద్ ఖదీర్ మహమ్మద్ పాషా . మహమ్మద్ ఇబ్రహీం. మహమ్మద్ అరఫాస్ మహమ్మద్ అసాద్ తదితరులు పాల్గొన్నారు

## చిలుక ఉపేందర్ రెడ్డి జన్మదిన వేడుకలలో పాల్గొన్న దేప భాస్కర్ రెడ్డి



( నేటి శుభోదయ ప్రతినిధి మహేశ్వరం మార్చ్ 13:)మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా వాసవి కాలనీ లో నిర్వహించిన సేవా కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు & టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, మహిళలకు పారిశుద్ధ కార్మికులకు చీరాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...చిలుక ఉపేందర్ రెడ్డి నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తూ, పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేస్తున్నారు. -యువతను ఏకం చేయడంలో ఆయన పాత్ర ప్రశంసనీయం. రాబోయే రోజుల్లో ఆయన రాజకీయంగా మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని, భగవంతుడు ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలను ప్రసాదించాలని కోరుకుంటున్నాను.పార్టీ క్రమశిక్షణ గల కార్యకర్తగా, నాయకుడిగా ఆయన సేవలు మహేశ్వరంనియోజకవర్గానికి ఎంతో అవసరం,"అని పేర్కొన్నారు.

# ప్రశాంతమైన మనసుతో పరీక్షలు రాస్తే తప్పకుండా ఉత్తమ ఫలితాలు వస్తాయి చిక్కిరి శ్రీకాంత్

**10వ తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ కార్యవర్గ సభ్యులు చిక్కిరి శ్రీకాంత్**



( నేటి శుభోదయ ప్రతినిధి మహేశ్వరం మార్చ్ 13:)తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 10వ తరగతి (ఎస్ఎస్సి) పరీక్షలకు హాజరుకాబోతున్న లక్షలాది మంది విద్యార్థులకు తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ కార్యవర్గ సభ్యులు చిక్కిరి శ్రీకాంత్ శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తుకు తొలి మెట్టైన ఈ పరీక్షలను ప్రతి విద్యార్థి ధైర్యం, ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని సూచించారు. భయం,ఆందోళన, ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతమైన మనసుతో పరీక్షలు రాస్తే తప్పకుండా మంచి ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు తమలోని ప్రతిభను నమ్ముకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కోరారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తైన నేపథ్యంలో విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసి ఉజ్వల భవిష్యత్తుకు ముందడుగు వేయాలని తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ కార్యవర్గ సభ్యులు చిక్కిరి శ్రీకాంత్ ఆకాంక్షించారు.

# కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతాం: లక్ష్మారెడ్డి

**6 గ్యారెంటీలు సహా ప్రతీ పేదోడికి రేషన్ కార్డు**

**పాత జల్ పల్లి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం: కెఎల్ఆర్**




( నేటి శుభోదయ ప్రతినిధి మహేశ్వరం మార్చ్ 13:)కాంగ్రెస్ పార్టీ తెలంగాణ సమాజానికి ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు.జల్ పల్లి, ఫహాడిషరీఫ్, షహీన్‌నగర్ డివిజన్లను హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.ఓ మీడియా ఇంటర్వ్యూలో కిచ్చెన్నగారు మాట్లాడుతూ... ఉచిత విద్యుత్, బస్సు ప్రయాణం, గ్యాస్ సిలిండర్ రూ.500, పేదలకు రేషన్ కార్డులు, సన్నబియ్యం సహా అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు.వచ్చే జిహెచ్ఎంసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకే పట్టం కట్టాలని లక్ష్మారెడ్డి – కోరారు.

## మాదక ద్రవ్యాల నిరోధానికి శాఖల సమన్వయం అవసరం

అడిషనల్ కలెక్టర్ పాండు




సంగారెడ్డి, మార్చి 13 నేటి శుభోదయప్రతినిధి :యువత మత్తు పదార్థాల బారిన పడకుండా పటిష్టమైన చర్యలతో జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని అదనపు కలెక్టర్ పాండు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌తో కలిసి నార్కోటిక్స్ కోఆర్డినేషన్ జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ,యువత మాదకద్రవ్యాల రవాణా చేసినా, వినియోగించినా ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కఠిన శిక్షలు ఉంటాయన్నారు. డ్రగ్స్ నియంత్రణకు జిల్లాలోని అన్ని కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మాదకద్రవ్యాల అలవాటుకు ఎవరూ బానిసలు కావొద్దని, ఎక్కడైనా డ్రగ్స్ వినియోగం జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.అర్బన్, రూరల్ అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయా లన్నారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు, బస్ స్టాండ్లు, డ్రగ్స్ వినియోగానికి అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి గట్టి నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో డ్రగ్స్, గుడుంబా తదితర మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. కళాశాలల్లో ఏర్పాటు చేసిన డ్రగ్స్ నిరోధక కమిటీలు పటిష్టమైన నిఘాతో పనిచేయాలన్నారు. సమావేశంలో డ్రగ్స్ నిరోధానికి వివిధ కళాశాలలు, వివిధ శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు.ఈ సమావేశంలో గీతం యూనివర్సిటీ, మహేశ్వర మెడికల్ కళాశాల, ఎమ్మెన్నార్ విద్యాసంస్థలు, వోక్సెన్ యూనివర్సిటీ ప్రతినిధులు, డీడబ్ల్యువో, డీసీహెచ్ఎస్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ, ఆర్టీసీ, వ్యవసాయ, విద్యాశాఖ అధికారులు, ఆటో యూనియన్ ప్రతినిధి తదితరులు పాల్గొన్నారు.

# పెరుగు సతీష్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి శ్రీధర్ బాబు



మంథని, మార్చి -13,నేటిశుభోదయ : మంథని పట్టణంలోని పోచమ్మ వాడకు చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు పెరుగు సతీష్ ఇటీవల మరణించగా వారి ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి,నివాళ్లు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగడ సానుభూతి తెలిపిన మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు. మంత్రి వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ సహేందర్ రెడ్డి, కుడుదుల వెంకన్న, వంశీ, శశి భూషన్ కాచే, శ్రీపతి బాణయ్య కొట్టె రమేష్, కొట్టె సంపత్ పటేల్, రావికంటి సతీష్,పెరుగు తేజ,కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు తదితరులు ఉన్నారు.

## 19 గ్యాస్ సిలిండర్లు సీజ్, 7 హోటల్స్ పై కేసు నమోదు

అదనపు కలెక్టర్ డి.వేణు




మంథని/పెద్దపల్లి మార్చి-13, నేటి శుభోదయ:పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రాంతంలో నిర్వహించిన తనిఖీల్లో 19 సిలిండర్లు సీజ్ చేసి, 7 హోటల్స్ పై కేసులను నమోదు చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ డి.వేణు ఒక ప్రకటనలో తెలిపారు.పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం గోదావరిఖని ప్రాంతంలోని వివిధ హోటల్స్ లో తనిఖీలు నిర్వహించడం జరిగిందని , గృహ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న 7 హోటల్స్ పై కేసులు నమోదు చేసి 19 సిలిండర్లు సీజ్ చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# పత్తిపాకలో 'కొత్త' క్రషర్ వద్దు.

**తహసీల్దార్‌కు గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యుల వినతి**

**ఒక గుట్టను మింగేశారు.. మరో గుట్టపై కన్నేస్తారా..**

**ఉప సర్పంచ్, 11 మంది వార్డు సభ్యుల ఆధ్వర్యంలో అధికారులకు ఫిర్యాదు**



వరంగల్ ప్రతినిధి : మార్చి 13 నేటి శుభోదయ :హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాక గ్రామ శివారులో ప్రకృతి సిద్ధమైన గుట్టలను అక్రమంగా తవ్వేస్తూ, కొత్తగా మరో స్టోన్ క్రషర్ ఏర్పాటు చేసేందుకు జరుగుతున్న సన్నాహాలపై గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. ఈ మేరకు శుక్రవారం పత్తిపాక ఉప సర్పంచ్ తుడుం రాజు, వార్డు మెంబర్లు నాలికె వీర ప్రతాప్, పోతుగంటి ప్రమీల సారయ్య, గజ్జి రాజు, అంకేశ్వరపు సాయి లక్ష్మి, కొడిమాల మహేందర్, గజ్జి రమేష్, గడ్డమీది హారతి కర్ణాకర్, చిట్టి రెడ్డి పద్మ జంగారెడ్డి, ఐరబోయిన స్వప్న రాజు, కందగట్ల ప్రవీణ్ కుమార్, తుడుం స్రవంతి రాజు లిఖితపూర్వకంగా సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కు అందించారు. వినతిపత్రం సమర్పించిన అనంతరం వారు మాట్లాడుతూ.. ఇప్పటికే గ్రామంలో ఉన్న పాత క్రషర్ వల్ల ఒక పెద్ద గుట్ట పూర్తిగా కనుమరుగైందని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా గుట్ట అడుగు భాగం వరకు పాతాళాన్ని తలపించేలా తవ్వేశారని, ఇప్పుడు మరో కొత్త గుట్టపై క్రషర్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేయడం దారుణమని మండిపడ్డారు. ఈ అక్రమ ప్రక్రియను వెంటనే విరమించుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు.కొత్త క్రషర్ ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని, గ్రామ పంచాయతీ పాలకవర్గం దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. పాత క్రషర్, డాంబర్ ప్లాంట్ వల్ల ఇళ్లు పగుళ్లు పడుతున్నాయని, విచ్చలవిడి బ్లాస్టింగ్స్ వల్ల జనం భయం గుప్పిట్లో బతుకుతున్నారని వివరించారు. ప్రస్తుతం కొనసాగుతున్న పాత క్రషర్‌ను తక్షణమే నిలిపివేయాలని, కొత్త క్రషర్ ఏర్పాటు ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పత్తిపాక గ్రామ శివారులో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. గ్రామ ప్రయోజనాలను పక్కనబెట్టి క్రషర్లకు సహకరించాలని చూసే ఏ నాయకుడైనా తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. ప్రకృతిని కాపాడుకోవడానికి, రైతుల పొలాలను రక్షించుకోవడానికి ప్రజలంతా ఐక్యతతో పోరాడాలని పిలుపునిచ్చారు.



# యూసిసీఆర్ఎల్ (యంఎల్) ఓపీడీఆర్ భూదాన్ కమిటీ ముసుగులో నిరుపేదల నుంచి 3 కోట్ల రూపాయలు వసూళ్ళు

**ముఠా కోసం ముగ్గురు సీఐలతో ప్రత్యేక దర్యాప్తు బృందం**

**వెలుగుమట్ల భూ వివాదంకు సంబంధించి ఇప్పటికి 24 కేసులు నమోదు. 60 మంది నిందితులు, 11 మంది అరెస్ట్**

**– అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్ రావు**

ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో దురాక్రమణకు పాల్పడి, పేదలను మోసగించిన వారిపై ఫిర్యాదుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోందని అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్ రావు వెల్లడించారు.యూసిసీఆర్ఎల్ (యంఎల్) ఓపీడీఆర్ భూదాన్ కమిటీ సభ్యులమని తప్పుడు ప్రచారంతో వెలుగుమట్ల నిరుపేద బాధితుల నుంచి సుమారు 3 కోట్ల రూపాయల వరకు వసూళ్ళు చేసి మోసం చేశారని ఆయన చెప్పారు.పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు బాధితుల నుంచి వసూల్లు చేసిన డబ్బు మొత్తాన్ని రికవరీ చేసేదిశగా పోలీసు శాఖ చర్యలు చేపట్టిందన్నారు. వెలుగుమట్ల భూదాన్ భూములు ఇస్తామంటూ డబ్బు వసూల్లు చేసిన వారిపై జిల్లా వ్యాప్తంగా ఆరు పోలీస్ స్టేషన్లలో ఇప్పటి వరకు అందిన ఫిర్యాదుల మేరకు 24 కేసులు నమోదే చేసినట్లు చెప్పారు. వీటిలో స్టేషన్ల వారీగా ఖానాపురం హవేలీలో 19 కేసులు, రఘునాథపాలెం, కొణిజర్ల, చింతకాని, సత్తుపల్లి, ఏన్కూరు స్టేషన్లలో ఒక్కో కేసు చొప్పున మొత్తం 24 కేసులు నమోదు చేశామన్నారు. ఈ కేసుల్లో 60 మంది నిందితులు కాగా, ఇప్పటివరకు 11 మందిని అరెస్ట్ చేశామన్నారు. బాధితుల ద్వారా వివిధ పోలీస్ స్టేషన్లలో తమకు అందుతున్న ఫిర్యాదుల్లో దాదాపు నిందితుల పేర్లు ఒకే విధంగా ఉన్నాయని చెప్పారు. వెలుగుమట్ల బాధితులకు ఇచ్చిన హామీ మేరకు నిందితుల నుంచి వసూళ్ల డబ్బును రాబట్టే దిశగా చర్యలు చేపట్టామని చెప్పారు. ఇందులో భాగంగానే ముగ్గురు సర్కిల్ ఇన్స్పెక్టర్లతో సొమ్ము రికవరీకి అవసరమైన దర్యాప్తు చర్యలు తీసుకున్నామన్నారు. బాధితుల నుంచి వసూల్లు చేసిన డబ్బుతో నిందితులు ఆస్తులు సంపాదించినా, కొనుగోలు చేసినా, వాటిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. బాధితుల సొమ్మును రికవరీ చేసి వారికి అప్పగించే విషయంలో పోలీసు శాఖ చిత్తశుద్ధితో ఉందని వివరించారు. అరెస్ట్ అయిన నిందుతులు కొప్పెర వెంకన్న 42 సం,, నామవరం(వి), మోతె(ఎం), సూర్యాపేట. కొట్టే బసు, 39 సం,, వెలుగుమట్ల ఖమ్మం. ఏన్కూరు మండలం కేసుపల్లి గ్రామం. సంపంగి వెంకటాచలం 43 సం,, గోపాలపురం ఖానపురం. బల్లి శ్రీనివాసరావు, 45సం, వినోభా నవోదయ కాలనీ బుర్దా రాఘవపురం ఏన్కూరు మండలం. తాళ్లూరి కృష్ణ 50 సం,, కవిరాజునగర్, వినోభా నవోదయ కాలనీ, వెలుగుమట్ల, ఖమ్మం. ముదిగ అలియాస్ బుడిగె రాములు వెలుగుమట్ల ఖమ్మం అర్బన్. మంకిడి లింగరాజు అలియాస్ ఇంకిడి లింగ రాజు 66సం,, లచ్చగూడెం (వి), ఏన్కూరు మండలం, ప్రస్తుతం వినోభా నవోదయ కాలనీ, వెలుగుమట్ల, ఖమ్మం.రాచకొండ నరసింహా చారి అలియాస్ చారి సహకారనగర్, భూదాన్ కాలనీ, వెలుగుమట్ల, ఖమ్మం. దండా లింగయ్య 50సం,,బోసు బొమ్మ సెంటర్ ఖమ్మం.పోలెబోయిన ముత్తయ్య, యుసిసిఆర్ఐ (ఎం ఎల్), ఆర్గనైజర్. మద్దువాపల్లి (వి), కామేపల్లి మండలం.దండా లింగస్వామి లు ఉన్నారు.

# డీఈఈటీ మహీంద్రా & మహీంద్రా జాబ్ డ్రైవ్ విజయవంతం

**తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిజిఐఐసి) చైర్‌పర్సన్ శ్రీమతి నిర్మల జగ్గారెడ్డి**

సంగారెడ్డి మార్చ్ 13 నేటి శుభోదయ ప్రతినిధి :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలలో భాగంగా, డిజిటల్ ఎంప్లాయ్మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డిఈఈటి) ఆధ్వర్యంలో మహీంద్రా & మహీంద్రా ట్రాక్టర్స్, జహీరాబాద్‌లో 800కు పైగా ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించిన మెగా జాబ్ డ్రైవ్విజయవంతమైంది.

**జాబ్ డ్రైవ్ వివరాలు:**

– తేదీ: 13 మార్చి 2026

– సమయం: ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 3:00 గంటల వరకు – స్థలం: గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్, సంగారెడ్డి

**నమోదు మరియు ఫలితాలు:**

– మొత్తం నమోదులు: 756 – 1వ రౌండ్ టెలిఫోనిక్ ఇంటర్వ్యూలో ఎంపిక: 295 – జాబ్ డ్రైవ్‌లో హాజరైనవారు: 125

– ఆఫర్ లెటర్స్ అందుకున్నవారు: 78

**ఉద్యోగ అవకాశాలు:**

– ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా అభ్యర్థులకు – మెషినింగ్, ఫిట్టర్, ఎలక్ట్రిషియన్, వెల్డర్ వంటి సాంకేతిక విభాగాల్లో – క్వాలిటీ మరియు లైన్ సపోర్ట్ విభాగాల్లో

**ఉద్ఘాటన మరియు అధికారులు:**

– డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, సంగారెడ్డి – శ్రీమతి వనిత సంతోష్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్, సంగారెడ్డి – శ్రీ తుల్జ నాయక్, జనరల్ మేనేజర్, డిఐసి, సంగారెడ్డి – శ్రీ డాన్ లెవిస్, హెడ్, స్కిల్ డెవలప్‌మెంట్, మహీంద్రా & మహీంద్రా – శ్రీ వి. ఎస్. రామ్, ప్లాంట్ హెడ్, జహీరాబాద్ ప్లాంట్, మహీంద్రా & మహీంద్రా

– శ్రీ పి. వంశీధర్ రెడ్డి, డీఈఈటీ – డాక్టర్ ఎం. చంద్రశేఖర్, డీఈఈటీ ఈ సందర్భంగా, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శ్రీమతి నిర్మల జగ్గారెడ్డి ఎంపికైన అభ్యర్థులను అభినందించారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతం కావడంతో, సదాశివపేట, జహీరాబాద్, సంగారెడ్డిలో జరగనున్న జాబ్ డ్రైవ్‌లలో పాల్గొనడానికి డీఈఈటీలో నమోదు చేసుకోవాలని ఉపాధి నిమిత్తం ఉన్న యువతను ఆమె కోరారు.



## ఎర్ర సూర్యుడు కామ్రేడ్ కొండ గారి రాములు అస్తమయం.



రాజేంద్రనగర్,మార్చి13(నేటి శుభోదయ):మాజీ శాసనసభ్యులు విప్లవ యోధుడు అమరజీవి కామ్రేడ్ కొండ గారి రాములు పార్థివ దేహానికి నివాళులు అర్పిస్తున్న సిపిఐ జాతీయ సమితి సభ్యులు పాలమాకుల జంగయ్య,ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి.సిపిఐ రాష్ట్ర నాయకులకు పుస్తకాల నర్సింగ్ రావు,సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కానుగంటి పర్వతాలు,జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు,నరసింహ మహేశ్వరం నియోజకవర్గ కన్వీనర్ దత్తు నాయక్,మున్సిపల్ సంఘం జిల్లా అధ్యక్షుడు సక్రు నాయక్,ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి కావలి సురేష్,ఏసీ పి కేపీవి రాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## జిల్లాలోని వలస గుత్తి కోయ గ్రామాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది

**– కరకగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని వలస గుత్తికోయ గ్రామాలైన నీలాద్రిపేటగండి,అశ్వాపురంపాడు ప్రజలకు ఏర్పాటు చేసిన సోలార్ వీధి దీపాలు,ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**



ఖమ్మం, కొత్తగూడెం, నేటి శుభోదయ ::: కరకగూడెం పోలీసుల ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ పరిధిలోని మారుమూల వలస గుత్తి కోయ గ్రామాలైన నీలాద్రిపేటగండి, అశ్వాపురం పాడు గ్రామాలలో ప్రజలకు శుక్రవారం నీలాద్రిపేట గండి గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.ఉచిత మెగా వైద్య శిబిరంతో పాటు సోలార్ వీధి దీపాలను కూడా ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ఉచిత మెగా వైద్య శిబిరానికి సుమారుగా 70 కుటుంబాల నుండి 300 మంది ఆదీవాసీ ప్రజలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వలస గుత్తి కోయ గ్రామాలకు పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలిపారు.వలస ఆదివాసి ప్రజల సంక్షేమం,అభివృద్ధి కొరకు నిత్యం కృషి చేస్తున్నామని తెలియజేశారు.విద్య,వైద్యం,రవాణా సౌకర్యాలను వారికి కల్పించేందుకు అన్ని శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ వారికి కూడా మెరుగైన జీవితాన్ని అందించడానికి ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేసే పోలీసు అధికారులందరూ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలన్నింటిని కూడా వారికి అందే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ఎవరైనా కొత్త వ్యక్తులు తమ గ్రామాల్లోకి ప్రవేశిస్తే వెంటనే పోలీస్ వారికి సమాచారం అందించాలని కోరారు.అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు చీరలు,నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు.యువతకు టీ-షర్ట్స్ తో పాటు వాలీబాల్ కిట్లను అందజేశారు.స్కూల్ పిల్లలకు స్కూల్ బ్యాగులు,నోటుబుక్స్ తో పాటు సోలార్ స్టడీ ల్యాంప్స్ ను అందజేశారు.ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న గ్రామస్తులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గ్రామాలలో ప్రజలకు సేవాలందించిన వైద్య బృందానికి ఎస్పీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తమ గ్రామంలో సోలార్ వీధి దీపాలను ఏర్పాటు చేసినందులకు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేసి,పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ నరేందర్,మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి,ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు,ఎస్సైలు సురేష్, పి.వి.ఎన్ రావు,సిబ్బంది పాల్గొన్నారు.



## పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

**కొత్తపల్లి గ్రామపంచాయతీ 3 వార్డు సభ్యులు పోలే శివ 4 వార్డ్ సభ్యులు కంబాలపల్లి కుమార్**




ఇబ్రహీంపట్నం (నేటి శుభోదయ)ప్రతినిధి మార్చి 13:యాచారం మండల పరిధిలో ఉన్న కొత్తపల్లి జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు గ్రామపంచాయతీ 3,4, వార్డు సభ్యులు పోలే శివ, కంబాలపల్లి కుమార్ పరీక్ష ప్యాడ్లు ,మరియు పెన్నులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.విద్యార్థులు కష్టపడి ఇష్టంతో బాగా చదివి ఉన్నంత స్థాయికి ఎదగాలని కోరారు.ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కచ్చితంగా మా వంతుగా సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని అన్నారు. పదో తరగతి విద్యార్థు 100% రిజల్ట్ తీసుకొచ్చి పాఠశాలకి మీ తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. పదో తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు ఆల్ ద బెస్ట్ తెలిపారు.కార్యక్రమంలో హెచ్ఎం ఈశ్వరయ్య సారు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం

**అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలోమంత్రి పొంగులేటిశ్రీనివాసరెడ్డి**



ఖమ్మం, కామేపల్లి, నేటి శుభోదయ ::: కామేపల్లి మండలంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమశీ మరియు బీటీ రోడ్డు ప్రారంభోత్సవాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు పత్రాల పంపిణీ కార్యక్రమాల లాంటి పలు అభివృద్ధి కార్యక్రమాలలో శుక్రవారం నాడు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి ప్రధాన అనుచరుడు,మాజీ జెడ్పిటిసి, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ ఆధ్వర్యంలో పండితాపురం పశువుల సంత నుండి మధ్యాహ్నం 12 గంటలకు భారీ బైక్ ర్యాలీ జరిగింది. మొదట మల్లిబాబు యాదవ్ ఇంటిలో ఏర్పాటుచేసిన తేనెటీ విందు కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ అగ్రికల్చర్ కమిషన్ డైరెక్టర్ రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి, రాం రెడ్డి చరణ్ రెడ్డి, షేక్ పతే మహమ్మద్, ధనియాకుల హనుమంతరావు,గింజల నర్సిరెడ్డితో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ ఇందిరమ్మ రాజ్యంలో పేదలను గుర్తించి వారి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాన్ని చూసే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని, ప్రతి పేదవాడికి పథకాలు అందేటంతవరకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటానని, ఇచ్చిన మాట తప్పుకోవడం జరగదని, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ ధరావత్ అనురాధ, రాశీ రెడ్డి జగన్నాథ్ రెడ్డి ఉప సర్పంచ్ మేకల మల్లికార్జునరావు, ధరావత్ లాలు నాయక్, ఎస్.కె రబ్బానీ పాషా గుజ్జర్లపూడి రాంబాబు తోటకూరి శివయ్య, విట్టా శీను, చింటూ, పరిమిశెట్టి సాంబయ్య గుగులోతు రవి జక్కంపూడి వెంకటేశ్వర్లు, మేకల లక్ష్మీనారాయణ, పాటిబండ్ల ప్రసాద్ బాదావత్ నాగరాజు చల్ల మల్లయ్య బండి ఎల్లయ్య, బండి ఉపేందర్ దేరంగుల తిరపయ్య, జన్నారపు లింగయ్య,శీలం పుల్లయ్య దనియాకుల మాధవరావు మొగిలి శ్రీను, అయితన బోయిన విట్టల్ రావు, ఇమ్మడి రామనాథం గోపిరెడ్డి, ఏపూరి మల్లయ్య బొద్దు లక్ష్మీనారాయణ, కోలా వెంకటేశ్వర్లు రాందాస్, గబ్రు నాయక్, కొమ్మినేని శ్రీనివాసరావు, మద్దినేని రమేష్ బాబు, మంద నాగేశ్వరరావు, నల్లమోతు లక్ష్మయ్య, అధికారులు సర్పంచులు అనధికారులు, మాజీ ఎంపీటీసీ లు, ప్రజాప్రతినిధులు తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు.



# అలుపెరుగని పోరాటయోధుడు.. అస్తమించిన ఎర్ర సూరీడు

**కామ్రేడ్ కొండిగారి రాములు మరణం బాధాకరం**

**ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా సిపిఎం పార్టీ నుండి రెండు పర్యాయాలు**

ఇబ్రహీంపట్నం (నేటి శుభోదయ) ప్రతినిధి మార్చి 13:ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు మరొక ఎర్రమందారాన్ని కోల్పోయింది. కొండి గారి రాములు జీవితం భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టులోనే ఆయన ప్రస్థానంలో ఎంతగానో లెక్కించదగ్గ విలువైన ఆశయాన్ని పార్టీకి వదిలేసి వెళ్లారని చింతిస్తున్నాము. కమ్యూనిస్టు పార్టీలు ఏవైనా సిద్ధాంత పరంగా ప్రజల కోసం పీడత బాధిత కార్మిక కర్షక ప్రజల కోసం కొండిగారి పోరాటాన్ని గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన జీవనశైలే ఆయన పయనం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు అందరం మనం గుర్తు చేసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని కమ్యూనిస్టు పార్టీలు భావించాలి. ఆయన పయనం (1989-1994)ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా పని చేసిన కొండిగారి రాములు మృతి చాలా బాధాకరం.ఆరుట్లలో రకరకాల అభివృద్ధి కార్యక్రమాలు చేసి ఎన్నో రకాలుగా అభివృద్ధి చేయడం జరిగింది. ఆయన రెండుసార్లు ఎమ్మెల్యేగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. ఇబ్రహీంపట్నంలో అన్ని మండలాల అభివృద్ధిని కోరుకున్న కరుడుగట్టిన కమ్యూనిస్టు కొండగారు రాములు. మంచాల మండలం, యాచారం, కందుకూరు, ఇబ్రహీంపట్నం, హయత్ నగర్, మహేశ్వరం, ఈ మండలాల్లో పార్టీ విస్తరణకు గ్రామాల అభివృద్ధికి ఆయన చేసినటువంటి అలుపెరుగని పోరాటం, గ్రామాల అభివృద్ధి ఎంతో మనకు ఇప్పుడు ఎంతో ఆదర్శనీయం, ఆరుట్లలో గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం ఏర్పాటు లో ఎంతో కృషి చేసి గొర్రెల




లోన్లు ఇప్పించడం లోను, సీజనల్ వ్యాధులు వచ్చినప్పుడు సరియైన టీకాలు,మందులు ఇప్పించడం లోను చాలా కృషి ఉంది.అంతేకాకుండా 1996లో కురుమ సంఘం కార్యాలయం ప్రత్యేక బిల్డింగ్ కావాలని కురుమ పెద్దలు మరియు సిపిఎం కురుమ బస్తీ శాఖ అంత కలిసి ఎమ్మెల్యే కొండిగారి రాములుని పిలిచి అడగ్గా. కుల సంఘం పేరుతో వద్దు బిసి కమ్యూనిటీ హాల్ సాంక్షన్ చేస్తున్నానని అక్కడే ప్రకటించారు.అక్కడే ఉన్న అప్పటి ఎంపీపీ పగడాల యాదన్న మాజీ సర్పంచ్ శ్రీరామ్ వెంకటయ్య గార్లు మరియు కుల పెద్దలు సిపిఎం శాఖ సభ్యులు స్థలం కోసం వెతకగా అక్కడే అలుగు లో ఉన్న జాగా కోసం చాలా ప్రయత్నాలు చేసి, గొడవలు కూడా జరిగి చివరికి ఎమ్మెల్యే, ఎంపీపీ చొరవతో అధికారులతో మాట్లాడి ఆ స్థలాన్ని తీసుకోని బీసీ కమ్యూనిటీ హాల్ 1997లో ఎమ్మెల్యే కొండిగారి రాములు చేతుల మీదుగా నిర్మించడం జరిగింది.తద్వారా పగడాల యాదన్న జెడ్పిటిసి నిధులతో కొంగరి పుష్పలత సర్పంచ్ చేతుల మీదుగా ప్రహరీ గోడ కూడా నిర్మించడం జరిగింది.అప్పటి కురుమ బస్తీ శాఖ కార్యదర్శిగా ఉన్న మా నాన్న మార బీరప్ప, ఆర్ల సత్తయ్య, రావుల చంద్రయ్య, చిందం చంద్రయ్య, జోగిని యాదయ్య, బర్మల బుచ్చయ్య, వస్పరి నాగ మల్లయ్య,చెరుకు రాంచెంద్రయ్య, చిందం మల్లయ్య, కొండూరు వెంకయ్య, దోమ వెంకటయ్య,మార పుల్లయ్య,కొండూరు జంగయ్య,బైకని వెంకటయ్య, కొండన సత్తయ్య, ఆర్ల జంగయ్య, కోరే బీరప్ప, చిందం ఐలయ్య, మార యాదయ్య,ఆర్ల యాదయ్య,రావుల శ్రీశైలం (పల్ల ),చెరుకు శ్రీశైలం,చిందం యాదయ్య, చిందం బుచ్చయ్య, రావుల శ్రీశైలం, రావుల బీరప్ప,మార శ్రీశైలం మరియు చిందం ఎల్లమ్మ, గునుకుల బాలమ్మ, దొడ్డి బుచ్చమ్మ, కోరే ముత్తమ్మ తదితర మహిళలు ముందు వరుసలో ఉన్నారు.వీరితో పాటు చాలా మంది ప్రత్యక్షంగా పాల్గొన్నారు.అంతే కాకుండా తన సొంత గ్రామమైన ఆరుట్ల గ్రామానికి ఎన్నోరకాల అభివృద్ధి కార్యక్రమాలు అప్పటి సర్పంచ్ లు శ్రీరామ్ వెంకటయ్య, పెసరగాయల జంగారెడ్డి,ఎంపీపీ జడ్పీటీసీగా ఉన్న పగడాల యాదయ్య సహకారంతో అప్పటి అవసరం నిమిత్తం స్కూల్ బిల్డింగ్,రైతులకు సరిపడ గ్రామం లో కొత్త ట్రాన్స్ ఫార్మర్స్, రోడ్డు వెడల్పు, కొత్త రోడ్డు లు, వాటర్ ట్యాంక్ లు,కమ్యూనిటీ హాల్స్ మరియు చాంద్ ఖాన్ గూడా ఎక్స్ రోడ్డు నుండి బుగ్గతండా ఎక్స్ రోడ్డు 1997లో మట్టి రోడ్డుగా సాంక్షన్ చేయించడం జరిగింది.చాలా ఉన్నవి నాకు గుర్తున్నవరకు మాత్రమే.ఇలా ఎన్నో రకాల అభివృద్ధి పనులు చేసి కడవరకు నిస్వార్థంగా, నిజాయితీ గా ఉన్న మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములుకి మరొక్కసారి విప్లవ జోహార్లు.

## ప్రాధాన్యత ప్రాజెక్ట్ ల భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేయాలి

**: ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**– సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్, మున్నేరు రిటైనింగ్ వాల్, తీగల వంతెన పనుల పురోగతి పై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్**



ఖమ్మం, నేటి శుభోదయ ::: జిల్లాలో చేపడుతున్న ప్రాధాన్యత ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో ప్రాజెక్ట్ పనుల పురోగతి పై కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ కు సంబంధించి మెయిన్ కెనాల్ పనుల పూర్తిపై దృష్టి పెట్టాలన్నారు. మెయిన్ కెనాల్ కు 338 ఎకరాల భూసేకరణ కు సంబంధించి పట్టా భూసేకరణ పూర్తయినట్లు, అటవీ భూసేకరణ ప్రక్రియ చేపట్టాల్సివుందని అన్నారు. 331 ఎకరాల అటవీ భూమికి సిఏ భూమి గుర్తించాల్సివుందన్నారు. 13, 14 ప్యాకేజీల్లో 13వ ప్యాకేజీకి సంబంధించి భూసేకరణ పూర్తయినట్లు తెలిపారు. ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.మున్నేరు రిటైనింగ్ వాల్ కు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు వచ్చాయన్నారు. పోలేపల్లి లో 125 ఎకరాల ఎన్ఎస్పీ భూమిని రిటైనింగ్ వాల్ భూనిర్వాసితులకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసిందన్నారు. ప్లాట్లుగా అభివృద్ధి కి నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. మిగులు భూసేకరణ త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. వచ్చే జూన్ నెలాఖరుకు పనులు పూర్తికి కార్యాచరణ చేయాలన్నారు.తీగల వంతెన నిర్మాణంలో షాపులు కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. వంతెన నిర్మాణ పనులు నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, ఇరిగేషన్ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, ఎస్డీసి రాజేశ్వరి, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఎఫ్డివో మంజుల, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఇఫ్తార్ విందులో పాల్గొన్న వైరా ఎమ్మెల్యే మాలో రామదాసు నాయక్



వైరా నేటి శుభోదయ :వైరా మున్సిపాలిటీ పరిధిలోని మసీదులో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఇస్తారు ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొని ముస్లింలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. వైరా నియోజకవర్గంలో కూడా ముస్లింల అభివృద్ధి సంక్షేమం కోసం అదేవిధంగా వారి కష్ట సుఖాల్లో తోడుంటానని ఆయన పేర్కొన్నారు. వైరా నియోజకవర్గ ముస్లిం సోదరులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైరా మున్సిపాలిటీకి చెందిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, జిల్లా కాంగ్రెస్ డాక్టర్ సెల్ అధ్యక్షులు కాపా మురళీకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముళ్ళపాటి సీతారాములు, పల్లపు కొండలు, ప మ్మి అశోక్, పాలేటి నరసింహారావు, వేముల రత్నాకర్, షేక్,సొందు సాహెబ్, మసీదు కమిటీ అధ్యక్షులు. షేక్, నాయిబ్ రసూల్, కార్యదర్శి షేక్ అబ్దుల్ రహమాన్, యువజన అధ్యక్షుడు, షేక్ మహమ్మద్ రిజ్వాన్, ఎంఆర్ఓ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి నాయకుల అక్రమ అరెస్టులు చేయడం సిగ్గుచేటు. విద్యార్థి సంఘాల హెచ్చరిక

**–ఉద్యోగాల కోసం శాంతియుతంగా నిరసన చేయడం నేరమా..!**

**– ఏడవ గ్యారంటీని ఏటిలో ముంచిన రేవంత్ సర్కారు.**



వరంగల్ ప్రతినిధి : మార్చి 13 నేటి శుభోదయ :రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం జాబ్ క్యాలెండరును సక్రమంగా అమలు చేస్తూ వెంటనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చెయ్యాలని శాంతియుతంగా నిరసన కార్యక్రమానికి హైదరాబాదులో శుక్రవారం తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ పిలుపునిచ్చింది.ఈ నిరసన కార్యక్రమాన్ని భగ్నం చెయ్యడానికి రేవంత్ సర్కార్ పోలీసులను అడ్డుపెట్టుకొని తెల్లవారుజామున విద్యార్థి సంఘ నాయకులను అక్రమంగా అరెస్టులు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ శాంతియుతంగా తమ భావ ప్రకటన, స్వేచ్ఛను తెలిపే హక్కు విద్యార్థులు నిరుద్యోగులకు ఉందని ఇది రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఏడవ గ్యారంటీగా రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడవ గ్యారంటీని ఎట్లా ముంచేసారని విద్యార్థి సంఘ నాయకులు మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షలు ఉద్యోగాలను భర్తీ చేస్తామని విద్యార్థి నిరుద్యోగులను మోసం చేసిన రేవంత్ సర్కార్ను చీల్చి చెండాడుతామని, గత ప్రభుత్వంలో రాసిన ఉద్యోగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం నియామక పత్రాలు ఇచ్చి ఉద్యోగాల కోసం కొట్లాడే నిరుద్యోగుల పట్ల నియంతల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని, వెంటనే జాబ్ కేలండర్ ప్రకారం రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే రేపు విద్యార్థి నిరుద్యోగుల ఆధ్వర్యంలో జరగబోయే టీజీపిఎస్సి ముట్టడికి విద్యార్థి నిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు కామగోని శ్రావణ్ డిఎస్ఏ రాష్ట్ర కన్వినర్, మంద శ్రీకాంత్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, మర్రి మహేష్ పిడిఎస్యు జిల్లా కార్యదర్శి, ఎల్తూరి సాయి కుమార్ ఎస్ఎస్యు జిల్లా అధ్యక్షులు, రాచకొండ రంజిత్ పిడిఎస్యు జిల్లా కార్యదర్శి, అశోక్ సేవాలాల్ సేన రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు

**–మొల్లమాంబ : రామాయణ కర్త, ప్రసిద్ధ కవయిత్రి మొల్లమాంబ స్ఫూర్తి ప్రదాత**

**–తలకొండపల్లి కుమ్మర సంఘం మండల అధ్యక్షుడు దుర్గ పురం నగేష్**



నేటిశుభోదయ :తలకొండపల్లి :మొల్ల రామాయణ కర్త, ప్రసిద్ధ కవయిత్రి మొల్లమాంబ (ఆటుకూరి మొల్ల) జయంతి వేడుకలు ప్రతి సంవత్సరం మార్చి 13న రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలోని కవయిత్రి మల్లమాంబ విగ్రహం దగ్గర తలకొండపల్లి కుమ్మర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా మల్లమాంబ జయంతిని నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తలకొండపల్లి ఎస్ ఐ శేఖర్, తలకొండపల్లి సర్పంచ్ శేఖర్ యాదవ్,ఉపసర్పంచ్ నూకం కోటేశ్వర్ నాయకులు హాజరయ్యారు.నాయకులు మల్లమాంబ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా దుర్గాపురం నగేష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా,కుమ్మర (శాలివాహన) సంఘాల ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్,విజయవాడ వంటి ప్రదేశాలలో మొల్ల చిత్రపటం,విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు.ఈ చారిత్రక కవయిత్రి జయంతి ఉత్సవాలకు కవయిత్రి మొల్లమాంబ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని,కుమ్మర సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈ జయంతి వేడుకలకు , హాజరైన నాయకులకు ప్రముఖులకు ప్రత్యేక ధన్యవాదాలు, కవయిత్రి మల్లమాంబ పోరాటాలని పూర్తిగా తీసుకొని కుమ్మరుల హక్కుల కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని, కుమ్మర సంఘం అధ్యక్షుడు దుర్గాపురం నాగేష్ తెలిపారు. కార్యక్రమంలో కుమ్మర సంఘం నాయకులు దుర్గాపురం పాండు పెద్దూరు సర్పంచ్ కార్మికుల అనిత మల్లేష్, కానుగుల శంకర్,శానమోని పాండు,రవి గౌడ్,నిలకంఠం పాండ్, పద్మ అనిల్, దుర్గాపురం తిరుపతయ్య, దశరథం,బాలకృష్ణ, కుమార్,రవి,ఏడవెల్లి చెన్నయ్య,సత్య నారాయణ,శివుడు,ఆంజనేయులు,వార్డు సభ్యులు రాజు, గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో వంట గ్యాస్ కొరత లేదు

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సరిపోను వంట గ్యాస్ నిల్వలు**

**ప్రజలు ఎటువంటి ఆందోళన చెందొద్దు : ఖమ్మం జిల్లా కలెక్టర్**



ఖమ్మం, నేటి శుభోదయ :::జిల్లాలో సరిపోను గృహావసరాల వంట గ్యాస్ నిల్వలు ఉన్నాయని, ప్రజలు ఎటువంటి ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్యాస్ ఏజెన్సీ ల డీలర్ లు, గ్యాస్ కంపెనీల సేల్స్ ఆఫీసర్ లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి మాట్లాడుతూ అమెరికా-ఇరాన్ కు జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని తెలిపారు. ఈ దిశగా అధికారులు, గ్యాస్ డీలర్లు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గ్యాస్ కొరత ఉందని, అవసరం లేకున్నా బుకింగ్ చేసుకోవడం, ఆందోళన చెందడం వద్దని అన్నారు. జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే వంట గ్యాస్ సిలిండర్ లు వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలుంటాయని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ లకు కొరత లేదని సమావేశం లో ఆయిల్ కంపెనీల సేల్స్ అధికారులు వివరించారు. ఎల్.పి.జి. గ్యాస్ కు ఎలాంటి కొరత లేదని, అదేవిధంగా ఆసుపత్రులు, విద్యాసంస్థలు, విద్యాసంస్థలకు చెందిన వసతి గృహాలు, అంగన్వాడీ లకు గ్యాస్ సరఫరాలో ఎటువంటి అవాంతరాలు వుండవద్దని తెలిపారు. శుక్రవారం హోటళ్ళు, రెస్టారెంట్ లు తనిఖీ చేసి గృహ వసరాలకు వాడే ఎల్.పి.జి.గ్యాస్ సిలిండర్ లను వాణిజ్య అవసరాలకు వినియోగించిన వారిపై నిత్యావసర వస్తువుల చట్టం కింద 6ఏ కేసులు నమోదు చేసినట్లు, 18 సీలండర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గృహావసరాల గ్యాస్ దుర్వినియోగం, బ్లాక్ మార్కెట్ చేస్తే సహించేది లేదని, ఎస్మా యాక్ట్ ప్రకారం చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ సమావేశం లో జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. రామారావు, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా సంక్షేమ అధికారిణి విజేత, జిల్లా ఇంచార్జ్ రవాణాధికారి శ్రీనివాసరావు, ఆయిల్ సంస్థల ప్రతినిధులు,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## - ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల బోధన భేష్



ఖమ్మం రూరల్, నేటి శుభోదయ ::: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మండల పరిషత్ పాఠశాలలు ఆంగ్ల బోధనలో ముందున్నాయని తల్లంపాడు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని సర్పంచ్ అంబేద్కర్ అన్నారు. శుక్రవారం ఖమ్మం రూరల్ పరిధి లోని ప్రభుత్వ పాఠశాల తల్లంపాడు లో జరిగిన స్కూల్ డే కమ్ ఫేర్వెల్ పార్టీ వేడుక సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. విద్యార్థుల ఆంగ్ల ఉపన్యాసం అద్భుతంగా ఉందని మెచ్చుకున్నారు. పాఠశాలకు కావలసిన సదుపాయాలను కల్పించే ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు. పూర్వ ఉపాధ్యాయులు పీవీ రమణ పంపిణీచేసిన పరీక్ష ప్యాడ్ లను పెన్నులు విద్యార్థులకు అందించారు.సభకు అధ్యక్షత వహించిన పాఠశాల హెచ్ ఎం హైమావతి మాట్లాడుతూ ఎర్లీ చైల్డ్ రీడింగ్ ను విజయవంతంగా నిర్వహిస్తున్నామని, పాఠశాల ఉపాధ్యాయుల ప్రోత్సాహం అభినందనీయమని అన్నారు. ఉపాధ్యాయులు,కవి, కటుకోర్ఘ్వుల రమేష్ సభా సమన్వయం చేశారు. సభ ప్రారంభానికి ముందు విద్యార్థిని విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగలక్ష్మి,రాకేష్, విశ్రాంత ఉపాధ్యాయులు పీవీ రమణ,వార్డు కౌన్సిలర్లు అశోక్,కార్తీక్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## వికారాబాద్ భద్రత కోసం సీసీ కెమెరాలకు లంకా లక్ష్మీకాంత్ రెడ్డి విరాళం



నేటి శుభోదయ వికారాబాద్ 13 మార్చి :వికారాబాద్ పట్టణంలో నేరాల నివారణకు మరియు ప్రజల భద్రతను పెంపొందించేందుకు సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో అవసరమని భావించి, వికారాబాద్ మున్సిపాలిటీలోని 22వ వార్డ్ కౌన్సిలర్ లంకా లక్ష్మీకాంత్ రెడ్డి తన వంతు బాధ్యతగా ముందుకొచ్చారు. పట్టణంలోని ముఖ్య ప్రాంతాల్లో నూతన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి ఆయన ఒక లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వికారాబాద్ సీఐ రఘు కుమార్‌కు లక్ష రూపాయల చెక్కును ఆయన అందించారు.పట్టణంలో పెరుగుతున్న రాకపోకలు, జనసంచారం దృష్ట్యా భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని కౌన్సిలర్ లంకా లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను ముందుగానే అరికట్టడమే కాకుండా, ఎలాంటి సంఘటనలు జరిగినా వాటిని త్వరగా గుర్తించి చర్యలు తీసుకోవడానికి పోలీసులకు సహకారం అందుతుందని ఆయన పేర్కొన్నారు.పోలీసు శాఖ చేపడుతున్న సీసీ కెమెరాల ఏర్పాటు కార్యక్రమానికి సహకరించడం తన బాధ్యతగా భావించి ఈ విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు.

## బహుజన సాహితీ రత్నం ఆతుకూరి కుమ్మరి మొల్ల

### స్ఫూర్తితో మహిళా సాధికారిత సాధనకు కృషి చేయాలి

### తెలంగాణ కుమ్మర సంఘం 880/2014 రాష్ట్ర శాఖ

### తెలంగాణ ఎకనామిక్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు నేదునూరి కనకయ్య



రాజేంద్రనగర్,మార్చి13,(నేటి శుభోదయ):రామాయణాన్ని తెలుగులో సామాన్య ప్రజలకు అర్థమయ్యే ప్రజావాణిలో రచనలు చేసిన మొట్ట మొదటి తెలుగు మహా కవయిత్రి ఆతుకూరి మొల్ల మాంభ పండితులను పామరులను మెప్పించిన బహుజన రత్నం ఆతుకూరి కుమ్మరి మొల్ల అని తెలంగాణ కుమ్మర సంఘం 880/2014 రాష్ట్ర శాఖ అధ్యక్షులు,తెలంగాణ ఎకనామిక్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రచయిత కాలమిస్ట్ నేదునూరి కనకయ్య అభివర్ణించారు.హైదరాబాద్ టాంక్ బండ్ లోని తెలుగు కవయిత్రి విగ్రహం వద్ద ఆతుకూరి మొల్ల 586వ జయంతి ఉత్సవాలు తెలంగాణ రాష్ట్రీయ కుమ్మర సంఘం అధ్వర్యంలో ఘనంగా జరిగాయి.జయంతి ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ కుమ్మర సంఘం 880/2024 రాష్ట్ర శాఖ అధ్యక్షుడు'తెలంగాణ ఎకనామిక్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రచయిత కాలమిస్ట్ నేదునూరి కనకయ్య మాట్లాడుతూ..586సంవత్సరాల క్రితం మహిళలు అణిచివేతకు వివక్షకు గురై స్త్రీ విద్యకు దూరంగా ఉన్న రోజుల్లో కుమ్మర కులంలో జన్మించిన మొల్ల ధైర్యంతో ముందుకు వచ్చిన కుమ్మర మొల్ల రామాయణాన్ని మనసుకు హత్తుకునేలా రచించడంలో ప్రదర్శించిన సాహితీ ప్రతిభను స్ఫూర్తిగా తీసుకొని మహిళా లోకం మహిళా సాధికారిత సాధనకు కృషి చేయడమే లక్ష్యంగా అన్ని రంగాలలో మహిళలు రాణించాలని పిలుపునిచ్చారు.తెలంగాణ కుమ్మర సంఘం 880/2014 రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర కుమ్మర ఆత్మ గౌరవ భవన్ ట్రస్ట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లూరి అనిల్ కుమార్ మాట్లాడుతూ..మొల్లకు గురువులు లేరని సహజ కవయిత్రి అన్నారు. సమకాలీన సమాజం నుండి మొల్ల ఆదరణ గుర్తింపు పొందలేక పోయారని.మొల్లమాంభ కుమ్మర కులం ఆత్మగౌరవ ప్రతీక అని కొనియాడారు.కుమ్మర సంఘాలు స్వచ్ఛంద సంస్థలు మొల్ల రామాయణ మీద సదస్సులునిర్వహించాలని ఆతుకూరి మొల్లమాంబ జయంతినీ ప్రభుత్వం గ్రామ మండల జిల్లా కేంద్రాల్లో నిర్వహించేట్లు ఉత్తర్వులు జారీచేయాలని అన్నారు.తెలంగాణ కుమ్మర సంఘం 880/2014 రాష్ట్ర శాఖ సలహాదారులు తీగుళ్ల యాదగిరి మాట్లాడుతూ..'మొల్ల 'అంటే"మల్లె" అని అర్థం కవయిత్రి మొల్ల తన రామాయణ రచనలో మల్లెపూల సౌరభాలు సాహితీ లోకానికి అందించిన కవయిత్రిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయిందని అన్నారు.ఈ సమావేశములో అఖిల భారత కుమ్మర శాలివాహన శ్రీశైలం సత్రం ట్రస్ట్ మాజీ చైర్మన్ బండారు బిక్షపతి,తెలంగాణ రాష్ట్రీయ కుమ్మర సంఘం అధ్యక్షులు ధరిపెల్లి మహేంద్రర్,నారాయణ,ఎసిపిశ్రీనివాస్,బాడిస వీరబాబు (సేవా)వెలిజాల మల్లేష్, బొడ్డుపల్లి సత్యం రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన డీసీసీ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్



వరంగల్ ప్రతినిధి : మార్చి 13 నేటి శుభోదయ :సమాజంలో అన్ని మతాల ప్రజలు శాంతి, సౌహార్దంతో కలిసి ముందుకు సాగాలని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్ అన్నారు.వరంగల్ నగరంలోని చింతల్ ప్రాంతంలో గల జామియా మసీద్ వద్ద పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్ ఘనంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముస్లిం సోదరులు, మత పెద్దలు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఉపవాసం విరమించి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం త్యాగం, సహనం, దాతృత్వం మరియు పరస్పర గౌరవానికి ప్రతీక అని అన్నారు. ఈ పవిత్ర మాసంలో ప్రజలందరూ పరస్పరం సహకారం, స్నేహభావంతో జీవించాలని ఆకాంక్షించారు. సమాజంలో అన్ని మతాల ప్రజలు శాంతి, సౌహార్దంతో కలిసి ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా స్థానిక నాయకులు, మసీదు కమిటీ సభ్యులు మహమ్మద్ అయూబ్ ని శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, మసీదు కమిటీ సభ్యులు,డివిజన్ అధ్యక్షులు ఎస్కే సోహెల్, సీనియర్ నాయకులు కరాటే ప్రభాకర్,కమాలోద్దీన్,అరెల్లి రవి,ఎస్కే తజమ్ముల్ ఖాన్,అంజద్, సోహెల్,బారి, సిరాజ్, అక్రమ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# గ్యాస్ కృత్రిమ కొరతనా అంతర్జాతీయ కొరతనా

### గ్యాస్ కొరతా లేకుండా కేంద్ర ప్రభుత్వం చూడాల్సిన బాధ్యత

### గ్యాస్ ధరలపై కేంద్ర ప్రభుత్వం నియంత్రణ కోలిపోతుంది

### ఎం.ఆర్ శ్రీనివాస్

### గ్యాస్ ధరలు కేంద్రం నియంత్రణ చేయకుంటే ప్రజల పక్షాన ఆందోళన తప్పదు కేంద్ర ప్రభుత్వంకు హెచ్చరిక

హైదరాబాద్ మార్చ్ 13 (నేటి శుభోదయ) 2026 నూతన సంవత్సరం వేళ వాణిజ్య గ్యాస్ వినియోగదారులకు చమురు సంస్థలు భారీ షాక్ ఇచ్చాయని కేంద్ర ప్రభుత్వం ప్రజలను రోజురోజుకి మరింత ఇబ్బంది పెడుతుందని ఎం. ఆర్. శ్రీనివాసు కాంగ్రెస్ మాజీ కార్పొరేటర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19 కిలోల కమర్షియల్ సిలిండర్ ధరను ఒక్కసారిగా రూ. 111 పెంచుతూ నిర్ణయం తమ్ముడు సంస్థలు పెంచడం బిడ్డరంగా ఉందని ఆయన అన్నారు. గృహ వినియోగదారులకు మాత్రం పాత ధరలే కొనసాగుతున్నాయని, దేశంలో రాష్ట్రంలో రోజురోజుకీ కమర్షియల్ వినియోగం మరింత పెరుగుతున్న తరుణంలో సంస్థలు రేట్లు పెంచడం దయనీయమైన పరిస్థితి అని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన నగరాల్లో కమర్షియల్ సిలిండర్ ధరపై దాదాపు రూ. 111 మేర అదనపు భారం పడిందని, ముఖ్యంగా హోటళ్లు, రెస్టారెంట్లు, ధాబాలు, ఇతర వాణిజ్య అవసరాల కోసం గ్యాస్ వాడే వారికి ఈ పెంపు భారంగా మారనుందని ఆయన తెలిపారు.



### ప్రధాన నగరాల్లో తాజా ధరలు ఇలా ఉన్నాయి:

ఢిల్లీ: అంతకుముందు రూ. 1,580.50 ఉండగా, ఇప్పుడు రూ. 1,691.50కి చేరింది. ముంబై: పాత ధర రూ. 1,531.50 నుంచి రూ. 1,642.50కి పెరిగింది. కోల్‌కతా: రూ. 1,684 నుంచి రూ. 1,795కి ఎగబాకింది. చెన్నై: అత్యధికంగా రూ. 1,739.50 నుంచి రూ. 1,849.50కి చేరింది. హైదరాబాద్: నగరంలో కమర్షియల్ సిలిండర్ ధర రూ. 1,912.50కి పెరిగింది. (గతంలో ఇది రూ. 1,801.50 గా ఉండేది). గృహ వినియోగదారులకు ఊరట వ్యాపార అవసరాలకు వాడే గ్యాస్ ధరలు పెరిగినప్పటికీ, సామాన్యుడి వంటింట్లో వాడే 14.2 కిలోల గృహ వినియోగ సిలిండర్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు లేదు. వీటి ధరలను చివరిసారిగా ఏప్రిల్ 8, 2025న సవరించారని, అప్పటి నుంచి ఇప్పటివరకు అవే ధరలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో రూ. 905 వద్ద స్థిరంగా ఉందని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ కొరత క్రమంలో మరో కీలక నిర్ణయం తీసుకుంది. గ్యాస్ బుకింగ్ వెయింట్ పీరియడ్‌లో మార్పులు చేసింది. 45 రోజులకు వెయిటింగ్ పీరియడ్‌ను పెంచింది. గతంలో ఇది 25 రోజులుగా ఉండగా ఇప్పుడు మరోసారి పెంచింది. ఈ మేరకు గురువారం కేంద్ర పెట్రోలియంశాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి లోక్‌సభలో ప్రకటించారని ఆయన తెలిపారు.గ్యాస్ బుకింగ్స్‌పై కేంద్ర ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. గ్యాస్ కొరత క్రమంలో గ్యాస్ బుకింగ్ వెయిటింగ్ పీరియడ్‌ను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు 25 రోజులుగా ఉండగా.. ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు పెంచింది. ఈ మేరకు గురువారం ప్రకటన జారీ చేసింది. గతంలో గ్యాస్ వినియోగదారులు గ్యాస్ బుకింగ్ చేసుకున్నాక 21 రోజుల తర్వాత మరో గ్యాస్ బుక్ చేసుకునేందుకు అవకాశం ఉండేది. కానీ గ్యాస్ కొరత వల్ల దానిని ఇటీవల 25 రోజులకు మార్చుతూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే గ్యాస్ సంక్షోభం దేశంలో ముదురుతుండటంతో.. మరోసారి పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. దీని వల్ల గ్యాస్ కొరత తగ్గుతుందని, బ్లాక్ మార్కెట్‌కు అడ్డుకట్ట పడుతుందని కేంద్రం భావిస్తోంది. దేశంలో ముదురుతున్న సంక్షోభందేశవ్యాప్తంగా గ్యాస్ కొరత సంక్షోభం తీవ్రతరమవుతోందని, వాణిజ్య గ్యాస్ సిలిండర్ల పంపిణీని కేంద్రం నిలిపివేయడంతో హోటళ్లు, రెస్టారెంట్లకు సరఫరా ఆగిపోయిందని, దీంతో గ్యాస్ నిల్వలు లేకపోవడంతో రెస్టారెంట్లు, హోటల్స్, ఫుడ్ స్టాల్స్ అన్నీ దేశంలోని అన్ని ప్రధాన నగరాలు, పట్టణాల్లో మూత పడుతున్నాయి. దీని వల్ల వ్యాపారులకు నష్టం జరుగుతుండగా హోటల్స్‌తో పాటు రెస్టారెంట్లలో పనిచేసే సిబ్బంది ఉపాధి దెబ్బతింటుంది. ఇక స్విగ్గి, జొమాటో లాంటి ఫుడ్ డెలివరీ బాయ్స్ ఉద్యోగాలకు కూడా ముప్పు ఏర్పడుతుంది. ఇక హోస్టల్స్ కూడా బంద్ అయ్యే అవకాశం ఉండటంతో విద్యార్థులు, ఉద్యోగులు కూడా భయపడుతున్నరన్నారు. ఒకవేళ యుద్ధం ముగిసినా గ్యాస్ నిల్వలు విదేశాల నుంచి భారత్‌కు వచ్చేందుకు కొన్ని రోజుల సమయం పడుతుందని, దీంతో గ్యాస్ కొరత కొద్ది నెలల పాటు కొనసాగే అవకశముందని చెబుతున్నారని, కొన్ని నెలల పాటు గ్యాస్ వినియోగదారులు ఇబ్బందులు పడక తప్పదనే సంకేతాలు వినిపిస్తున్నాయన్నారు.

### పర్యాటక రంగానికి తీవ్ర నష్టం

హోటల్స్ అన్నీ మూతపడనుండటంతో పర్యాటక రంగానికి తీవ్ర నష్టం వాటిల్లనుందని, వీటిపై ఆధారపడి జీవనం సాగించేవారి ఉపాధి దెబ్బతిననుందని, ఇక అనేక రంగాలు దీని వల్ల కుదేలు కానున్నాయన్నారు. దీంతో గ్యాస్ సంక్షోభంపై కేంద్రం చర్యలు ప్రారంభించిందని, దేశంలో ఎల్పీజీ గ్యాస్ ఉత్పత్తిని పెంచాలని కంపెనీలకు ఆదేశాలు జారీ చేసిందని, దీంతో కంపెనీలు గ్యాస్ ఉత్పత్తిని పెంచే పనిలో స్పీడ్ పెంచాయని, ఇప్పటికే వ్యాపార, పారిశ్రామిక అవసరాల కోసం గ్యాస్ సరఫరా చేయవద్దని ఆదేశించిన కేంద్రం అని ఆయన అన్నారు.దేశంలో తమ్ముడు సమస్యలపై కేంద్ర ప్రభుత్వం ధరలు పెంపకంపై దృష్టి పెట్టాలని ఆయన కేంద్ర ప్రభుత్వం నుండి చేశారు.



# పోలీస్ శాఖలో కొలువుల జాతర

### - ఏ క్షణమైనా మెగా నోటిఫికేషన్

హైదరాబాద్, నేటి శుభోదయ ::: తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోలీస్ పోస్టుల భర్తీకి రంగం సిద్ధమైంది. యూనిఫామ్ వేసుకోవాలనే లక్ష్యంతో ఉన్న వేలాది మంది యువతీ యువకులకు ఈ ఏడాది 'మెగా నోటిఫికేషన్' లభించే అవకాశం కనిపిస్తోంది.రాష్ట్ర పోలీస్ విభాగంలో ఏటా పెరుగుతున్న ఖాళీలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి భారీ ఎత్తున నియామకాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2026 ఫిబ్రవరి చివరి నాటికి అందుబాటులో ఉన్న ఖాళీలపై ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందింది.పోలీసు శాఖ అందించిన గణాంకాల ప్రకారం.. రాష్ట్రంలో మొత్తం 95,361 పోలీసు పోస్టులు మంజూరవ్వగా, ప్రస్తుతం కేవలం 77,369 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. అంటే దాదాపు 17,992 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. శాంతి భద్రతల పరిరక్షణలో ఇబ్బందులు కలగకుండా ఉండాలంటే ఈ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని పోలీస్ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ప్రభుత్వ ఆమోదం లభించిన వెంటనే నియామక ప్రక్రియ ప్రారంభం కానుంది. పోలీస్ ఎంపిక ప్రక్రియ సుదీర్ఘంగా సాగుతుంది కాబట్టి, ముందస్తుగానే అనుమతులు కోరుతూ ప్రతిపాదనలు పంపారు.



### ఎస్సై పోస్టు ఇక 'రాష్ట్ర స్థాయి'

పోలీసు పదోన్నతులకు సంబంధించి దశాబ్దాలుగా నెలకొన్న వివాదాలకు చెక్ పెట్టేందుకు అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు జోన్ల వారీగా ఉన్న ఎస్సై పోస్టులను ఇకపై 'రాష్ట్ర స్థాయి' పోస్టులుగా మార్చబోతున్నారు. ఈ మేరకు సర్వీస్ రూల్స్‌లో మార్పులు చేస్తూ పంపిన ప్రతిపాదనలపై ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. అక్కడ ఆమోదం పొందితే, ఎస్సైల ట్రాన్స్ ఫర్, ప్రమోషన్స్ రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడైనా జరిగే అవకాశం ఉంటుంది. దీనివల్ల పదోన్నతుల ప్రక్రియ మరింత వేగవంతం కానుంది.

### - ఖాతా తెరవనున్న నోటిఫికేషన్లు

కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత భారీ ఎత్తున నియామకాలు జరగనున్న నేపథ్యంలో, అభ్యర్థులు ఇప్పటి నుంచే తమ ప్రిపరేషన్‌ను వేగవంతం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. సివిల్, ఏఆర్ విభాగాలతో పాటు ఇతర స్పెషల్ బెటాలియన్లలో కూడా పోస్టులు ఉండటంతో యూనిఫామ్ వేసుకోవాలనే కల కంటున్న వేలాది మంది యువతకు ఇది ఒక సువర్ణావకాశం అని చెప్పవచ్చు

### సుదీర్ఘ ప్రక్రియ, ముందే సన్నద్ధం కావాలి

పోలీసు ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ సాధారణ ఉద్యోగాల కంటే భిన్నంగా, క్లిష్టంగా ఉంటుంది. దేహదారుఢ్య పరీక్షలు, రాత పరీక్షల నిర్వహణకు ఎక్కువ సమయం పడుతుంది. ఈ నేపథ్యంలో, నోటిఫికేషన్ వచ్చిన వెంటనే అభ్యర్థులు సిద్ధంగా ఉండేలా పోలీస్ శాఖ ముందస్తు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపింది. ఒకసారి అనుమతి లభిస్తే, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు షెడ్యూల్‌ను విడుదల చేయనుంది.

### ప్రభుత్వ ఆమోదం కోరుతూ ప్రతిపాదనలు

శాఖలో పెరుగుతున్న పని ఒత్తిడిని తగ్గించడానికి, శాంతిభద్రతల పరిరక్షణను మరింత పటిష్టం చేయడానికి ఈ ఖాళీల భర్తీ అత్యవసరమని అధికారులు భావిస్తున్నారు. ఖాళీగా ఉన్న ఈ 18 వేల ఉద్యోగాల భర్తీకి సంబంధించి ప్రభుత్వం నుంచి తుది నిర్ణయం వెలువడితే, నిరుద్యోగులకు ఇది అతిపెద్ద శుభవార్త కానుంది.

## పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ఏన్కూర్ , (నేటి శుభోదయ) :::ఏన్కూరు మండలంలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ నాగిరెడ్డి తెలిపారు. మండలంలో ఏన్కూర్ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్, తిమ్మారావుపేట జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ఏన్కూర్ కేంద్రంలో 188 మంది, తిమ్మారావుపేట కేంద్రంలో 85 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు.పరీక్షలు సక్రమంగా నిర్వహించేందుకు సెంటర్ సూపరింటెండెంట్లు, డీవోలు, ఇన్విజిలేటర్లకు దిశానిర్దేశం చేసినట్లు పేర్కొన్నారు.పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ నాగిరెడ్డి తెలిపారు.

## మున్సిపల్ సాధారణ సమావేశానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు



మంథని, మార్చి-13 నేటి శుభోదయ:మంథని మున్సిపాలిటీలో శుక్రవారం నూతనముగా ఎన్నికైన పాలక వర్గ సభ్యుల మొదటి సాధారణ సమావేశమునకు రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పాల్గొనడం జరిగినది. మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ అధ్యక్షతన, మున్సిపల్ కమిషనర్ ఎన్.మనోహర్ నిర్వహించిన సాధారణ సమావేశములో పాలక వర్గ సభ్యులకు మంథని పట్టణ అభివృద్ధి పనుల గురించి దిశ - నిర్దేశ్యము చేశారు. వార్డుల వారిగా ఒక కమిటీని ఏర్పాటు చేసుకొని వారి సలహాలు సూచనలతో ప్రణాళిక తయారు చేసి వార్డుల యందు సమస్యలను పరిష్కరించుకోవాలని మంథని పట్టణ అభివృద్ధి చేయాలనీ తెలిపారు. ఈ కార్యక్రమములో అవసరమగు పారిశుధ్య, త్రాగునీటి, వీధి దీపాలు, మొక్కలు పెంపకం, చలివేంద్రాలు ఏర్పాటు మొదలగు వివిధ అంశాల మీద చర్చించి ఆమోదించడం జరిగింది. తదుపరి మెప్మా విభాగములో ఎస్ హెచ్ జి ఎస్ మెంబర్స్ స్వయంగా పనికి రాని వస్తువులతో తాయారు చేసిన సృజనాత్మక వస్తువులను పరిశీలించారు. ఈ కార్యక్రమములో వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, పాలక వర్గ సభ్యులు కుర్ర లింగయ్య, నూకల కమల్, మాచీడి రాజు గౌడ్, స్రవంతి మద్దికట్ల, పోతరబోయిన శ్రీలత, జంబోజు శ్రీమతి, మారుపాక నిహారిక, వేముల లక్ష్మి, యేల్లంకి వంశీధర్ , మున్సిపల్ సిబ్బంది, మెప్మా ఆర్.పి లు తదితరులు పాల్గొన్నారు.

## టిజిసిఏ హన్మకొండ జిల్లా అధ్యక్షులుగా బొల్లెపల్లి మధుకర్ ఎన్నిక



వరంగల్ ప్రతినిధి : మార్చి 13 నేటి శుభోదయ :తెలంగాణ గురుకుల కాంట్రాక్టర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ మంద శ్యామ్ కాంట్రాక్టర్స్ అందరి సమక్షంలో కమిటీ ఎన్నుకోవడం జరిగింది టిజిసిఏ జిల్లా అధ్యక్షులుగా బొల్లె మధుకర్ ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. హనుమకొండ జిల్లా పరకాల మండలం నర్సక్కపల్లి గ్రామానికి చెందిన బొల్లపల్లి మధుకర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ యొక్క జిల్లా కమిటీ కాంట్రాక్టర్స్ కు సంబంధించిన సమస్యల పైన పోరాటం చేస్తుంది అని తెలియజేశారు పూర్తిస్థాయి జిల్లా బాడిని ఎన్నుకోవడం జరిగింది ఈ సందర్భంగా మధుకర్ నా ఎన్నికకు సహకరించిన రాష్ట్ర,జిల్లా, నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## సారీ ఫంక్షన్ వేడుకలలో వనరస్ వెంకటేష్



నేటిశుభోదయ :తలకొండపల్లి తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ వాస్తవ్యులు వట్టేల శ్రీశైలం యాదవ్ మన్మరాండ్ల శ్యారీ ఫంక్షన్ (లంగా ఓణి వేడుక ) కార్యక్రమానికి హాజరైన బిఆర్ఎస్ యువ నాయకుడు వారణాసి వెంకటేష్ కార్యక్రమానికి హాజరై చిన్నారులను ఆశీర్వదించడం జరిగింది. సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ హాఫ్-సారీ ఫంక్షన్ (లంగా ఓణీ వేడుక) అనేది దక్షిణ భారతదేశంలో,ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో అమ్మాయిలు యుక్తవయస్సులోకి వచ్చినప్పుడు జరుపుకునే సాంప్రదాయ వేడుక. ఇది చిన్నతనం నుండి యవ్వనంలోకి అడుగుపెట్టడాన్ని సూచిస్తుంది.ఈ వేడుకలో అమ్మాయికి సాంప్రదాయ పట్టు వస్త్రాలను (లంగా, ఓణీ) బహుకరిస్తారు, కుటుంబ సభ్యులు ఈ సాంప్రదాయ వేడుక జరుపుకుంటారని తెలిపారు.మాజీ ఎం పి టి సి అంబాజి, పొద్దుటూరి రాజు,వట్టెల శేఖర్, పాండు,శేఖర్, తిరుపతి, రమేష్, తిరుపతయ్య, బోగ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## జహీరాబాద్ వైపు వెళ్తున్న ఒక గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టగా అక్కడికక్కడే వ్యక్తి మృతి



సదాశివపేట మార్చి 13 నేటి శుభోదయ ప్రతినిధి :తేదీ 12.03.2026 నాడు రాత్రి అందాజ 11:20 గంటల సమయమున ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి పెద్దాపూర్ పరిధిలో గల భారత పెట్రోల్ బంకు దాటిన తరువాత కొద్ది దూరం లో కాలి నడకన చీఎం -65 రోడ్డు క్రాస్ చేస్తుండగా సంగారెడ్డి వైపు నుండి జహీరాబాద్ వైపు వెళ్తున్న ఒక గుర్తు తెలియని వాహనం అట్టి వ్యక్తిని ఢీ కొట్టగా అక్కడికక్కడే అట్టి వ్యక్తి చనిపోయినాడు అట్టి మగ వ్యక్తి వయస్సు అందాజా 45-50 సంవత్సరాలు. ఎవరైనా మృతుడి ఆచూకీ తెలిసిన యెడల సదాశివపేట పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీ డి. వెంకటేష్ కి ఫోన్ నెంబర్ 8712656721 లేదా 8712583463 లకు ఫోన్ చేసి తెలుపగలరు

